శ్రమయేవ జయతే...

RNI No. TELTEL/2015/62524

# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

JOURNALIST DAIRY TELUGU DAILY

రంగారెడ్డి | సంపుటి : 9 | సంచిక : 262 | ఎడిటర్ : సితర్లల్ల శ్రీరాములు | గురువారం,ఫిబ్రవరి,2,2023 | పేజీలు : 8 | వెల : రూ.1/-


## కొన్ని రాష్ట్రాలకే ఈ బడ్జెట్ : ఎమ్మెల్సీ కవిత

జర్నలిస్ట్ డైరీ: హైదరాబాద్: ఆర్థిక మంత్రి నిర్మల సీతా రామన్ ఇవాళ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ కొన్ని రాష్ట్రాలకు చెందిన బడ్జెట్‌లా ఉందని ఎమ్మెల్సీ కవిత విమర్శిం చారు. మోదీ ప్రభుత్వం విఫలం అయ్యిందన డానికి ఈ బడ్జెటే ఊదాహరణ అనిఆమె అన్నా రు.10లక్షలఆదాయంవరకు పన్ను మినహాయింపు కల్పిస్తారని ఆశించామ ని, ఎందుకంటే తెలంగాణలో ఉ ద్యోగుల కు మంచి జీతాలుఇస్తు న్నామని, ప్రస్తు తం మంత్రి ప్రకటించిన రిబేట్ ఎవరికీ ఉపయోగపడదని ఎమ్మెల్సీ క విత తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే రాష్ట్రాలు లేదా బీజేపీ పాలిత రాష్ట్రాలకు మాత్రం లబ్ధి చేకూరేలా కేంద్రం డెవలప్మెంట్ ప్రాజెక్టులను ప్రకటిం చిందని ఎమ్మెల్సీ కవిత అన్నారు. మౌళికస దుపాయాల కల్పన కోసంపదివేల కోట్లు కేటా యిస్తున్నారని చెప్పారని, కానీ ఎటువంటి మౌళికసదుపాయాలో ఆబడ్జెట్‌లో వెల్లడించలేదని ఆమె విమర్శించారు.





### అమెరికా పర్యటనకు రావాల్సిందిగా

## మోదీకి బైడెన్ ఆహ్వానం..

న్యూ ఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ త్వరలో అమెరికా పర్యటనకు వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రధాని మోదీకి ఆహ్వానం పంపి నట్లు సమాచారం. ఈ ఏడాది ఎండాకా లంలో అమెరికా పర్యటనకు రావాల్సిందిగా మోదీని బైడెన్ కోరినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. బైడెన్ ఆహ్వానాన్ని పీఎంవో కూడా అంగీకరిం చినట్లు తెలుస్తోంది. మోదీ అమెరికా పర్యటన తేదీల విషయంలో ఇరు దేశాల నేతలు కసరత్తు చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. జీ-20 సదస్సుకు ఈ సంవత్సరం భారత్ ఆతిథ్యమి స్తున్న విషయం తెలిసిందే. ఇందుకు సంబం ధించి సెప్టెంబర్ నెలలో పలు కీలక సమావే శాలు భారత్‌లో జరగనున్నాయి. ఈ సమా వేశాలకు బైడెన్ సహా ఇతర దేశాధినేతలు భారత్‌కు రానున్నారు. అంతకు ముందే మోదీ అమెరికాలో పర్యటించనున్నట్లు తెలుస్తోంది. జూన్ లేదా జులై నెలల్లో మోదీ పర్యటన ఉండొచ్చని సమాచారం. విశ్వస నీయ వర్గాల నుంచి అందుతున్న సమాచా రం మేరకు.. అమెరికా పర్యటన సందర్భంగా యూఎస్ కాంగ్రెస్ సంయుక్త సమావేశాన్ని ఉద్దేశించి మోదీ ప్రసంగించనున్నారు. అనంతరం వైట్ హౌస్‌లో జరగనున్న విందులో కూడా పాల్గొంటారు. బైడెన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వెళ్లడం ఇది రెం డోసారి. 2021 సెప్టెంబరు నెలలో ప్రధాన మంత్రి వాషింగ్టన్‌లో పర్యటించారు.

### ఆదాయ పన్ను పరిమితి పెంపు...

# రూ.7లక్షలు...

- సాదాసీదాగా బడ్జెట్ కేటాయింపులు
- ఆదాయం రూ.7లక్షలు దాటితే 5 స్లాబుల్లో పన్ను
- రూ.7 నుంచి 9 లక్షల వరకు 5శాతం పన్ను
- కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ: ప్రధాని మోడీ చెప్పినట్లు గా ప్రపంచం యావత్తూ భారత్ బడ్జెట్ వైపు చూస్తుందన్న సూచనలు ఏవీ లేకుండా..ఎటువంటి మెరుపు లు..ఊరడింపులు.. కానరానిబడ్జెట్ ఆవిష్కృతం అయ్యింది. వరాలు కానీ,మాయలు కానీ లేకుండా సాదాసీదా గానే బడ్జెట్ కేటాయింపులు చేపట్టా రు. ఎన్నికల కోసం ప్రత్యేకంగగా ఎలాంటి తా యిలాలు ప్రకటించే ప్ర యత్నం చేయలేదు.ఆర్థిక సంవత్సరం 2023-24కు సంబంధించిన వా ర్షిక బ్జడెట్‌ను కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతా రామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు. అమృత కాలంలో ప్రవేశపెడుతున్న తొలి బడ్జెట్‌గా పేర్కొన్నారు. అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రవేశపెడుతున్న బడ్జెట్ అని పేర్కొన్నారు. ఈ సారి బడ్జెట్ రూప కల్పనలో ఏడు కీలక అంశా లకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. ఆదా యపు పన్నుల్లో శ్లాబుల వంటి ఉత్సాహం కొతం ఊరటనిచ్చే అంశం గా చెప్పుకోవాలి. మొత్తంగా సాదాసీ దాగా కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఐదోసారి తన 2023-2024 వార్షిక బడ్జెట్‌ను లో క్‌సభలో ప్రవేశ పెట్టారు. పలురా ష్ట్రాల ఎన్నికలను దృష్టి పెట్టుకుని ఉ త్సాహకరంగా ఉంటుందన్న భావన లేకుండా ముందుకు సాగారు. ఆమె బడ్జెట్ ప్రసంగం గ ంటన్నర సేపు సాగింది. ఇకపోతే ఏడు ప్రాధా న్యతా అంశాల ఆధారంగా బడ్జెట్ రూపక ల్పన సాగిందని చెప్పారు. సమ్మిళిత వృద్ధి, చివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు, మౌలిక సదు పాయలు- పెట్టుబ డులు,సామర్థ్యాల వెలికితీత, స్వచ్ఛ పర్యావరణ అనుకూల అభివృ ద్ధి, యువ శక్తి, విత్త విధానం ఆధారం గా బడ్జెట్ రూపక ల్పన చేసినట్లు నిర్మలాసీతారామన్ ప్రకటించారు. ఎన్నో అంచనాల నడుమ వార్షిక బడ్జెట్‌ను ఆవిష్క రించారు. తరుము కొస్తున్న ఆర్థిక మాంద్యం.. వచ్చే ఏడాదిలో ఎన్నికలు.. ఈనేపథ్యంలో తా యిలాల ప్రకటనా? ఆర్థిక క్రమశి క్షణా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్న నేపథ్యంలో ఎన్నో సవాళ్ల నడుమ బడ్జెట్‌ను ఆవిష్కరించారు నిర్మలా సీతా రామన్. ఈ ఏడాది సమయం లో కేంద్ర ప్రభు త్వం ఖర్చులు, ఆదాయాలను తెలియజేసేదే ఈ బ్జడెట్. అమృత కాలంలో ఇదితొలి బడ్జెట్ అని చెప్పారు నిర్మలా సీతారామన్.



జర్నలిస్ట్ డైరీ: శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి టెంపుల్ రామంతాపూర్ అంబర్పేట్ 35 సంవత్సరాల బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో రెండవ రోజు సీతారాముల సీతా రామ చంద్రుల కళ్యాణం కళ్యాణోత్సవ శివపార్వతుల కల్యాణోత్సవం పాల్గొనడం జరిగింది పాల్గొనడం తెలంగాణ టూరిజం చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా గారు చైర్మన్ గంజి రాజమౌళి గుప్తా గారు ఉడుత పురుషోత్తం గారు అధ్యక్షులు గంగిశెట్టి వెంకటేశం ప్రధాన కార్యదర్శి బోనగిరి శ్రీనివాస్ శంభు పాండయ్య గుప్తా పల్లెర్ల బిక్షపతి గట్టు ప్రకాష్ కొత్తపల్లి రమేష్ జంగయ్య గుప్తా నాగయ్య గుప్తా బోనగిరి శ్రావణ్ జూలూరు తిరుపతి గుప్తా ప్రసాద్ ఇట్యాల రాజు కొర్తివాడ శ్రీనివాస్ గుబ్బ రాజు

### పోలీస్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం వల్లే

## రాష్ట్రంలో శాంతి భద్రతలు: హోం మంత్రి



**జర్నలిస్ట్ డైరీ:** పోలీసు శాఖ తమ బాధ్య తలను సక్రమంగా నిర్వహించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమవంతు ప్రోత్సాహం ఎల్లపుడూ ఉంటుందని రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీ అన్నారు. హోం మంత్రి మహ మూద్ అలీ, రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి మల్లారెడ్డి చేతుల మీదుగా ఉప్పల్ ట్రాఫిక్ పోలిస్ స్టేషన్ నూతన భవన సముదాయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. అనంతరం జరిగిన సమవేశం లో హోం మంత్రి మహమూద్ అలీ మాట్లాడుతూ పోలీసు శాఖ తమ బాధ్య తలను సక్రమంగా నిర్వహించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమవంతు సహకారం, ప్రోత్సాహం ఎల్లప్పుడూ అందిస్తూనే ఉందని తెలిపారు. ఎన్నో నూతన పోలిస్ స్టేషన్ భవనాలు మరియు ఇతర సౌకర్యాలు కల్పించ డానికి తగిన తోడ్పాటు అందిస్తోందని పేర్కొన్నారు. సిసిటివిల నిర్వహణలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్ర స్థానంలో ఉందని, నేర దర్యాప్తులో,నేర నియంత్రణలో సిసిటివిలు ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయన్నారు. పోలీసు శాఖ రాత్రి పగలు తమ విధులను అలుపెర గకుండా నిర్వహించడం వల్లే రాష్ట్రం ప్రశాంతంగా ఉందని అభినందించారు. రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ పోలిస్ వ్యవస్థ సక్రమంగా పనిచేయడం వల్లే రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపులో ఉన్నాయని, వారికి అవసరమైన అన్ని రకాల తోడ్పాటును రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. హైదరాబాదు నగరంలో ట్రాఫిక్ సమస్య లేకపోవడం వల్లే సాఫ్ట్ వేర్ రంగం అభివృద్ధి చెందిందన్నారు. తెలంగాణ డీజీపి అంజని కుమార్ ఐ.పి.ఎస్ మాట్లాడుతూ, రాష్ట్రంలో శాంతి భద్రతల నిర్వహణలో పోలీసులు నిబద్ధతతో పని చేస్తున్నారని, పోలీసు శాఖలోని పలు విభాగాలు సమన్వయంతో పనిచేస్తూ రాష్ట్రాన్ని ప్రశాంతంగా ఉంచుతున్నా యని పేర్కొన్నారు.రాచకొండ కమిషనర్ డి.ఎస్. చౌహాన్ ఐ.పి.ఎస్ మాట్లాడు తూ, విస్తీర్ణపరంగా దేశంలోనే అతి పెద్దదైన రాచకొండ కమిషనరేట్ నేర నియంత్రణలో కూడా అగ్ర స్థానంలో ఉందని, సిసిటివిల నిర్వహణ ద్వారా నేర దర్యాప్తు అతి త్వరగా సాధ్యం అవుతోందని పేర్కొన్నారు. రాచకొండ పరిధిలో నగరంలోని పారిశ్రామిక ప్రాం తాలతో పాటు, సమీప జిల్లాల గ్రామీణ ప్రాంతాలు కూడా కలిసి ఉన్నాయని, అయినా పోలీసులు రాత్రి పగలు నిబద్ధ తతో పనిచేస్తూ నేర శాతం అదుపులో ఉంచుతూ శాంతి భద్రతలు కాపాడు తున్నారని పేర్కొన్నారు. రాచకొండ ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలూ కృషి చేస్తామని తెలిపారు.

### మన ఊరు - మన బడి కార్యక్రమంలో బాగంగా

## ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించిన ఎమ్మెల్యే మాణిక్ రావు



**జర్నలిస్ట్ డైరీ:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "మన ఊరు - మన బడి" కార్యక్రమం కింద జహీరాబాద్ పట్టణం లోని రంజోల్ లో .40.80 లక్షల MOMB నిధులతో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ను ప్రారంభించిన జహీరాబాద్ గౌరవ శాసనసభ్యులు శ్రీ కొనింటీ మాణిక్ రావు గారు, జడ్పీ ఛైర్పర్సన్ శ్రీమతి మంజు శ్రీ జైపాల్ రెడ్డి గారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ గత పాలకవర్గాల నిర్లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలు పోయాయన్నారు. తెలంగా ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా రంగ రక్షణకు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ గురుకుల పాఠశాల ఏర్పాటు చేసి పేద మధ్య తరగతి వర్గాల పిల్లలకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందిస్తుం దన్నారు అని ఆయన తెలిపా రు. గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాల ను బలోపేతం చేసేందుకు మన ఊరు మన బడి పథకంతో ఈ ఏడాది నుండి ఇంగ్లీష్ మీడియాం విద్యతో పాటు మౌలిక సదుపాయాలు అదనపు తరగతి గదులు, మంచినీటి సౌకర్యం, విద్యుత్తు మూత్రశాలలు, మరుగుదొడ్లు, కిచేన్ షెడ్లు, డైనింగ్ హాల్లు, ప్రహరీ గోడలు, డిజిటల్ క్లాస్ రూమ్స్ ల ఏర్పాటుకోసం లక్షల బడ్జెట్ను పాఠశాల విద్యా కమిటీ ఖాతాల్లో జమ చేసింది అన్నారు. ప్రభు త్వ పాఠశాలల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నాణ్యమైన విద్య తో పాటు సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం వారానికి మూడు కోడి గుడ్లు ఉచితంగా పుస్తకాలు దుస్తులు అందజేస్తూ తెలంగాణ ప్రభు త్వం విద్యార్థుల సంక్షేమంలో దేశం లోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో ఉందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల ను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి ప్రభు త్వం కల్పించే సదుపాయాలను సద్విని యోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమ ంలో జిల్లా పరిషత్ సీఈఓ ఎల్లయ్య, ఆత్మ కమిటీ చైర్మన్ పెంటారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జహీరాబాద్ పట్టణ అధ్యక్షుడు సయ్యద్ మోహియోద్దీన్, మాజీ మున్సిపల్ చైర్మన్ మంకల్ సుభాష్, వైద్యనాథ్, బసిత్, మద్దే రామ్‌రెడ్డి, సత్యం ముదిరాజ్, శంషుద్దీన్, ఇజ్రాయెల్ బాబీ, మిథున్‌రాజ్, మొహమ్మద్ యూనిస్, దీపక్ అప్పీ, గంజాయి ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

## దేవరకద్ర నియోజకవర్గంలోని పదో తరగతి విద్యార్థులకు

### 2750 అల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆల





మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజ కవర్గం అడ్డాకుల మండలం పొన్నకల్ గ్రామం లో తన తండ్రి జ్ఞాపకార్థం ఆలరఘుపతి రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సొంతంగా తయారు చేయించిన దేవరకద్ర నియోజకవర్గం లోని అన్ని మండలాలకు చెందిన పదో తరగతి విద్యార్థులకు 2750 అల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్స్‌ను పంపిణీ చేసిన దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి గారు.

# మద్యం మత్తులో పచ్చని పల్లెలు..

# ఏరులై పారుతున్న మద్యం...




**రంగారెడ్డి ప్రతినిధి :** రంగారెడ్డి జిల్లాలోని పల్లెల్లో మద్యం ఏరులై పారుతుంది.గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టు షాపులను నిర్వహిస్తున్నా ఆప్కారి అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.పలు గ్రామాల్లో మద్యం అమ్మకాలను నిషేధిస్తూ తీర్మానాలు చేసినా ఫలితం మాత్రం శూన్యం గానే ఉందనీటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉండి మద్యం నిషేదిత గ్రామాల్లో నైనా పటిష్ఠ చర్యలు చేపట్టడం లేదంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైన్ షాప్ ల నుండి అధిక ధరలకు బెల్టు షాపు ల నిర్వాహకులు కొనుగోలు చేసి గ్రామాల్లో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారు. వైన్ షాప్ నిర్వాహకులు ఎక్సైజ్ శాఖ అధికారుల కనుసన్నల్లో బెల్టు షాపుల నిర్వహణ జోరుగా సాగుతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలో 190 కి పైగా వైన్ షాపులు 120 కి పైగా బార్లు కొనసాగుతున్నాయి

**షరా మామూలే... నో చేంజ్...:** కొన్ని గ్రామాలలో మద్యం అమ్మకాలను నిషేధిస్తూ గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ ల సమక్షంలో గ్రామస్తులు మద్యపాన నిషేధం చేయాలని తీర్మానం చేశారు.మద్యం అమ్మకాలు జరిగితే భారీ జరిమానా తో పాటు చట్టపరమైన చర్యలు చేపట్టాలని పోలీస్,ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతి పత్రాలు గతంలో అందచేశారు.అయితే తీర్మానాలు అతి తక్కువ రోజులకే వీగిపోయాయి.గ్రామ పంచాయతీలలో మద్యం విక్రయాలు షరా మామూలుగానే జోరందుకున్నాయి.ఫరూఖ్ నగర్ మండలంలో సుమారు 20 గ్రామాలలో గ్రామస్తులు మద్యపానం నిషేధిస్తూ తీర్మానం చేశారు. కానీ పటిష్టమైన అమలు మాత్రం కరువైంది.ఈ నేపథ్యంలో తిరిగి మద్యం విక్రయాలు కొనసాగుతుండటంతో మద్యానికి బానిసైన కొందరు సమయపాలన లేకుండా మద్యం సేవిస్తుండడంతో ఆయా కుటుంబాలలో భార్యాభర్తల మధ్య తగాదాలు ఏర్పడుతున్నాయి.తాగుబోతు భర్తల ఆగడాలకు విసుగుచెందిన మహిళలు తీర్మానాన్ని పటిష్ఠంగా అమలు చేయక పోవడం పట్ల అధికారులపై ప్రజాప్రతినిధులపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా గ్రామాల్లో మద్యపానం పూర్తిస్థాయిలో నిషేధించి కఠిన చర్యలు చేపట్టాలని మహిళలు కోరుతున్నారు...

**దృష్టి సారించాలని ఆబ్కారీ శాఖ అధికారులు... :** షాద్నగర్ నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాలతోపాటు షాద్ నగర్ పట్టణ కేంద్రంలో బెల్టుషాపులు విచ్చలవిడిగా నిర్వహిస్తున్న ఆప్కారి శాఖ యంత్రాంగం చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు.నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 26 పైగా వైన్ షాపులు ఉన్నాయి

# విద్యారంగ అభివృద్ధికి తెలంగాణా ప్రభుత్వం కృషి



**జర్నలిస్ట్ డైరీ:** విద్యారంగ అభివృద్ధికి తెలంగాణా ప్రభుత్వం కృషి చేస్తుందని జడ్పీచైర్ పర్సన్ వేలేటిరోజారాధాకృష్ణశర్మ అన్నారు. సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలమ్ పద్మనాభునిపల్లి, మిరుదొడ్డి మండలకేంద్రంలో మనఊరు–మనబడి కార్యక్రమంలో నిర్మించిన పాఠశాలలను బుధవారము 1.2.2023 నాడు ఆమె ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వమ్ విద్యారంగానికి అధిక నిధులు కేటాయిస్తూ మౌలిక సదుపాయాల కల్పనకు కృషిచేస్తుందన్నారు. మనఊరు–మనబడి కార్యక్రమంవల్ల పాఠశాలలకు అన్ని సౌకర్యాలు సమకూరుతున్నాయన్నారు. పేదవిద్యార్థుల శ్రేయస్సుకోసమ్ ప్రభుత్వమ్ ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతుల కల్పిస్తుందన్నారు. నాణ్యమైన ఉచితవిద్య పేదవిద్యార్థులకు అందించడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వమ్ కృషిచేసుందన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వపాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. సిద్ధిపేట జిల్లాలో మనఊరు–మనబడి క్రింద మొదటగా నిర్మించిన 36 పాఠశాలలను ఈరోజు ప్రారంభించుకోవడంజరిందన్నారు. మంత్రి హరీష్ రావు గారి ప్రత్యేక చొరవతో అందిస్తున్న డిజిటల్ కాంటెంట్ బుక్స్ ను మిరుదొడ్డి జిల్లాపరిషత్ పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు ఈసందర్భంగా అందజేశారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ అడిషనల్ కలెక్టర్ ముజామిల్ ఖాన్ జడ్పీటీసీలు రవీందర్ రెడ్డి ,లక్ష్మిలింగమ్ ,ఎంపీపీలు పుష్పలతకిషన్ రెడ్డి, గజ్జెల సాయిలు, Amc చైర్మన్లు Dccb డైరెక్టర్ బక్కివెంకటయ్య సర్పంచులు ఎంపీటీసీలు పాల్గొన్నారు.



# ఎట్టకేలకు అన్న క్యాంటీన్లకు మోక్షం..

టీడీపీ ప్రభుత్వం అట్టహాసంగా ప్రారంభించిన అన్న క్యాంటీన్లను వైసీపీ అధికారంలోకి రాగానే ఆపివేసింది. క్యాంటీన్లలో భోజనం, టిఫిన్ అమ్మకాలకు స్వస్తి పలకడమే కాకుండా.. వాటికి తాళాలు వేసింది. చాలా చోట్ల ఇలాంటి అన్న క్యాంటీన్లు వార్డు సచివాలయాలుగా మారిపోయాయి. మిగిలిన చోట్ల తాళాలు వేసిన క్యాంటీన్ నిర్మాణాలు వెక్కిరిస్తున్నాయి. రెండేళ్లవుతున్నా వాటిని నిరుపయోగంగా పడేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించిన వైసీపీ ప్రభుత్వం క్యాంటీన్లను ఆప్కో షో రూమ్ లు గా మార్చేందుకు సిద్ధమైంది. అన్న క్యాంటీన్లలో ఆప్కో షోరూమ్ ల ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. దాదాపుగా అన్ని పట్టణాలు, మున్సిపల్ ఏరియాల్లో అన్న క్యాంటీన్లను టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ముఖ్యమైన కూడళ్లలోనే వీటిని ఏర్పాటు చేశారు. దీంతో ఇవి షోరూమ్ లు గా పనికొస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. మంచి బిజినెస్ ఏరియాల్లో క్యాంటీన్లు ఉండటంతో.. ఆప్కో షోరూమ్ లకు పబ్లిసిటీ బాగుంటుందని చెబుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 109 ఆప్కో షోరూమ్ లు ఉన్నాయి.

వీటికి అదనంగా మరో 50ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు అధికారులు. వీటికి తోడు ఇప్పుడు అన్న క్యాంటీన్లను ఆప్కో షోరూమ్ లుగా మార్చబోతున్నారు. ఇప్పటివరకు ఆప్కో వస్త్రాలయాల్లో పెద్దవారికి మాత్రమే బట్టలు ఉంటాయని, యూత్ కి, చిన్న పిల్లలకు అక్కడ ఉపయోగపడేవి ఏవీ ఉండదనే అభిప్రాయం ఉ



ంది. నేతచీరలు,పంచెలతోపాటు.. ఇప్పుడు ఆప్కో వస్త్రాలయాలు ట్రెండీగా మారబోతున్నాయి. యువతకోసం చుడీదార్లు, డ్రెస్ లు, కాటన్ షర్ట్స్.. అందుబాటులో ఉంచుతారు. నాణ్యతతోపాటు, ప్రైవేట్ మార్కెట్ తో పోల్చి చూస్తే తక్కువ ధరకు వీటిని విక్రయిస్తారని, వినియోగదారులనుంచి మంచి మద్దతు ఉంటుందని భావిస్తున్నారు. మార్చి 15నాటికి అన్న క్యాంటీన్లలో ఆప్కో షోరూమ్ లు దర్శనమిస్తాయనమాట. మున్సిపల్ ఎన్నికలకు ముందుగానే ఈ ఏర్పాట్లన్నీ పూర్తయ్యేలా ప్లాన్ చేస్తున్నారు అధికారులు. ఆల్రడీ ఉన్న నిర్మాణాలనే వాడుకుంటారు కాబట్టి, ఎన్నికల కోడ్ అడ్డు వచ్చే అవకాశం లేదంటున్నారు

# లక్ష్యం దాటిన యాసంగి

హైదరాబాద్, : యాసంగి సాగు లక్ష్యం దాటింది. వ్యవసాయశాఖ నివేదిక ప్రకారం 63.13 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యాయి. ఈ యాసంగిలో ఉద్యాన పంటలను మినహాయిస్తే మొత్తం 63 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకున్నది. ఇప్పటికే లక్ష్యం దాటి సాగయ్యాయి. గత యాసంగితో పోల్చితే 23.28 లక్షల ఎకరాల్లో అధికంగా పంటలు వేశారు. గతేడాది ఇదే సమయానికి 39.84 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగయ్యాయి. ఈ యాసంగిలో వరినాట్లు రికార్డుస్థాయిలో దూసుకుపోతున్నాయి. ప్రభుత్వం 50 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేయాలని ప్రణాళిక రూపొందించగా.. ఇప్పటికే 49.16 లక్షల ఎకరాల్లో పూర్తయ్యాయి. ఇతర పంటలు లక్ష్యానికి అటు ఇటుగా సాగయ్యాయి. జొన్నలు లక్ష ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యం పెట్టుకోగా.. 1.14 లక్షల ఎకరాల్లో సాగైంది. శనగ 3.33 లక్షలు, వేరుశనగ 2.49 లక్షలు, నువ్వులు 52,830, మినుములు 44 వేలు, పెసర్లు 31 వేల ఎకరాల్లో సాగయ్యాయి. యాసంగిలో సాగులో నిజామాబాద్, నల్లగొండ జిల్లాలు టాప్‌లో నిలిచాయి. 4.77 లక్షల ఎకరాలతో నిజామాబాద్ తొలిస్థానంలో, 4.72 లక్షల ఎకరాలతో నల్లగొండ రెండోస్థానంలో నిలిచాయి.

ఆ తర్వాతి స్థానాల్లో సూర్యాపేట (4.21 లక్షలు), కామారెడ్డి (3.59



లక్షలు) ఉన్నాయి. గత సీజన్‌తో పోల్చితే మెజార్టీ జిల్లాల్లో రెట్టింపు సాగు జరిగింది. కాగా, మక్కల సాగుపై రైతులకు మక్కువ తగ్గడం లేదు. గత సీజన్‌తో సమానంగా ఈసారి మక్కలు సాగుచేశారు. గత యాసంగిలో ఈ సమయానికి 4.09 లక్షల ఎకరాల్లో మక్కలు వేయగా.. ఈసారి కూడా అంతేస్థాయిలో వేయడం గమనార్హం.

2 కోట్ల ఎకరాలకు చేరువలో..: తెలంగాణలో ఈ ఏడాది రికార్డుస్థాయిలో సాగు నమోదుకానున్నది. వానకాలం, యాసంగి సీజన్లు కలిపితే కొన్నిరోజుల్లో ఈ ఏడాది సాగు మొత్తం 2 కోట్ల ఎకరాలకు చేరనున్నది. వానకాలంలో 1.35 కోట్ల ఎకరాలు సాగు కాగా యాసంగిలో ఇప్పటివరకు 63 లక్షల ఎకరాల్లో పంటలు వేశారు. మరో 1.23 లక్షల ఎకరాల్లో సాగైతే తెలంగాణ నూతన అధ్యాయం లిఖించనున్నది.

# టెట్ అభ్యర్థులకు నిరాశే

హైదరాబాద్: పాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వం సుముఖంగా లేదు. దీనిపై ప్రభుత్వం శీతకన్ను ప్రదర్శిస్తున్నదని అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. 2017, జులై 23న చివరిసారిగా రాష్ట్రంలో టెట్ రాతపరీక్షలు జరిగాయి. మూడేండ్లుగా (43 నెలలు) టెట్ నోటిఫికేషన్ కోసం సుమారు 4 లక్షల మందికిపైగా అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. దీనివల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ఆర్థిక భారం పడదు. పరీక్ష ఫీజు వల్ల ప్రభుత్వానికే కొంత ఆదాయం వస్తుంది. అయినా టెట్ నిర్వహణపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నది. అయితే ఉపాధ్యాయ ఖాళీల భర్తీపైనే రాష్ట్ర ప్రభుత్వం విముఖత ప్రదర్శిస్తున్నది. 8,972 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి 2017, అక్టోబర్‌లో ఉపాధ్యాయ నియామక పరీక్ష (టీఆర్టీ) ప్రకటించింది. ఆ నియామకాలే ఇంకా పూర్తి కాలేదు. కొన్ని పోస్టులు ఇంకా భర్తీ చేయాల్సి ఉన్నది. ఇంకోవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టడం లేదు. అన్ని శాఖల్లోని ఉద్యోగులకు పదోన్నతులు ఇచ్చిన విషయం తెలిసిందే. కానీ విద్యాశాఖలో మాత్రం పదోన్నతులు ఇవ్వడం లేదు. ఖాళీలు ఏర్పడతాయనే పదోన్నతులను చేపట్టడం లేదని ఉపాధ్యాయ సంఘాలు విమర్శిస్తున్నాయి. ఆ ఖాళీల భర్తీకి టీఆర్టీ ప్రకటించాలని ప్రభుత్వంపై అభ్యర్థుల నుంచి ఒత్తిడి పెరుగుతుందనే టెట్‌ను నిర్వహించకుండా వాయిదా వేస్తున్నట్టు తెలుస్తున్నది.త్వరలోనే 50 వేల కొలువులు భర్తీ చేస్తామని ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు గతంలో ప్రకటించారు. దీంతో ఉపాధ్యాయ కొలువులు 12 వేలకుపైగా ఉంటాయనీ, గురుకులాల్లోనూ ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అవుతాయని అంతా భావించారు. టెట్ నిర్వహణకు పాఠశాల విద్యాశాఖ సమాలోచన చేసింది. కోవిడ్ నేపథ్యంలో టెట్‌ను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని భావించింది. అందుకనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించింది. ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదు. అయితే డీఎడ్, బీఎడ్ అభ్యర్థులు లక్షలాది మంది ఇప్పటికే కోచింగ్ బాట పట్టారు. టెట్ నోటిఫికేషన్ జారీ చేయకుండా అభ్యర్థుల ఆశలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. 2017, జులై 23 తర్వాత నిర్వహిస్తున్న టెట్‌లో ఎలాగైనా ఎక్కువ స్కోర్ సాధించాలని పట్టుదలతో ఉన్నారు. వేలాది మంది ఏపీలోని అవనిగడ్డ, కర్నూల్‌లోని కోచింగ్ కేంద్రాలకూ వెళ్లారు. కోచింగ్ ఫీజు, హాస్టల్, భోజనం, ఇతర ఖర్చుల కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో అభ్యర్థుల్లో నిరుత్సాహం కనిపిస్తున్నది. ఎన్నికల కోడ్ టెట్ నిర్వహణకు అడ్డంకి కాదని అభ్యర్థులు వాపోతున్నారు. ఎందుకంటే ఇది ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు కాదనీ, కేవలం అర్హత పరీక్ష మాత్రమేనని చెప్తున్నారు. ఎన్నికల కమిషన్ అనుమతితో టెట్ నిర్వహించొచ్చని అభిప్రాయపడుతున్నారు.టెట్‌లో అనేక మార్పులు జరిగే అవకాశమున్నది. నూతన విద్యావిధానం అమల్లో భాగంగా టెట్‌లో మార్పులు చేసేందుకు జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) చర్యలు తీసుకుంటున్నది. పూర్వ ప్రాథమిక స్థాయి (ప్రీప్రైమరీ) నుంచి 12వ తరగతి వరకు బోధించే ఉపాధ్యాయులు, అధ్యాపకులకు టెట్ వర్తింపచేయాలని ఎన్‌సీటీఈ నిర్ణయించింది. ఆయా తరగతులకుబోధించే వారంతా ముందు టెట్‌లో అర్హత సంపాదించాలి. ఆ తర్వాతే ఉపాధ్యాయ, అధ్యాపక నియామక పరీక్షలకు అర్హులవుతారు. దీనిపై సమగ్రంగా అధ్యయనం చేసేందుకు ఎన్‌సీటీఈ ఒక కమిటీని నియమించింది. ఈనెల 15లోగా అభిప్రాయాలు తెలపాలని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కోరింది. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఎలాంటి వైఖరి తీసుకుంటుందో తెలియాల్సి ఉన్నది. ఇంకోవైపు భవిష్యత్తులో టెట్ అర్హత సంపాదిస్తే అది జీవిత కాలమంతా ఉంటుందని ఎన్‌సీటీఈ ప్రకటించింది. ప్రస్తుతం టెట్ అర్హత ఏడేండ్ల వరకే కాలపరిమితి ఉన్నది. ఈ మేరకు టెట్ నిబంధనలను ఎన్‌సీటీఈ సవరించింది. దీనిపైనా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. ఈ మార్పులు జరిగినా రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి ఆ నిర్ణయాలు తర్వాతైనా వర్తింపచేయొచ్చని అభ్యర్థులు చెప్తున్నా రు.టెట్ నోటిఫికేషన్‌కు ఎన్నికల కోడ్ వర్తించదు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత నాగార్జునసాగర్ ఉప ఎన్నికలు, ఖమ్మం, వరంగల్ కార్పొరేషన్ ఎన్నికలు వరుసగా ఉంటాయి. అంటే అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారు. వెంటనే టెట్ నోటిఫికేషన్ జారీ చేయాలి. 50వేలఉద్యోగాలు భర్తీ చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడంతో ఉపాధ్యాయ అభ్యర్థులు కోచింగ్ కేంద్రాలకు వెళ్తున్నారు. వారికి న్యాయం చేయాలని కోరుతున్నారు

# ప్రియురాలి ఇంటి ముందు తుపాకీతో యువకుడి హంగామా!

జైపూర్ : తనతో కలిసి జీవించేందుకు నిరాకరించిందనే కోపంతో ఓ యువకుడు ప్రియురాలి ఇంటి ముందు షర్ట్ విప్పి తుపాకీతో హల్చల్ చేశాడు. యువతిని తనతో పంపకుంటే అందరినీ కాల్చిచంపుతానని ఆమె కుటుంబ సభ్యులను హెచ్చరిస్తూ వీరంగం వేశాడు. తన ప్రేమ వన్‌సైడ్ లవ్‌గా మారడం ఆమె తనకు దక్కదని తేలడంతో తుపాకీతో తనను తాను కాల్చుకుని చనిపోతానని బెదిరించాడు. బాధితురాలి తండ్రి పోలీసులకు ఫోన్ చేయడంతో అక్కడికి వచ్చిన ఖాకీలనూ తుపాకీతో బెదిరిస్తూ వారిని ముప్పతిప్పలు పెట్టాడు. రాజస్థాన్‌లోని ధోల్పూర్‌లో జరిగిన ఈ ఘటనలో ఎట్టకేలకు నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు అతడిని ఆకాష్ గుర్జార్‌గా గుర్తించారు. గతంలో యువతికి మరో వ్యక్తితో నిశ్చితార్థం కాగా అప్పట్లో ఆమెను ఆకాష్ కిడ్నాప్ చేశాడని ఆరోపణలున్నాయి. ఈ మొత్తం ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు దర్యాప్తు ముమ్మురం చేశారని ధోల్పూర్ ఎస్పీ కేసర్ సింగ్ తెలిపారు.

# ఇకపై 'ఆధార్'లో తండ్రి పేరు , భర్త పేరు ఉండదు!

న్యూఢిల్లీ: దేశంలోని అతి ముఖ్యమైన ధ్రువపత్రాలలో ఆధార్ కా ర్డు ఒక్కటి. అయితే ఇప్పుడు ఆధార్ కార్డులో పలు మార్పులు చోటుచేసుకోబోతున్నాయి. తాజాగా ఆధార్ కార్డు కేంద్రానికి వెళ్లిన కొందరు పౌరులు ఓ కీలక విషయాన్ని గుర్తించారు.ఆధార్ కార్డును అప్‌డేట్ చేస్తే ఇకపై అందులో తండ్రి పేరు/భర్త పేరు అని ఉండదు. సంరక్షకు డికి, కార్డుదారుడికి మధ్య ఉన్న బంధుత్వాన్ని తెలిపే అవకాశం ఉండదు.ఆధార్ కార్డులో ఇకపై తండ్రి లేక భర్త అనే ఆప్షన్ వద్ద కేరాఫ్ అనే పదం మాత్రమే ఉంటుంది. ఓ ఖాతాదారుడు ఈ విషయాన్ని గుర్తించి ఆధార్‌కార్డులో పొరపాటుగా కేరాఫ్ అని పడిందేమో అనుకుని ఆధార్ కేంద్రానికి విషయం తెలిపాడు. అయితే తండ్రి పేరు, భర్త పేరు అనే పదాలను తొలగించి కేరాఫ్ అని ఉద్దేశపూర్వకంగానే మార్చామని అధికారులు తెలిపారు. ఇకపై ఆధార్ కార్డులో బంధుత్వాన్ని తెలిపే పదాలు ఉండబోవని, కేరాఫ్ అని ఉంటుందని చెప్పారు. కార్డుదారుడు కేరాఫ్ లో తన బంధుత్వాన్ని తెలియకుండానే సంరక్షకుడి పేరును రాస్తూ సరిపోతుందని అధికారులు తెలిపారు. పౌరుడి వ్యక్తిగత గోప్యతకు ఏ విధంగానూ భంగం కలగకూడదని గతంలో సుప్రీంకోర్టు చేసిన సూచనల మేరకు అధికారులు మార్పులు చేసినట్లు తెలుస్తోంది.

# రాంగ్‌రూట్లో వస్తున్నారా.. జర భద్రం!



హైదరాబాద్ :ట్రాఫిక్ నిబంధనలు పట్టని వాహనదారులకు ఆర్టీఏ అధికారులు ఝలక్ ఇస్తున్నారు. ఉల్లంఘనదారులకు జరిమానాలు విధించేలా ట్రాఫిక్ పోలీసులకు సిఫారసు చేస్తున్నారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించడం, హెల్మెట్ ధరించకుండా డ్రైవ్ చేయడం తదితర అతిక్రమణలను రికార్డు చేసి.. సమీప పోలీసు స్టేషన్‌కు పంపిస్తున్నారు. వారు.. ఆ వివరాల ఆధారంగా ఈ చలానలో జరిమానా విధిస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ ఆర్టీఏ కార్యాలయాల

## ఆర్టీఏ కార్యాలయాల వద్ద ప్రత్యేక సిబ్బంది.. ఫొటోలు తీసి.. ట్రాఫిక్ పోలీసులకు అందజేత

వద్ద ట్రాఫిక్ ఉల్లంఘనకు పాల్పడిన వారిని గుర్తించేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. రాంగ్ రూట్‌లో వస్తున్న వారిని ఫొటో తీసి.. ట్రాఫిక్ విభాగానికి పంపిస్తున్నారు. ప్రధానంగా ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయం ఎంట్రీ గేటు వద్ద అందుకోసం ప్రత్యేక సిబ్బంది పనిచేస్తున్నారు. రోజుకు కనీసం 15 నుంచి 25 మంది అతిక్రమణదారుల ఫొటోలు తీస్తున్నారు. ఇటీవల ఓ ఉన్నతాధికారి ఖైరతాబాద్ కార్యాలయంలో విధులు ముగించుకుని ఇంటికి వెళుతున్న సమయంలో కార్యాలయం లోపల ఆ వాహనానికి ఎదురుగా కొన్ని వాహనాలు ఎదురయ్యాయి. వెంటనే ఆ అధికారికి ఆగ్రహమొచ్చింది. రూల్స్ అతిక్రమించే వారిని గుర్తించి..జరిమానాలు విధించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం. అందుకోసం ఫొటోలు తీయడానికి నలుగురు సిబ్బందిని నియమించినట్టు తెలిసింది.

## సంపాదకీయం

### వాస్తవాధీన రేఖ వద్ద టెన్షన్

భారత్ కు చికాకులు, చిక్కులు కల్పించడం చైనా విధానంగా మారింది. గత కొన్నేళ్లుగా ఈ ప్రక్రియ మరింత ఊపందుకుంది. సరిహద్దుల్లో, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై భారత్ ను ఇరుకున పెటట్డం, ఇబ్బంది పెట్టడం ఇటీవల కాలంలో మరింత ఎక్కువైంది. గతఏడాది మార్చి నుంచి తూర్పు లడ్డాఖ్ ప్రాంతంలో వాస్తవాధీన రేఖ (ఎల్ ఏ సీ- లైన్ ఆఫ్ యాక్చువల్ కంట్రోల్) వద్ద ఉద్రిక్తతలకు ఊపిరిపోస్తోంది. ఘర్షణల్లో 20 మంది భారతీయ సైనికులు అమరులయ్యారు. పైకి చెప్పనప్పటికీ బీజింగ్ కూ భారీ నష్టమే వాటిల్లింది. ఇప్పటికీ సరిహద్దుల్లో ఉద్రిక్తతలు చల్లారలేదు. అంతర్జాతీయ వేదికలపైనా భారత్ ను అడ్డుకోవడం చైనాకు అలవాటుగా మారింది. ఇటీవల ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి భారత్ కు వ్యతిరేకంగాపావులు కదిపి తన కుత్సితాన్ని చాటుకుంది. ఉగ్రవాద సంస్థ అల్ ఖైదాపై ఆంక్షలను విధించే కమిటీకి భారత్ నాయకత్వం వహించడాన్ని బీజింగ్ అడ్డుకుంది. ఈనెల 12న జరిగిన మండలి సమావేశంలో అయిదు శాశ్వత సభ్యత్వ దేశాల్లో అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా కమిటీకి భారత్ సారథ్యం వహించడానికి అంగీకరించాయి. అయితే చైనా తన వ్యతిరేకత (వీటో)ను వ్యక్తం చేయడం ద్వారా భారత్ ను అడ్డుకుంది. మండలి ఏ నిర్ణయం తీసుకోవాలన్నా అయిదు శాశ్వత సభ్యత్వ దేశాలు అంగకరించాల్సిందే. ఏ ఒక్క దేశం సమ్మతించకపోయినా ఆ నిర్ణయం అమలుకు నోచుకోలేదు. ఇప్పుడు చైనా అడ్డుకోవడం ద్వారా భారత్ కు వచ్చిన అవకాశాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంది. ఆంక్షల కమిటీకి భారత్ నాయకత్వం వహిస్తే ఉగ్రవద సంస్థపై ఎలాంటి కఠిన నిర్ణయం తీసుకుంటుందోనన్న అనుమానమే చైనా నిర్ణయానికి అసలు కారణం.తన అనుంగు మిత్రదేశమైన పాకిస్థాన్ భారత్ కు వ్యతిరేకంగా ఈ ఉగ్రవాద తండాలకు నారూనీరూ పోస్తున్న సంగతి తెలిసిందే. భారత్ కు వ్యతిరేకంగా అంతర్జాతీయ వేదికలపై పావులు కదపడం బీజింగ్ కు కొత్తేమీ కాదు. గతంలోనూ ఇలానే వ్యవహరించింది. అజహర్ మసూద్ ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా గుర్తించే విషయంలో భారత్ ప్రయత్నాలకు నాలుగుసార్లు అడ్డుపడింది. భారత్ లో జరిగిన అనేక విధ్వంస ఘటనలకుఅజహర్ మసూద్ సూత్రధారన్న సంగతి తెలిసిందే. జైషే మహమ్మద్ ఉగ్రవాద సంస్థకు మసూద్ అధిపతి. ఆంక్షల కమిటీకి నాయకత్వం వహించకుండాభారత్ ను అడ్డుకోవడం ద్వారా ఆ అవకాశం నార్వేకి లభించింది. తాలిబన్లపై ఆంక్షల కమిటీకి సారథ్యం వహించే అవకాశం మాత్రమే ఇప్పుడు భారత్ కు మిగిలింది. ఇప్పుడు కాకపోయినా వచ్చే ఏడాదైనా భారత్ కు అవకాశం వస్తుందని దౌత్య నిపుణులు అంచనా వేస్తున్నారు.భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ ప్రయత్నాలను చైనా పలుమార్లు అడ్డుకుని తన కుటిలత్వాన్ని చాటుకుంది. మిగిలిన నాలుగు శాశ్వత సభ్యత్వ దేశాలైన అమెరికా, రష్యా, ఫ్రాన్స్, బ్రిటన్ ఎప్పుడో సుముఖత చూపాయి. చైనా సమ్మతి లేనందునే ఇప్పటికీ శాశ్వత సభ్యత్వం భారత్ కు అందని ద్రాక్షగా మిగిలిపోయింది. నిజానికి అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా, అతి పెద్ద జనాబా గల దేశంగా శాశ్వత సభ్యత్వం భారత్ హక్కు. స్వతంత్ర న్యాయవ్యవస్థ, మైనార్టీల హక్కుల పరిరక్షణ, క్రమం తప్పని ఎన్నికలు,పేదల అభ్యున్నతికి కట్టుబడిన దేశంగా అంతర్జాతీయంగా ఎలాంటి గౌరవం, హోదాకు అన్నివిధాలా అర్హు రాలు. తన కుటిల యత్నాల ద్వారా తాత్కలికంగా అడ్డుకున్నప్పటికీ భవిష్యత్తులో భారత్ ను అడ్డుకోవడం అసాధ్యమన్న విషయాన్ని చైనా ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది.

# కుప్పంలో డీలా పడిన టీడీపీ

కుప్పం: టిడిపి కంచుకొటగా ఇన్ని రోజులు ఉన్న కుప్పంలో పంచాయితీ ఎన్నికల లో టిడిపి పరిస్థితి ఎందుకు 14కు పడిపోయింది.చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పంలో రెండు సంవత్సరాల కాలంలో ఎందుకు పరిస్థితి చక్కదిద్దలేక పోయారు..కుప్పంలో వాస్తవిక పరిస్థితి ఎమిటి..పార్టీ పరిస్థితి ఎందుకు దిగజారింది. రాష్ట్రంలో పులివెందుల వైకాపా కి ఎంత బలమైన టిడిపికి కూడా అంత బలమైన స్థానం కుప్పం అని ఎన్ని రోజులు భావించారు అయితే అది నిజం కాదని పంచాయతీ ఎన్నికలు నిరూపించాయి తాజాగా మూడో దశలో వెలువడిన పంచాయతీ ఎన్నికల ఫలితాలు సామాన్య టిడిపి కార్యకర్తను నివ్వెర పరిచాయి .మొత్తం 89 స్థానాలు కుప్పం పరిధిలో ఉండగా కేవలం 14 చోట్ల మాత్రమే టిడిపి గెలవడం పార్టీ పరిస్థితికి అద్దం పడుతుంది ముఖ్యంగా రెండు వేల పంతొమ్మిది లో జరిగిన శాసనసభ ఎన్నికల్లోనే చంద్రబాబు నాయుడు మెజారిటీ 30000 పడిపోవడం, మొదటి రౌండ్లో వైకాపాకు మెజార్టీ రావడం కూడా జరిగింది అప్పటి నుంచి కూడా పార్టీ వ్యవస్థాపకత వ్యవస్థాగత నిర్మాణంపై దృష్టి సారించకపోవడం పార్టీని కేవలం కొద్దిమందికి వదిలేయడం ఇందుకు కారణం అంటున్నారు. ముఖ్యంగా చంద్రబాబు నాయుడు 1989 నుంచి కుప్పం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నాడు.అయితే చంద్రబాబు కేవలం కొంతమందికి పార్టీ నిర్వహణ బాధ్యతలు అప్పగించడం వారు ద్వితీయశ్రేణి నాయకులు గ్రామ స్థాయి కార్యకర్తలను నిర్లక్ష్యం చేయడంతో నిజమైన కార్యకర్తలు దూరమవుతున్నారు. చంద్రబాబు కేవలం నలుగురు నాయకులను మాత్రమే నమ్ముకొని మిగతా వారిని వదిలేశాడని ప్రచారం నియోజవర్గంలో జోరుగా ఉంది. మనోహర్ మునిరత్నం శ్రీనివాసులు నాగరాజు లాంటి నాయకులు ఆర్థికంగా బలపడగా వారితో పాటు రాజకీయాల్లోకి వచ్చిన వారు మాత్రం అధినేత కరుణ లేక మామూలు వ్యక్తుల గాని ఉండిపోయారు ఇది కూడా అసూయా ద్వేషాలకు కారణమైంది..కుప్పం నియోజకవర్గంలో గతంలో వీకోట ఉంది అయితే నియోజకవర్గాల పునర్విభజన ఫలితంగా టిడిపి బలమైన వి కోట దూరమైంది అయినప్పటికీ చంద్రబాబు నాయుడు 60 వేల మెజారిటీ తగ్గకుండా గెలుపు సాధిస్తూ వచ్చాడు .దీంతో వైకాపా కుప్పంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన చంద్రమౌళి ని కడప నుంచి తెచ్చి ఎన్నికల్లో పోటీ చేయించారు .2014లో బాబు మెజారిటీ 60 వేల లోపు పడిపోయింది అప్పట్లో కుప్పం పర్యటనకు చంద్రబాబు ఈ విషయం మీద స్థానిక నాయకులు క్లాస్ పీకారు. అయినప్పటికీ మార్పు రాలేదు 2014 నుంచి 19 వరకు సీఎం హోదాలో ఉన్న చంద్రబాబు నాయుడు నియోజకవర్గంలో జరుగుతున్న పరిస్థితులను ఏమాత్రం పట్టించుకోలేదని విమర్శలున్నాయి ముఖ్యంగా కుప్పంలో జరిగిన అభివృద్ధి పనుల కాంట్రాక్ట్ పనులు మొత్తం స్థానిక అగ్రనాయకులు పులివెందల పుంగనూరు కడప జిల్లాలకు చెందిన వైకాపా మద్దతుదారులకు కమీషన్ పద్ధతిలో ఇచ్చారనే విమర్శలు వచ్చాయి కొద్దికాలం పాటు ఈ విషయంలో ఇంటలిజెన్స్ నివేదిక తర్వాత బిల్లులు కూడా ఆపారు దీంతో చాలా మంది స్థానిక టిడిపి నాయకులు పార్టీకి దూరం కావడం జరిగింది బయట వ్యక్తులు ఇక్కడ కాంట్రాక్ట్ పనులు చేసి లబ్ధి పొందడమే కాకుండా స్థానికంగా నివాసాలు కూడా ఏర్పాటు చేసుకుని బలమైన వర్గాన్ని తయారు చేసుకున్నారు చాప కింద నీరులా వీరు కుప్పంలో చేరిపోయారు మరోవైపు పార్టీ అగ్ర నాయకులు చెబుతున్న వారి చర్యల ఫలితంగా యువత పార్టీకి దూరం అవుతు వచ్చింది గత ఎన్నికల్లో మొట్టమొదటిసారిగా తెలుగుదేశం పార్టీ కూడా ఇక్కడ ఓటర్లకు డబ్బు పంచిందని ప్రచారం ఉంది అధిష్టానం పంపిన డబ్బుల్లో కూడా కొంత సొంతానికి నాయకులు తీసుకున్నారని స్థానిక నాయకత్వం పై కార్యకర్తలు అప్పట్లో ఆగ్రహం వ్యక్తం చేశారు తాజాగా జరిగిన పంచాయతీ ఎన్నికల్లో వైకాపా అధికార బలం తో పాటు పెద్ద ఎత్తున డబ్బులు పంపిణీ చేసిందని ప్రచారం జరుగుతోంది అయితే టిడిపి మద్దతుదారులు వెనుకబడిపోయారు. మొత్తం మీద కుప్పం నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని ఎదగనివ్వక పోవడమే ప్రస్తుత పార్టీ పరిస్థితి కారణం అనర్హులకు పదవులు పదవులు ఇవ్వడం ఇందుకు కారణమని కార్యకర్తలు అంటున్నారు ఇప్పటికైనా చంద్ర బాబు ప్రోత్సహించి నియోజవర్గంలో పార్టీని గాడిన పెట్టాలని టిడిపి క్యాడర్ కోరుకుంటుంది.

# ప్రియుడితో భార్య పరారీ...

నల్గొండ, : భర్తతో విభేదించి పుట్టింటికెళ్లిన భార్య బరితెగించింది. మరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుంది. నెలల బిడ్డను తీసుకుని అతనితో ఊరు దాటేసి కొత్తకాపురం పెట్టింది. సరిగ్గా పదిహేను రోజులు తిరక్కుండానే కొడుకు శవంతో ఊళ్లోకి రావడంతో తీవ్ర కలకలం రేగింది. విషయం తెలుసుకున్న అత్తింటి వారు గ్రామానికి చేరుకోవడంతో అలజడి రేగింది. తన బిడ్డను భార్య, ఆమె ప్రియుడే కొట్టి చంపేశారంటూ భర్త, అతని బంధువులు గొడవకు దిగడంతో ఉద్రిక్తత తలెత్తింది. పోలీసులు రంగంలోకి దిగి పరిస్థితి చేయిదాటకుండా అదుపులోకి తెచ్చారు. ఈ దారుణ ఘటన నల్గొండ జిల్లాలో వెలుగుచూసింది.నకిరేకల్ పరిధిలోని శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన సంతోష(26)కి సమీపంలోని వల్లాలకు చెందిన వ్యక్తితో ఆరేళ్ల కిందట వివాహమైంది. వారికి ఒక కూతురు, పది నెలల కొడుకు సంతానం. ఏడాది కాలంగా కుటుంబంలో గొడవలు జరుగుతుండడంతో భార్య సంతోష నెల రోజుల కిందట గత నెల 23న ఆకారంలోని తన పుట్టింటికి వచ్చేసింది. భర్తతో విభేదాలను పరిష్కరించుకుని ఎలాగోలా కాపురాన్ని సరిదిద్దుకోవాల్సిందిపోయి పక్కదారి పట్టింది. మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుంది.జాజ్‌రెడ్డిగూడెం మండలం రామన్నగూడెం గ్రామానికి చెందిన బాలకిషన్ అత్తగారిల్లు సంతోష పుట్టింటి పక్కనే కావడంతో ఇద్దరి మధ్య పరిచయం ఏర్పడి అక్రమ సంబంధానికి దారితీసింది. పది రోజులు తిరక్కుండానే ఇద్దరూ ఊరి నుంచి పారిపోయి కోదాడలో కొత్తకాపురం పెట్టారు. తన పది నెలల కొడుకుతో సహా సంతోష్ ప్రియుడితో వెళ్లిపోయింది. సరిగ్గా పదిహేను రోజులకు కొడుకు శవంతో సంతోష ఊళ్లోకి రావడంతో కలకలం రేగింది. ఆమె తన పుట్టింటికి వెళ్లకుండా సమీపంలోని బంధువుల ఇంటికి వెళ్లి తన కొడుకు ఫిట్స్ వచ్చి చనిపోయాడని చెప్పింది.రెండు రోజుల కిందట రాత్రివేళ ఫిట్స్ వచ్చాయని.. కోదాడ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడని చెప్పింది. విషయం తెలుసుకున్న భర్త, అతని బంధువులు వల్లాల నుంచి ఆకారం గ్రామానికి చేరుకున్నారు. తన బిడ్డను భార్య, ఆమె ప్రియుడే తలపై కొట్టి చంపేశారంటూ ఆగ్రహం ఊగిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే గ్రామానికి చేరుకుని అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడ్డుకున్నారు. తన బిడ్డ మృతదేహాన్ని తమకుఅప్పగించాలని భర్త, బంధువులు ఆందోళనకు దిగారు. బాలుడి మరణం మిస్టరీగా మారడంతో పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పారు. చిన్నారి మరణంపై అనుమానాలు వ్యక్తం కావడంతో మృతదేహాన్ని నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని చిన్నారి తండ్రికి అప్పగించారు. ప్రియుడితో వెళ్లిపోయి కొడుకు శవంతో తిరిగొచ్చిన సంతోషను అదుపులోకి తీసుకుని పోలీసులు ప్రశ్నిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అయితే చిన్నారి ఫిట్స్‌తోనే చనిపోయాడా? లేక మరేదైనా జరిగి ఉంటుందా? అనే సందేహాలు కలుగుతున్నాయి. అయితే పోస్టు మార్టం సందర్భంగా బాలుడి శరీరంపై ఎలాంటి గాయాలు గుర్తించలేదని తెలుస్తోంది. అసలు నిజాలు పోలీసు విచారణలో తేలాల్సి ఉంది.

## అక్రమంగా తరలిస్తున్న తాబేళ్లు, ఉడుములు పట్టివేత



ఐజ్వాల్: ఈశాన్య రాష్ట్రం మిజోరంలో వన్యప్రాణుల అక్రమ రవాణా ప్రధాన సమస్యగా మారిపోయింది. తరచూ రాష్ట్రంలో ఎక్కడో ఒకచోట అక్రమంగా తరలిస్తున్న వన్యప్రాణులు పట్టుబడుతున్నాయి. తాజాగా మిజోరంలోని చంఫాయ్ జిల్లాలో భారీగా తాబేళ్లు, ఉడుములు, సర్పాలు పట్టుబడ్డాయి. జిల్లాలోని త్యావో నదిపైగల ఫ్రెండ్‌షిప్ బ్రిడ్జి సమీపంలో ఒక నిందితుడితోపాటు, వన్యప్రాణులను స్వాధీనం చేసుకున్నారు. వన్యప్రాణులను అక్రమంగా రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారం మేరకు పారా మిలిటరీ దళమైన అసోం రైఫిల్స్, కస్టమ్స్ అధికారులు సంయుక్త ఆపరేషన్ నిర్వహించారు. నిందితుడి నుంచి సీజ్ చేసిన వన్యప్రాణుల్లో 29 చిరుతపులి మచ్చల తాబేళ్లు, 38 ఎరుపు పాదాల తాబేళ్లు, అదేవిధంగా పసుపురంగు, ఆరెంజ్ రంగు, ఆకుపచ్చ రంగు కలిగిన 17 ఉడుములు, మూడు బియర్డెడ్ డ్రాగన్‌లు, మూడు వర్ణరహిత ఉడుములతోపాటు విదేశీ రకాలకు చెందిన సీడ్స్, ఎరువులు లభ్యమయ్యాయి.

# చిన్న పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకం?

గాజువాక :విశాఖ స్టీల్‌ప్లాంట్ రావడంతో దానికి అనుబంధంగా వందలాది పరిశ్రమలు ఏర్పడ్డాయి. ఒక్క స్టీల్‌ప్లాంట్‌లోనే 50 వేల మంది వరకు పని చేస్తుండగా, దానిపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధాపడి నడుస్తున్న ఆటోనగర్‌లోని పరిశ్రమల్లో వేలాది మంది కార్మికలు పని చేస్తున్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రైవేటీకరణ చేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించడంతో ఆటోనగర్‌లోని పరిశ్రమల యజమానుల గుండెలు గుబేల్‌మన్నాయి. కార్మికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటుపరమైతే వర్క్ ఆర్డర్స్ లేక పరిశ్రమలు మూతపడతాయని, చిన్న, మధ్య తరహా పరిశ్రమల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని వీరంతా భయపడుతున్నారు. గాజువాక ఆటోనగర్, పెదగంట్యాడ ఆటోనగర్, అగనంపూడి, పరవాడ తదితర ప్రాంతాల్లో మొత్తం 2,500 వరకు చిన్న, మధ్య తరహా పరిశ్రమలున్నాయి. ఇవన్నీ స్టీల్‌ప్లాంట్‌పై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి నడుస్తున్నావే. వీటిలో 50 పరిశ్రమల వరకు స్టీల్‌ప్లాంట్‌కు అనుబంధంగానే నడుస్తున్నాయి. సంవత్సరానికి రూ.300 కోట్ల వరకు విశాఖ స్టీల్‌ప్లాంట్ ఈ అనుబంధ పరిశ్రమలకు వర్క్ ఆర్డర్స్ ఇస్తుంది. ఈ పరిశ్రమల్లో 10వేల మంది కార్మికులు పనిచేస్తున్నారు. అలాగే స్టీల్‌ప్లాంట్‌పై పరోక్షంగా ఆధారపడే పరిశ్రమల్లోనూ వేలాది మంది పని చేస్తున్నారు. స్టీల్‌ప్లాంట్‌కు కావాల్సిన వివిధ రకాల పనిముట్లను గాజువాక ఆటోనగర్‌లో తయారవుతున్నాయి. వాటిలో ప్రధానంగా కాస్టింగ్, ఫ్యాబ్రికేషన్ వర్క్స్, రీ ప్రాక్టీస్, డీకోడింగ్, స్విచ్ బోర్డ్స్, ఫోర్జింగ్, స్టీల్‌ప్లాంట్ కావాల్సిన రకరకాల పౌడర్లు, కెమికల్స్, ఆఫీసు కావాల్సిన, ఫైళ్లు, ఫినాయిల్ వంటివన్నీ గాజువాక ఆటోనగర్‌లోని పరిశ్రమలు తయారు చేసి అందిస్తున్నాయి. అంతేకాకుండా స్టీల్‌ప్లాంట్‌పై ఆధారపడి 50 వరకు



స్టీల్ మెల్టింగ్ షాపులు నడుస్తున్నాయి. ఈ విధంగా చూస్తే ప్రత్యక్షంగా పరోక్షంగా, వేలాది మందికి గాజువాక ఆటోనగర్ ఉపాధి కల్పిస్తోంది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అయితే ఇక్కడున్న పరిశ్రమలు మూతపడే ప్రమాదముందని పరిశ్రమల యజమానులు ఆందోళన చెందుతున్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వ రంగంలో ఉండడం వల్ల గాజువాక ఆటో నగర్‌తో పాటు, ఉత్తరాంధ్ర, అటు రాజమండ్రి వరకు కొన్ని పరిశ్రమలకు వర్క్ ఆర్డర్స్ ఇస్తోంది. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటువారి చేతుల్లోకి వెళ్ళిపోతే వర్క్ ఆర్డర్స్ కష్టమని పరిశ్రమల యజమానులు ఆందోళన చెందుతున్నారు. దీంతో ఆటో నగర్‌లోని చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడే ప్రమాదం ఉంది. సూక్ష్మ,, చిన్న, మధ్యతరహా పరిశ్రమ (ఎంఎస్ఎంఇ)లకు స్టీల్‌ప్లాంట్ నుండి 25 శాతం వరకు ఆర్డర్స్ ఇవ్వాలని చట్టం ఉంది.

## మేఘాలయలో భూకంపం

షిల్లాంగ్ : మేఘాలయలో శుక్రవారం తెలికపాటి భూ ప్రకంపనలు సంభవించాయి. మేఘాలయ తూర్పు ఖాసీ కొండల్లో ఉదయం 7.45 గంటలకు భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై 2.3 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మోలాజీ తెలిపింది. షిల్లాంగ్‌కు ఏడు కిలోమీటర్ల దూరంలో.. భూమికి 50 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రం గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరిగినట్లు నివేదికలు అందలేదని అధికారులు తెలిపారు. గురువారం మహారాష్ట్ర పాల్ఘర్‌లో భూమి కంపించింది. రిక్టర్ స్కేల్‌పై 3.1 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయి. అలాగే లధక్‌లో ఉదయం 7.39 గంటల ప్రాంతంలో రిక్టర్ స్కేల్‌పై 3.7 తీవ్రతతో ప్రకంపనలు వచ్చాయి.

## పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న 500 మందిపై కేసు




ముంబై : పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్న సుమారు 500 మందిపై పోలీసు కేసు నమోదైంది. కొవిడ్-19 నిబంధనలు ఉల్లంఘించినందుకు కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఘటన మహారాష్ట్రలోని థానే జిల్లాలోని డొంబివ్లిలో చోటు చేసుకుంది. ఈ నెల 17-18 తేదీల మధ్య దెస్లెపాడాలో పెద్ద ఎత్తున పుట్టిన రోజు వేడుకలు జరుగుతున్నాయని.. ఇందులో ఎవరూ మాస్కులు ధరించడం, సామాజిక దూరం తదితర కొవిడ్ మార్గ దర్శకాలు పాటించడం లేదని కల్యాణ్ డొంబివ్లి మున్సిపల్ కార్పొరేషన్ (కేడీఎంసీ) వార్డ్ అధికారికి ఫిర్యాదు అందింది. దీంతో అప్రమత్తమైన బల్దియా అధికారులు వేడుకలు జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. అనంతరం వేడుకల నిర్వాహకులతో సహా అతిథులందరు సుమారు 500 మందిపై మన్పాడా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారిపై 269, 270, 188 సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఇప్పటి ఎవరినీ అరెస్టు చేయలేదని పోలీసులు తెలిపా రు. ఇదిలా ఉండగా గురువారం మహారాష్ట్రలో 5427 కొవిడ్ పాజిటివ్ కేసులు నమోదవగా.. 38 మంది మృత్యువాతపడ్డారు.

# ఆత్మనిర్భర్ భారత్ సాధనకుపరిశ్రమల స్థాపనకీలకం

తిరుపతిఆత్మనిర్భర్ భారత్ సాధనకు పరిశ్రమల స్థాపన ఎంతో కీలకమని, అయితే స్థాపనలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించకుంటే, అడ్డంకులు తొలగించకుంటే ఆచరణ సాధ్యం కాదని కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్ డైరెక్టర్ జి.జె.రావు అన్నారు. తిరుపతి నగర సమీపంలోని మారస సరోవర్ హెూటల్లో శుక్రవారం సీఐఐ ఆధ్వర్యంలో తిరుపతి జోన్ వార్షిక సమావేశం నిర్వహించారు. ఆత్మనిర్భర్ భారత్ సాధన కోసం ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంశంపై పారిశ్రామిక వేత్తలతో చర్చా కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు.

ఆత్మనిర్భర్ భారత్ పథకానికి రూ.20 లక్షల కోట్లు కేటాయించిన ప్రధాని, సమస్యలను ఎదుర్కొనే పరిశ్రమలు లబ్ధిపొందే విధంగా రూపకల్పన చేశారన్నారు.

అయితే నిజానికి ఆ పథకం పరిశ్రమలకు ఏవిధంగా ఉపయోగపడుతుంది, ఎలా వినియోగించుకోవాలన్న విషయంపై చాలామందికి అవగాహన లేదన్నారు. కాలంతోపాటు పరిశ్రమలు పోటీపడితేనే పరిశ్రమలు మనుగడ సాగించగలవన్నారు. ఐఐటీ తిరుపతి డైరెక్టర్ కె.ఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ.. ఐఐటీ, ఐజర్ సంయుక్తంగా వ్యవసాయ, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కోర్సులను నిర్వహిస్తున్నాయని, పారిశ్రామిక వేత్తలు మాత్రం సద్వినియోగం చేసుకోవడంలేదన్నారు.

# పశుగ్రాసం.. పాడికి ఊతం



తాడేపల్లిగూడెం :జిల్లాలో పశుగ్రాసం కొరత తీర్చి తద్వారా అధిక పాల దిగుబడి సాధించేందుకు ప్రభుత్వం బహుళ వార్షిక పశుగ్రాస క్షేత్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. దీనికి ఉపాధి హామీ పథకం నిధులను అనుసంధానం చేసి కూలీల ఖర్చు, మెటీరియల్ కాంపొనెంట్ నిధులను రైతులకు అందజేస్తోంది. జిల్లాలో ఈ ఏడాది 1500 ఎకరాల్లో పశుగ్రాసం పెంచాలని పశుసంవర్ధక శాఖ లక్ష్యం విధించగా.. దానికి అనుగుణంగా అధికారులు ప్రణాళిక అమలు చేస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని పశుసంవర్ధక సహాయకులు క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను గుర్తిస్తారు. రైతులు పంచాయతీ తీర్మానం, ఉపాధి హామీ జాబ్‌కార్డు, బియ్యం, ఆధార్ కార్డులు, పట్టాదారు, బ్యాంకు పాసు పుస్తకాల నకళ్లను ఇవ్వాలి. మొత్తం జాబితాలో అర్హులను వెటర్నరీ వైద్యుడు ధ్రువీకరించి ఉపాధి హామీ పథకం ఏపీఓ లేదా సాంకేతిక సహాయకులకు అందజేస్తారు. గడ్డి పెంపకం పనుల వివరాలను క్షేత్రసహాయకులు నమోదు చేయాల్సి ఉంటుంది. ఉపాధి హామీ పథకం ప్రయోజనం పొందాలంటే వ్యక్తిగతంగా 25 సెంట్ల నుంచి 2.50 ఎకరాల వరకు పశుగ్రాసం సాగు చేయవచ్చు సమూహంగా ఏర్పడితే 5 ఎకరాల వరకు అనుమతిస్తారు. సూపర్ నేపియర్ గడ్డి విత్తనాలను రైతులకు పంపిణీ చేస్తారు. ఇవి రెండేళ్లపాటు దిగుబడిని ఇస్తాయి. ఎరువులు, పురుగు మందులు వినియోగించాల్సిన అవసరం లేదు. సేంద్రియ ఎరువులను ఉపయోగించాలి. కూలీల ఖర్చు, మెటీరియల్ కాంపొనెంట్ ఖర్చు నిమిత్తం ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. సంవత్సరంలో ఎకరానికి 100 నుంచి 120 టన్నుల దిగుబడి రావచ్చని అంచనా. దీనిప్రకారం జిల్లాలో 1500 ఎకరాల్లో బహుళ వార్షిక పశుగ్రాసం సాగు చేపడితే రెండేళ్లలో 3 లక్షల టన్నుల పశుగ్రాసం ఉత్పత్తి అవుతుంది. రైతులు ఆర్‌బీకేల పశుగ్రాసాన్ని ఇతరులకు విక్రయించుకోవచ్చు కౌలు రైతులు భూయజమానుల నుంచి లీజు అగ్రి మెంట్ చేసుకుంటే ఈ తరహా సాగు చేసుకుని ప్రభుత్వ పథకాన్ని విని యోగించుకోవచ్చు పశుగ్రాసం పెంచి వినియోగించడం ద్వారా పాల దిగుబడి పెరుగుతుంది. నాణ్యమైన పాలు ఉత్పత్తి అవడంతో పాటు రైతుకు అయ్యే పెట్టుబడి తగ్గుతుంది. పచ్చ గడ్డిలో ఉండే పోషకాలతో పశువుల్లో పునరుత్పాదక శక్తి పెరుగుతుంది. అంతిమంగా రైతులకు లాభసాటిగా ఉంటుంది. – సత్యగోవిందు, ఇన్‌ఛార్జి జేడీ, పశుసంవర్ధక శాఖ

# నిధులు లేని కార్పొరేషన్లు ఉత్సవ విగ్రహాలే: తులసిరెడ్డి

విజయవాడ: రెడ్డి, కమ్మ, క్షత్రియ సంక్షేమ అభివృద్ధి సంస్థల ఏర్పాటు మాట సరే నిధులు ఇవ్వాలి కదా..? అని ఏపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్.తులసిరెడ్డి ప్రశ్నించారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ నిధులు లేని ఆయా కార్పొరేషన్లు ఉత్సవ విగ్రహాలే అని వ్యాఖ్యానించారు. ఏకగ్రీవాలతో సహా మొత్తం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను రద్దు చేసి మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తేనే ప్రయోజనకరమని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలలో 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు అమలు చేస్తూ జీఓ జారీ చేయాలని డిమాండ్ చేశారు. అగ్రవర్ణ పేద యువతపై ఎందుకంత కక్ష అని ఆయన నిలదీశారు. ఈడబ్ల్యూఎస్ 10 శాతం రిజర్వేషన్లు మాటేమిటని నిలదీశారు. ఈ రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయడం లేదో కారణాలు తెలపాలని డిమాండ్ చేశారు. 103వ రాజ్యాంగ సవరణ ద్వారా భారత ప్రభుత్వం కల్పించిన హక్కు.. భిక్షకాదని స్పష్టం చేశారు. 2019 ఫిబ్రవరి 1 నుంచి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తుందని చెప్పారు. దాదాపు అన్ని



రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. పొరుగునే ఉన్న తెలంగాణ రాష్ట్రం కూడా అమలు చేస్తోందన్నారు. నర్సాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజుకు సుప్రీంకోర్ట్ బెయిల్ మంజూరు చేయటం హర్షనీయమని... ఇది ప్రజాస్వామ్య విజయం తులసిరెడ్డి పేర్కొన్నారు.

# మిర్చి లారీ చోరీ ముఠా అరెస్టు



గుంటూరు : మిర్చిలోడుతో ఉన్నలారీని చోరీ చేసిన ముగ్గురు సభ్యుల ముఠాను నల్లపాడు పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద లారీతోపాటు రూ.20 లక్షలు విలువ చేసే 383 మిర్చి బస్తాలు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం పోలీసు కార్యాలయంలో అర్బన్ ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ నిందితుల వివరాలను తెలిపారు. లాల్‌పురానికి చెందిన దామరచర్ల భారతి తన లారీని పట్నంబజార్‌లోని శిర్డీ సాయి భాస్కర లారీ ట్రాన్స్‌పోర్టుకు బాడుగకు పెట్టారు. అక్కడ నుంచి ఆ లారీని మే 28న ఆర్ అగ్రహారానికి చెందిన విపుల్ ట్రేడర్స్ బాడుగకు తీసుకొని మధ్యప్రదేశ్‌కు పంపించడానికి 383 మిర్చి బస్తాలను లోడ్ చేసి చుట్టుగుంట చిలకలూరిపేట వైజంక్షన్ వద్ద నిలిపారు. అదేరోజు తెల్లవారుజామున లారీ చోరీకి గురయ్యింది. భారతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. సౌత్ డీఎస్పీ ప్రశాంతి, నల్లపాడు సీఐ ప్రేమయ్యలు ఘటనాస్థలికి వెళ్లి విచారించారు. అక్కడ లభించిన సీసీ కెమెరాలోని దృశ్యాలతోపాటు స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు నిందితులను గుర్తించారు. నరసరావుపేట మండలం ఈసపాలేనికి చెందిన రావుట్ల శ్రావణ్‌కుమార్ ఆటో, బస్సు డ్రైవర్‌గా పనిచేశాడు. పేకాట, మద్యం వంటి చెడు వ్యసనాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలని భావించాడు. గతంలో పలుమార్లు గోవా వెళ్లి వచ్చాడు. మిర్చి లారీని తస్కరిస్తే వచ్చే డబ్బులతో గోవాలో ఉండిపోవచ్చనుకున్నాడు. 28వ తేదీ రాత్రి వైజంక్షన్ వద్ద నిలిపిన లారీ అద్దం పగలకొట్టి లోపలకు వెళ్లి లారీకి ఉన్న తాళంతో ఆన్ చేసి నరసరావుపేటకు తీసుకువెళ్లాడు. తన స్నేహితుడైన నరసరావుపేట మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన శ్రవణం సీతారామయ్య దగ్గరకు వెళ్లి లారీని తస్కరించినట్లు తెలిపాడు. తనకు తోడుగా వస్తే మిర్చిని అమ్మి కొంత డబ్బులు ఇస్తానని చెప్పడంతో సీతారామయ్య అంగీకరించాడు. ఇద్దరూ కలిసి నరసరావుపేట రోడ్డు సమీపంలోని ఓ ఖాళీ స్థలంలో లారీని నిలిపారు. అందులో నుంచి 231 మిర్చి బస్తాలు దించారు. తర్వాత సత్తెనపల్లి దగ్గర ఇరుకుపాలెం సమీపంలో రోడ్డు పక్కన లారీని, మిగిలిన మిర్చి బస్తాలను వదిలిపెట్టారు. అక్కడ నుంచి ముందుగా 231 మిర్చి బస్తాలు దించిన చోటకు వెళ్లి అటుగా వెళుతున్న బాడుగ ఆటోల్లో ఆ మిర్చిని లోడ్ చేశారు. వాటిని తన స్నేహితుడైన దాచేపల్లిలోని మిర్చి కమిషన్ వ్యాపారి షేక్ నాగుల్ మీరా దగ్గరకు తీసుకువెళ్లారు. వాటిని అమ్మితే ముగ్గురం పంచుకుదామన్నారు. ఆ మిర్చిని నాగుల్‌మీరా అమ్మేశాడు. ఆ డబ్బులు పంచుకుందాం రమ్మని మిగిలిన ఇద్దరికీ తెలియజేశాడు. నిందితులు ఆదివారం చుట్టుగుంట వై జంక్షన్ వద్దకు రాగా డీఎస్పీ, సీఐలతోపాటు ఎస్సైలు సుబ్బారావు, మహేష్‌కుమార్, సిబ్బంది ఆదిబాబు, పోతురాజు, జాన్‌సైదా, ఆంజనేయులు, బాలాజీ, సాయికుమార్‌లు మాటువేసి పట్టుకున్నారు. లారీతోపాటు నిందితులను చాకచక్యంగా పట్టుకున్న డీఎస్పీ, సీఐలతోపాటు సిబ్బందికి ఎస్పీ రివార్డులు అందించి అభినందించారు. సమావేశంలో నేర విభాగ ఏఎస్పీ మనోహరరావు పాల్గొన్నారు.

# మేల్కోనకపోతే..ముప్పే

కాకినాడ : వర్షాకాలం వచ్చేసింది.. వానలకు వాగులు.. వంకలు.. నదులు పొంగుతాయి.. కలుషితాలు జలవనరుల్లోకి వచ్చి చేరతాయి.. దీంతోపాటు పారిశుద్ధ్యం తీసికట్టుగా మారడంతో దోమల విజృంభణకు అనుకూల పరిస్థితులు నెలకొంటాయి.. ఆ వెనుకే డెంగీ, మలేరియా, గన్యా.. తదితర కాలానుగుణ వ్యాధులు ముసురుకుంటాయి. జిల్లాలో ఏటా ఈ సమస్య వెంటాడుతోంది. రెండేళ్లుగా కరోనా ప్రభావంతో కాలానుగుణ వ్యాధుల నివారణ చర్యలు అంతంతమాత్రంగా ఉన్నాయి. దీంతో జూన్ నుంచి డిసెంబరు వరకు మలేరియా, డెంగీ కేసులు నమోదవుతున్నాయి. ఈసారైనా పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. కొన్నేళ్లుగా జిల్లాలో పూర్తిస్థాయిలో పారిశుద్ధ్య ప్రణాళిక అమలు చేయకపోవడంతో ఏటా సీజనల్ వ్యాధులు జిల్లా ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రధానంగా వర్షాకాలంలో దోమ కాట్ల కారణంగా మలేరియా, డెంగీ, గన్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు సోకుతున్నాయి. దోమల నివారణ చర్యలు మాత్రం పెద్దగా కానరావడం లేదు. ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించి.. పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించినా.. అమలుకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా పక్కా జిల్లాలో ఈనెల 1 నుంచి 30 వరకు మలేరియా మాసోత్సవాలు నిర్వహించనున్నారు. పీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల పరిధిలో ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు కానరావడం లేదు. మురికి కుంటల్లో దోమలు వృద్ధి చెందకుండా గంబోజియా చేపలకు సంబంధించిన 1,92,260 కిట్లను పంపిణీ చేశారు. వీటిని ఆయా పంచాయతీలు, మున్సిపాల్టీల్లో పూర్తిస్థాయిలో వినియోగించాల్సి ఉంది. . జిల్లా కేంద్రం కాకినాడలో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఇక్కడ 121, రాజమహేంద్రవరం నగరం, అమలాపురం పట్టణంలో 133 బ్లాక్ స్పాట్లను గుర్తించారు. మిగతా పట్టణాలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కూడా డెంగీ, మలేరియా కేసులు నమోదవుతున్నాయి. బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లోని కుటుంబాలకు 3,79,300 దోమ తెరలను గతంలో



అందజేశారు. మళ్లీ ఆయా ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలి. జిల్లాలోని గ్రామీణ ప్రాంతానికి 92 ఫాగింగ్ యంత్రాలను సమకూర్చారు. తక్షణం వీటిని మనుగడలోకి తేవాలి. డివిజనల్ మలేరియా విభాగాల వద్ద దోమల నియంత్రణకు పిచికారీ చేసే ఎంఎల్ ఆయిల్, ఎబేట్ వంటి ద్రావకాలు అందుబాటులో ఉన్నాయి.ఏటా సీజనల్ వ్యాధులు జిల్లా ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ప్రధానంగా వర్షాకాలంలో దోమ కాట్ల కారణంగా మలేరియా, డెంగీ, గన్యా, ఫైలేరియా, మెదడువాపు వంటి వ్యాధులు సోకుతున్నాయి. దోమల నివారణ చర్యలు మాత్రం వీటిని పెద్ద ఎత్తున మురుగు కాల్వల్లో పిచికారీ చేయించాలి.

నీ నగరాలు, పట్టణాలు, నగర పంచాయతీల్లో వర్షాకాలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. నీ గ్రామాల్లో 14వ ఆర్థిక సంఘం నిధులు, సాధారణ నిధులు కొన్నిచోట్ల ఉన్నాయి. వీటిని పారిశుద్ధ్య పనులకు వినియోగించాలని జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికే ఆదేశాలిచ్చారు. అవసరమైన బ్లీచింగ్, ద్రావకాలు, ఇతర సామగ్రిని సిద్ధం చేసుకుని, దోమల నియంత్రణకు పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టాలి. నీ ప్రధానంగా ఏజెన్సీ ప్రాంతంలోని 11 మండలాల పరిధిలో ఏటా మలేరియా కేసులు నమోదవుతున్న 640 ఆవాసాలను గుర్తించారు. ఇక్కడ ఇళ్లలోని గోడలకు దోమల నివారణ ద్రావకాన్ని పిచికారీ చేయాల్సి ఉంది.

# రాష్ట్రంలో జగనన్న ధరల పెంపు

# పథకం అమలవుతోంది- అనిత

## అనిత, తెలుగు మహిళ అధ్యక్షురాలు

ప్రభుత్వంపెంచిన నిత్యావసరాల ధరలతో ప్రజలు పస్తులు ఉండాల్సిన దుస్థితి వచ్చింది. సంక్షేమానికి సొంత నిధులేవో ఖర్చు చేస్తున్నట్లుగా ముఖ్యమంత్రి భావిస్తున్నాడు. అందుకే ప్రతీ పథకానికి జగనన్న అని ఆయన పేరే పెడుతున్నాడు. నవరత్నాల్లో భాగంగా రాష్ట్రంలో జగనన్న ధరల పెంపు పథకాన్ని అమలు చేస్తున్నారేమో అనిపిస్తోంది. రోజు కూలీలతోపాటు, నెలవారీ జీతంపై ఆధారపడి బతికేవారు ఈ ప్రభుత్వంలో బతకలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే అన్నిరకాల నిత్యావసరాల ధరలు రెండింతలు పెరిగిపో యాయి. వాటికి తోడు జగన్ పెంచిన విద్యుత్, ఆర్టీసీ ఛార్జీలు, వివిధ రకాల పన్నుల భారం ప్రజలకు అదనపు గుదిబండ. టీడీపీ హయాంలో రూ.90లు ఉన్న కేజీ శనగనూనె ఇప్పుడు రూ.213కు చేరింది. నలుగురు సభ్యులున్న కుటుంబం కేవలం వెచ్చాలకే నెలకు రూ.5వేలు ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. కేవలం సరుకులకే అంత అయితే.. రూ.10వేలు, రూ.15వేల జీతంతో బతికే వారి పరిస్థితేంటి..? రాష్ట్రంలో 80 లక్షలమంది తల్లులుంటే 43 లక్షల మందికే అమ్మఒడి ఇస్తోంది జగన్ సర్కార్. అదికూడా ఒక్క పిల్లాడికే ఆర్థికసాయం చేస్తోంది. ఆ పథకం కింద నెలకు రూ.1,200 ఇస్తూ.. ధరలు పెంచి దానికి పదింతలు వసూలు చేస్తున్నాడు జగన్. ప్రజల గురించి ఆలోచించే నాయకుడెవరూ ఇలాంటి పనులు చేయరు. ఆఖరికి ఫైబర్ గ్రిడ్ ధరను కూడా పెంచేసింది ప్రభుత్వం. విద్యుత్ శ్లాబ్ ఛార్జీలు పెంచేసి చిన్న కుటుంబానికి కూడా నెలకు రూ.500లు ఆపైన వసూలు చేస్తున్నారు. దానికితోడు అదనంగా పెట్రోల్, డీజిల్ ధరలు. చంద్రబాబు ప్రభుత్వంలో ఒకటి, రెండు నిత్యావసరాలపై రెండు, మూడు రూపాయలు పెరిగితే అప్పట్లో పూనకంతో ఊగిపోయాడు జగన్. ఊకదంపుడు ఉపన్యాసాలిచ్చాడు. తనపార్టీ శ్రేణులతో ధర్నాలు, రాస్తారోకోలు చేశాడు. మరిప్పుడు అదే వ్యక్తి ఇంట్లో నుంచి ఎందుకు బయటకు రావడం లేదు..? తనకు ఓట్లేశారు కాబట్టి, జనంతో అవసరం తీరిపోయిందని అనుకుంటున్నాడా..? అధికార మదంతో జగన్.. తన పాలనంతా తాడేపల్లి నుంచే చేస్తున్నాడు. ప్రజల్లో ఉండేవాడిని ప్రజానాయకుడని అంటారు గానీ.. ఇంట్లో కూర్చునే వాడినికాదు. పాదయాత్ర పేరుతో



ప్రజలకు పనికిమాలిన, అక్కరకు రాని హామీలిచ్చి వారిని మోసగించాడు. సీఎం కుర్చీ అంటే ప్రభుత్వఉద్యోగం అని భావిస్తున్నట్లుగా ఉంది. అందుకే వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. సామాన్యుడి ఆర్థిక పరిస్థితి ఎంతలా దిగజారిందో సీఎం గ్రహించడం లేదు. ఆయన అమలు చేస్తున్న దిక్కుమాలిన సంక్షేమ పథకాలు, గోతిలో పెట్టడానికి తప్ప దేనికీ పనికిరావు. అమ్మఒడి కంటే ఘోరంగా వాహనమిత్ర అమలు చేస్తున్నారు. ఆటోడ్రైవర్లు సహా, ఇతరత్రా వాహనాల యజమానులకు రూ.10 వేలు ఇస్తూ. ఆర్టీఐ అధికారులను, పోలీసులను ఉసిగొల్పి అంతకు నాలుగింతలు వసూలు చేస్తున్నారు. దానికితోడు రోడ్ ట్యాక్స్ పేరుతో మరో దోపిడీ. ఏడాదికి రూ.10 వేలు అంటే నెలకు రూ.800లు. ఆ మాత్రం సొమ్ముతోనే వాహనాలు ఉన్నవారినంతా బతికిస్తున్నట్లు పేపర్లలో కలరింగ్ ఇస్తున్నారు. పథకాలపేరుతో ప్రజలను దోపిడీ చేస్తున్నాడు జగన్. చంద్రబాబు 2014లో ముఖ్యమంత్రి అయ్యాక లోటు బడ్జెట్లో ఉన్న రాష్ట్రాన్ని ముందుకు నడిపించడానికి ఏడాదికి సుమారుగా రూ.20వేల కోట్ల అప్పుచేస్తే. దానికే రాష్ట్రం అప్పులమయం అయిందని గగ్గోలు పెట్టాడు. మరిప్పుడు ఆయన చేస్తున్నదేంటి..? రాష్ట్రంపై రూ.3 లక్షలకోట్ల అప్పుల భారం పెట్టాడు. ప్రతీ కుటుంబానికి రూ.2.50 లక్షల అప్పుమిగిల్చాడు. ఇంట్లో కూర్చొని అప్పులు తెచ్చి పాలన చేయడమే అభివృద్ధా..? ఈ ముఖ్యమంత్రి చేస్తున్న అప్పులన్నీ అంతిమంగా ప్రజలే కట్టాలి. ధరలపెరుగుదల.. పెట్రోల్, డీజిల్ భారంపై ప్రభుత్వం కొంత సబ్సిడీ భరించాలి. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో సామాన్యులు, పేదలపై కొంత భారం తగ్గించేందుకు కృషి చేయాలి.

# చర్చనీయాంశంగా ఆనందయ్య

# మందు కవర్.. మా ఇష్టమన్న కాకాణి

నెల్లూరు: నెల్లూరు జిల్లాలోని గొలగముడి ఆలయం వద్ద ఆనందయ్య మందు పంపిణీని ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్ రెడ్డి ప్రారంభించారు. అయితే ఆనందయ్య మందు కవర్‌పై వైసీపీ రంగులతో పాటు ఆ పార్టీ నేతల ఫోటోలు దర్శనమివ్వడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. దీనిపై ఏబీఎన్ ఆంధ్రజ్యోతి వైసీపీ ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌ను ప్రశ్నించగా.. వైసీపీ రంగులతో పాటు తమ ఫోటోలు వేసుకోవడం తమ ఇష్టమని తెలిపారు. ఇంకా కాకాణి ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. "మేము మా నిధులు ఖర్చుపెట్టి తయారు చేయించి పంచుతున్నాం.

సర్వేపల్లి నియోజకవర్గంలో 1.80 లక్షల కుటుంబాలకు ఆనందయ్య మందు పంపిణీ చేస్తున్నాం. అలా దాదాపు 3 లక్షల మందికి మందు అందించనున్నాం. కరోనా కష్టకాలంలో ఆనందయ్య మందు తయారు చేయడం సంతోషం. ప్రభుత్వ అనుమతులు రాగానే మొదట సర్వేపల్లి మందు ఇవ్వాలి అనుకున్నాం. అందుకే ఒకటిన్నర లక్షల ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నాం. మందు ప్యాకెట్‌ను ప్రతి కుటుంబానికీ ఇస్తాం. వలంటీర్ల ఆధ్వర్యంలో కుటుంబాలకు చేరుస్తాం.

మందు పంపిణీని రాజకీయం చేస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు, కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవాలి. ఆనందయ్య మందుపై నేను అవినీతికి పాల్పడి ఉంటే నా కుటుంబం నాశనం అవుతుంది. సర్వేపల్లి నియోజకవర్గంలో పంపిణీ పూర్తి అయ్యాక రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేస్తాం" అని తెలిపారు.

# 45 ఏళ్లు పైబడిన అందరికీ వ్యాక్సినేషన్: సుచరిత

గుంటూరు: నలభై ఐదేళ్లు పైబడిన ప్రతి ఒక్కరికి వ్యాక్సినేషన్ అందిస్తున్నామని హెూంమంత్రి మేకతోటి సుచరిత అన్నారు. సోమవారం ఆమె ఏటుకూరులో వ్యాక్సినేషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అర్హత ఉన్న అందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. సంక్షేమ పథకాల ద్వారా కేవలం రెండేళ్లలోనే లబ్ధిదారుల ఖాతాల్లో రూ.లక్షా 31 వేల కోట్లు వేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. అభివృద్ధి సంక్షేమానికి పెద్దపీట వేశామని, ఎన్నికల్లో ఇచ్చిన 95 శాతం హామీలను నెరవేర్చామని తెలిపారు. "గతంతో పోలిస్తే క్రైమ్ రేట్ చాలా తగ్గింది. చిత్తూరు ఏడేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిని వ్యక్తికి 7 నెలల్లోనే.. ఉరిశిక్ష పడేలా చేసిన ఘనత మా ప్రభుత్వానికే దక్కుతుంది. టీడీపీ హయాంలో రిషితేశ్వరి హత్య జరిగితే ఏం చేశారో అందరికీ తెలుసు. దిశ చట్టం కింద 500 కేసుల్లో శిక్షలు ఖరారు చేశాం. విశాఖలో కర్ఫ్యూ సమయంలో బయటికొచ్చిన యువతి వద్ద పాస్ లేదు. అనుమతి పత్రాలు లేకపోవటంతో కేసు నమోదు చేశారు. కేసు నమోదు చేసిన తర్వాత కూడా పోలీసులతో వాదన పెట్టుకుంది. సోషల్ మీడియాలో వచ్చినవే నిజాలు అనుకోకూడదని" మంత్రి సుచరిత అన్నారు.



# "చెత్త" పై పన్ను తీర్మానం రద్దు చేయాలి




బొబ్బిలి:చెత్తపై పన్ను తీర్మానాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి వేణు డిమాండ్ చేశారు. చెత్తపన్నుకు వ్యతిరేకంగా సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సేవలను ఉచితంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నప్పటికీ చెత్త సేకరణకు పన్ను వేయడం దుర్మార్గమన్నారు. చెత్త సేకరణ , తాగునీరు సరఫరా , వీధి దీపాలు నిర్వహణ బాధ్యత ప్రభుత్వమే చూడాల్సి ఉన్నప్పటికీ చెత్తపన్ను నెలకు రూ.50 వసూలు చేసేందుకు కౌన్సిల్ తీర్మానం చేయడం అన్యాయమన్నారు. పన్నులు కట్టేందుకు ప్రజలను అలవాటు చేసేందుకు ప్రారంభంలో నెలకు రూ.50 అమలు చేసి క్రమేణా పన్నులు పెంచి ప్రజలపై భారాలు వేస్తారని ఆరోపించారు. పట్టణాల్లో యూజర్ చార్జీలు వసూలు చేయాలని ప్రధాని మోడీ ఆదేశించడంతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 196 , 197 , 198 జీవోలు తీసుకొచ్చి చెత్త , తాగునీరు , ఆస్తిపై యూజర్ చార్జీలు పేరుతో పన్నులు వసూలు చేసేందుకు మున్సిపాలిటీలు తీర్మానం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు నిధులు కేటాయించకుండా కార్పొరేట్ సంస్థలకు కేటాయించడం వలనే ప్రజలపై పన్నుల దుస్థితి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పౌర సేవలను కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందించి పన్నులు వేసే తీర్మానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ సావు మురళీకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు వి.ఇందిర , పి.శంకర్రావు , ప్రజలు పాల్గొన్నారు.

# సమస్యల పరిష్కారానికి14, 15న రాష్ట్రవ్యాప్త సమ్మె

విజయనగరం : కరోనా కష్టకాలంలో ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తున్న పురపాలక సంఘం పారిశుద్ధ్య కార్మికుల సమస్యలను ప్రభుత్వం విస్మరిస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.వి.రమణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కె.ఎల్.పురం ఎన్‌పీఆర్ భవనంలో రాష్ట్ర మున్సిపల్ కార్మికుల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు, కార్మికులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికులు కరోనా బారిన పడకుండా రక్షణ పరికరాలను అందజేయాలని డిమాండు చేశారు. 60 ఏళ్లు నిండిన వారిని ఇంటికి పంపకుండా, ప్రభుత్వం రూ.ఐదు లక్షలతో పాటు నెలకు పింఛను, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఆప్కాస్ విధానం రద్దు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో కార్మికుల సమస్యలపై రాష్ట్రవ్యాప్తంగా సమ్మె చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు ఈ నెల 7 నుంచి 12 వరకు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు, ఉద్యోగ ప్రదేశాల్లో నిరసనలు తెలపనున్నామని తెలిపారు.



# గుంటూరు టీడీపీలో జోష్



గుంటూరు, : రాజధాని జిల్లా గుంటూరులో పార్టీ అధికారంలో ఉన్నప్పుడు టీడీపీ ఫుల్ స్వింగ్‌లో ఉండేది. టీడీపీ సీనియర్లు ఎక్కడికక్కడ హడావిడి చేసేవారు. జిల్లా పార్టీ ఆఫీస్ ఎప్పుడూ పార్టీ నేతలు, ఎమ్మెల్యేలతో కళకళలాడుతూ ఉండేది. అలాంటి పార్టీ ఆఫీస్ ఇప్పుడు వెలవెలబోతోంది. పార్టీ ప్రతిపక్షంలోకి వచ్చి ఇరవై నెలలు అవుతోంది. ప్రతిపక్షంలో ఉండడం ఎలా ? ఉన్నా ఓ వైపు స్థానిక సంస్థల ఎన్నికలు జరుగుతున్నాయి. మరోవైపు ఏపీలో మిగిలిన చోట్ల వైసీపీ జోరు ఉన్నా రాజధాని జిల్లాలు అయిన గుంటూరు, కృష్ణాలపైనే అందరికి ఆసక్తి ఉంది. గుంటూరు జిల్లాలో వైసీపీపై టీడీపీ ఖచ్చితంగా పై చేయి సాధిస్తుందనే చాలా మంది అంచనా వేస్తున్నారు. ఇన్ని అంచనాలు ఉన్నా.. పార్టీకి మంచి ఛాన్స్ ఉన్నా కూడా పార్టీ నేతలు మాత్రం దానిని యూజ్ చేసుకోలేకపోతున్నారు. అసలు పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎంజాయ్ చేసిన నేతలు ఇప్పుడు జిల్లా పార్టీ ఆఫీస్‌కే రాని స్థితిలో ఉన్నారంటే వీరికి ప్రస్తుత పరిస్థితుల్లో రాజకీయం చేయడం ఆసక్తిగా లేదనే అర్థమవుతోంది. ఇక టీడీపీ అధికారంలో ఉండగా.. నాడు ఎమ్మెల్యేగాను, ఉమ్మడి జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న జివి. ఆంజనేయులు ప్రెస్‌మీట్లతో నాడు ప్రతిపక్షంలో ఉన్న జిల్లా వైసీపీ నేతలకు కంటిమీద కునుకు లేకుండా చేసేవారు. ఎప్పటికప్పుడు మీడియాలో హైలెట్ అయ్యేవారు. అయితే ఇప్పుడు ఆయనకు గుంటూరుతో లింకులు తెగిపోయాయి. ఆయన నరసారావుపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షుడిగా ఉండడంతో గతంలో ఉన్నంత స్పీడ్‌గా లేరు. వినుకొండలో బ్రహ్మనాయుడును టార్గెట్ చేసేందుకే పరిమితమవుతున్నారు. ఇక యరపతినేని అధికారంలో ఉంటే మినిస్టర్ కాకపోయినా మినిస్టర్ రేంజ్ హంగామా ఉండేది. మొన్న జడ్పీ, మండల ఎన్నికల్లో పూర్తిగా చేతులు ఎత్తేసిన ఆయన ఇప్పుడు పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో మాత్రం పిడుగురాళ్లలో మకాం వేసి పట్టు కోసం పాకులాడుతున్నారు. ఆయన టార్గెట్ ఇప్పుడు గురజాల.. మహా అయితే పక్కనే ఉన్న మాచర్ల మీద మాత్రమే ఉంది. గత ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న ప్రత్తిపాటి పుల్లారావు నియోజకవర్గాన్ని వదిలేసి హైదరాబాద్‌కే పరిమితమయ్యారు. తాజా షాక్ ఏంటంటే చిలకలూరిపేట జడ్పీటీసీ టీడీపీ అభ్యర్థి వైసీపీ కండువా కప్పుకున్నారు. పార్టీ స్ట్రాంగ్ అయ్యిందనిపిస్తే మనం యాక్టివ్ అవుదాం అన్న ధోరణిలో ఆయన ఉన్నారు. సత్తెనపల్లిలో పార్టీకి కెప్టెన్ లేక కేడర్ డీలా పడింది. మాజీ ఎంపీ రాయపాటి ఫ్యామిలీ వరుస కేసులతో రాజకీయాలకు దూరంగా ఉంది. కోడెల వారసుడు తిరుగుతున్నా ఆయనపై టీడీపీ కేడర్‌లో నమ్మకం లేదు. ఆయన జిల్లాలో మిగిలిన నాయకులను వదిలేసి అక్కడక్కడే తిరుగుతున్న పరిస్థితి. పొన్నూరులో రెండున్నర దశాబ్దాల నరేంద్ర రాజకీయం ఉందా ? అన్న సందేహాలు ఉన్నాయి. ఆయన మరీ భయస్తుడిగా మారి అధికార పార్టీకి సరెండర్ అయ్యాడంటున్నారు. ఉన్నంతలో పాత నేతల్లో మాజీ మంత్రులు ఆలపాటి రాజా, నక్కా ఆనంద్ బాబు మాత్రమే గట్టి వాయిస్ వినిపిస్తున్నారు. ఇక కొత్త నేతల్లో నరసారావుపేట ఇన్‌చార్జ్ చదలవాడ అరవిందబాబు, బాపట్ల ఇన్‌చార్జ్ వేగేశన నరేంద్ర వర్మ ఇద్దరు రెట్టించిన ఉత్సాహంతో పని చేస్తున్నారు. ప్రత్తిపాడులో అవుట్ డేటెడ్ అయిన మాజీ మంత్రి మాకినేని రత్తయ్య మాట ఎవ్వరూ వినే పరిస్థితి లేదు. మాచర్లలో చలమారెడ్డిది అదే పరిస్థితి. తాడికొండలో ఇప్పుడున్న పరిస్థితిలో టీడీపీ అన్ని సీట్లు స్వీప్ చేయాలి. కానీ గుంటూరు పర్లమెంటరీ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రవణ్ కుమార్ వస్తే అవే వస్తాయిలే అని వెయిట్ చేయడం మినహా ఇక్కడ పార్టీకి ఊపు తేవడం లేదు. రేపల్లెలో అనగాని పార్టీకి ఉన్న ఏకైక ఎమ్మెల్యే కావడంతో పర్వాలేదు. ఇక నగరంలో తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల్లో పార్టీకి ఉన్న ఇద్దరు ఇన్‌చార్జ్‌లతో ఒరిగింది ఏమీ లేదు. ఈ నేపథ్యంలో ఇక్కడ టీడీపీ నేతలు ఎప్పుడు ట్రాక్ లోకి వచ్చి పార్టీని పటిష్టం చేస్తారో ? ఇంత బెటర్ ఛాన్స్ కూడా వీరు ఎందుకు కాలదన్నుకుంటున్నారో ? తెలియడం లేదు.

# ఆనంకు ఆశలు గల్లంతేనా...

నెల్లూరు, : వైసీపీ సీనియర్ నేత ఆనం రామనారాయణరెడ్డి ఇక పూర్తిగా ఆశలు వదులుకున్నట్లే కన్పిస్తుంది. మంత్రి వర్గ విస్తరణలో తనకు ఛాన్స్ దక్కే అవకాశాలు లేవని ఆయనకు తెలిసిపోయింది. జరుగుతున్న పరిణామాలు, అధికారులు, మంత్రులు తనకు సహాయ నిరాకరణ చేయడం ఇందుకు సంకేతాలుగా ఆనం రామనారాయణరెడ్డి భావిస్తున్నారు. అందుకే ఆయన ఇక తన భవిష?యత్ కార్యాచరణను సిద్ధం చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఆనం రామనారాయణరెడ్డి సీనియర్ నేత. ఆయన ఎన్నికలకు ముందు వైసీపీలో చేరడంతో పార్టీకి హైప్ వచ్చిందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఆయన కూడా వైసీపీ అధిష్టానం ఆదేశాలకు తలొగ్గి తనకు పట్టున్న ఆత్మకూరు నియోజకవర్గాన్ని వదిలిపెట్టి వెంకటగిరి వెళ్లి విజయం సాధించారు. అయితే గెలిచిన నాటి నుంచి ఆనం రామనారాయణరెడ్డికి ఏమాత్రం సంతృప్తి కరంగా లేదు. తన నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో ఎన్నడూ ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కొనలేదని ఆనం రామనారాయణరెడ్డి చెబుతున్నారు. ఆనం రామనారాయణరెడ్డి
అపోజిషన్ లో లేరు. అధికార పార్టీ ఎమ్మెల్యేనే. అయితే ఆయన వయసుకు, అనుభవానికి తగిన గౌరవం ఇవ్వడం లేదన్నది ఆయన బాధ. దీనికి కారణం 2014 నుంచి 2018 వరకూ ఆనం కుటుంబం వైఎస్ జగన్ పై చేసిన మాటల దాడిని పార్టీకి చెందిన మంత్రులు పరిగణనలోకి తీసుకుంటున్నారు. ముఖ్యంగా మరణించిన దివంగత ఆనం వివేకానందరెడ్డి జగన్ పై నిత్యం అనరాని మాటలతో సెటైరికల్



గా విరుచుకుపడేవారు. ఇవన్నీ వైసీపీ మంత్రులు పదే పదే పార్టీ హైకమాండ్ కు గుర్తు చేస్తుండటంతో ఆనం రామనారాయణరెడ్డిని దూరం పెడుతున్నారన్న టాక్ బలంగా ఉంది. ఇక వైసీపీ లో తనకు విలువ ఉండదని ఆనం
రామనారాయణరెడ్డి రెండేళ్ల తర్వాత గ్రహించినట్లుంది. అందుకే ఆయన ఇప్పుడిప్పుడే వెంకటగిరితో పాటు ఆనం కుటుంబానికి పట్టున్న నెల్లూరు టౌన్, ఆత్మకూరు నియోజకవర్గాల్లో సయితం తన గ్రూపును బలోపేతం చేసుకోవాలని భావిస్తున్నారట. ఇందుకోసం నెల్లూరు టౌన్ ఆనం వివేకా కుమారుడు రంగమయూర్ రెడ్డి చేత కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. త్వరలోనే ఆత్మకూరు నియోజకవర్గంపై కూడా ఆనం రామనారాయణరెడ్డి దృష్టి పెడతారంటున్నారు. మొత్తం మీద రెండేళ్లకు గాని ఆనం రామనారాయణరెడ్డి అసలు విషయం తెలిసిరాలేదంటున్నారు.

# వైసీపీ నేతల పోరే...టీడీపీకి ప్లస్

విజయవాడ,: పంచాయతీ ఎన్నికలు అంటేనే పెద్ద పంచాయతీ. నిజానికి పల్లెకు అతి పెద్ద గ్రామ సభ. ఉన్న చోటనే న్యాయం తమకు జరుగుతుందని, సమస్యలు తీరుతాయని జనం నమ్మి ఓట్లేసి గెలిపించుకునే గ్రామ స్థాయి పార్లమెంట్ పంచాయతీ. అటువంటి పంచాయతీలకు రాజకీయాల రంగు అంటించేశారు. ఏకంగా చంద్రబాబు ఎన్నికల మ్యానిఫేస్టోని రిలీజ్ చేసి పందెం నువ్వా నేనా అంటూ ముఖ్యమంత్రి జగన్ కి ధీటు అయిన సవాల్ విసిరారు. ఇదిలా ఉంటే పంచాయతీ ఎన్నికల నుంచి లోకల్ ఫైట్ కి కథ మొదలుపెట్టారు. అంటే గ్రామం నుంచి సమరం సాగి ఆఖరుకు పట్టణాలకు చేరుతుంది అన్న మాట. ఎన్నికల సంఘం మొదట పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని అనుకోవడం వల్ల ఎవరికి లాభం అన్నది కూడా చర్చ సాగుతోంది. ఇక ఏపీలో చూస్తే క్షేత్ర స్థాయిలో టీడీపీకి బలం ఉంది. టీడీపీకి ఓట్లు పడని పోలింగు బూత్ లేదు, టీడీపీ గుర్తు తెలియని పల్లె జనం లేరు. నాలుగు దశాబ్దాలుగా పాతుకుపోయిన పార్టీ అది. ఇక టీడీపీ కింద నుంచి పైకి రావాలనుకుంటోంది. రాష్ట్రంలో పోగొట్టుకున్న అధికారాన్ని చేజిక్కుంచుకోవాలంటే పల్లెలను ముందు తన వైపునకు తిప్పుకోవాలని చూస్తోంది. దాంతో పాటే ముందస్తుగా కసరత్తు చేసింది. అభ్యర్థులను రెడీ చేసి పెట్టుకుంది. వ్యూహాలను కూడా రూపొందించుకుంది. దాంతో పల్లె పోరులో టీడీపీ తరఫున గట్టిగానే హుషార్ ఉందని చెప్పాలి. ఇక వైసీపీ విషయం తీసుకుంటే ఆ పార్టీకి శత్రువులు సొంత పార్టీలోనే ఉన్నారు. వైసీపీ అధినేత జగన్ ఏకగ్రీవాలు ఎక్కువగా జరగాలని కోరుతూంటే దాని మాట దేముడెరుగు, కనీసం అందరికీ ఆమోదయోగ్యమైన అభ్యర్థిని ప్రతీ పంచాయతీకి ఒకరిని అయినా నిలబెట్టలేకపోతున్నారు పార్టీ నేతలు. ప్రతీ పంచాయతీలో వర్గ పోరు తారస్థాయిలో ఉంది. దాంతో ఎవరికి వారే పోటీకి తయారు అయ్యారు. ఇక ఇప్పటికే ఎంపీటీసీలకు, జెడ్పీటీసీలకు అభ్యర్థులుగా ఉన్న వారు ఎవరిని కాదంటే తమకు రేపటి రోజున ఇబ్బంది అవుతుందో అని సర్దిచెప్పకుండా పక్కకు తప్పుకుంటున్నారు. మరో వైపు ఎమ్మెల్యేలదీ ఇదే బాధ. ఒకరి పక్షం ఉంటే మిగిలిన వారి ఓట్లు వచ్చే ఎన్నికల్లో తమకు దక్కకుండా పోతాయన్న అతి తెలివితో ఎందుకొచ్చిన గొడవ అంటూ దూరంగా ఉంటున్నారు. దాంతో రెబెల్ అభ్యర్థులు అన్ని చోట్లా వైసీపీకి పెరిగిపోయారు. అది చివరికి గెలుపు అవకాశాల మీద డేంజర్ బెల్స్ మోగించేస్తోంది. పంచాయతీ పోరులో వైసీపీ నేతలు వీధిన పడడం చాలా చోట్ల టీడీపీకి మేలు చేసేలా ఉందని కూడా అంటున్నారు. దీనికి జిల్లా, నియోజకవర్గ నాయకులదే తప్పు అని కూడా అంటున్నారు. పంచాయతీల్లో ఎక్కువ సంఖ్యలో టీడీపీ మద్దతుదారులు గెలిస్తే ఆ మీదట జరిగే ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో వీరే తమ వారిని గెలిపిస్తారు. అలా దిగువ స్థాయి నుంచి గెలుపుతో ఏపీలో గొప్ప రాజకీయ మలుపుని తీసుకురావాలని చంద్రబాబు బ్రహ్మండమైన వ్యూహరచన చేస్తూంటే అధికారం చేతిలో ఉన్నా కూడా వైసీపీ వ్యూహాలు కొరవడి చేష్టలుడిగి చూస్తోందని అంటున్నారు. మొత్తానికి పంచాయతీ నీదా నాదా అని అక్కడ బాబు జగన్ ప్రతిష్టగా తీసుకున్నారు. మరి ఇక్కడ పంచాయతీలో ఫ్యాన్ స్పీడ్ అందుకోకపోతే ఆ పార్టీకి యమ డేంజరే అంటున్నారు.

# సీనియర్లకు రాం..రాం...

విజయవాడ,: ఏపీలో త్వరలోనే కీలక మార్పు జరగనుందా ? ఆ దిశగా సీఎం జగన్ ఆలోచన చేస్తున్నారా ? అంటే.. ఔననే అంటున్నారు వైసీపీ నేతలు. వారి మధ్య జరుగుతున్న చర్చల నేపథ్యంలో ఈ విషయం ఆసక్తిగా మారింది. ప్రస్తుతం ఏపీ ప్రభుత్వానికి విపక్షాలకు, అదే సమయంలో ఎన్నికల సంఘానికి మధ్య తీవ్ర వివాదాలు సాగుతున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వం వారితో .. న్యాయ పరంగా పోరాటం చేస్తోంది. ఒకవైపు విమర్శలకు ప్రతి విమర్శలకు చేస్తూనే..కౌంటర్లు ఇస్తూనే.. మరోవైపు.. న్యాయ పోరాటం చేస్తోంది. అయితే, ఈ న్యాయ పోరాటంలో జగన్ ప్రభుత్వానికి అనుకూలంగా కన్నా.. వ్యతిరేకంగానే తీర్పులు వస్తున్నాయి. కీలకమైన ఎస్ఈసీ విషయం నుంచి రాజధాని భూముల నిర్ణయం వరకు అన్నింటిలోనూ జగన్‌కు వ్యతిరేకంగా తీర్పులు వస్తున్నాయి. ఈ క్రమంలోనే హైకోర్టు న్యాయమూర్తులు కొందరు తమపై పగబట్టారనే వ్యాఖ్యలను పరోక్షంగా చేయడంతోపాటు.. న్యాయమూర్తులకు వ్యతిరేకంగా.. పెట్టిన పోస్టుల విషయంలోనూ దూకుడుగా వ్యవహరించారు. ఇవన్నీ ఒక వైపు సాగుతుండగానే న్యాయమూర్తిని మార్చేలా చక్రం తిప్పారనే వ్యాఖ్యలు వినిపించాయి. ఈక్రమంలోనే హైకోర్టు న్యాయమూర్తులు ఒకరిద్దరు మారారు. అయితే.. అప్పటికీ.. జగన్ ఆశించిన విధంగా న్యాయం లభించడం లేదనే వ్యాఖ్యలు వైసీపీలో వినిపిస్తున్నాయి. దీనిపై కొన్నాళ్లుగా వైసీపీలో అంతర్మథనం సాగుతోంది. సరైన వాదనలు వినిపించడం లేదనే అసంతృప్తి.. జగన్‌లోను కేబినెట్‌లోని కీలక మంత్రుల వద్ద చర్చ సాగుతోంది. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున దాదాపు 15 మంది వరకు సీనియర్ అడ్వొకేట్లు ఉన్నారు. అయితే.. వీరిలో ఒకరిద్దరు తప్ప.. మిగిలిన వారు సరైన వాదన వినిపించడం లేదనే వైసీపీ సీనియర్లు అంటు న్నారు. ఈ క్రమంలో అడ్వొకేట్ జనరల్.. శ్రీరాం సహా.. అందరినీ మార్చడం ఖాయమని జగన్ యోచిస్తున్నట్టు సమాచారం. జగన్ తీసుకుం టోన్న వరుస సంచలన నిర్ణయాల పరంపరలో ఇది మరోసారి రాజకీయాల్లో ప్రకంపనలు రేపడం ఖాయంగా కనిపిస్తోంది. ఇదే విషయంపై వైసీపీలో నేతల మధ్య గుసగుస వినిపిస్తుండడం గమనార్హం.

## ఏనుగులు దాడి..
## యువకుడి మృతి

ఛత్తీస్‌గఢ్: దంతరి జిల్లాలో దారుణం జరిగింది. విశ్రామ్‌పూర్ గ్రామ సమీపంలో ఏనుగుల గుంపు దాడిలో యువకుడు మృతిచెందాడు. విండోటోలా అటవీ ప్రాంతంలో కూలి పనులు చేసేందుకు వెళ్లిన యువకుడిపై ఏనుగులు దాడి చేశాయి. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే యువకుడు మరణించాడు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

# వేగంగా రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు

తాండూర్, : మండల కేంద్రం ఐబీలో కొత్తపల్లి రైల్వే గేట్ వద్ద అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఎన్నో ఏండ్లుగా వివిధ మండలాలు, గ్రామాలకు వెళ్లే ప్రజలకు తాండూర్‌లోని రైల్వే గేట్లు ఇబ్బందిగా ఉండేవి. అత్యవసర సమయంలో రైల్వే గేట్లు మూసి ఉండడంతో సమయానికి వైద్యం అందక ప్రాణాలు పోయిన ఘటనలు ఉన్నాయి. రెండు రైల్వే గేట్ల



ను తొలగించేందుకు రైల్వే శాఖ సిద్ధమైంది. రైల్వేగేట్లు ఉన్న ప్రాంతంలో అండర్ బ్రిడ్జి (భూగర్భ వంతెన)ను నిర్మిస్తున్నారు. కొత్తపల్లి రైల్వే గేటు వద్ద పనులు వేగంగా సాగుతున్నాయి.
రూ. 2 కోట్ల వ్యయంతో పనులు: తాండూర్ ఐబీలో చేపడుతున్న రైల్వే అండ ర్ బ్రిడ్జి నిర్మాణ పనులను రూ. 2 కోట్ల వ్యయంతో చేపట్టారు. రాకపోకలకు ఎలాంటి అంతరాయం లేకుండా పనులు చేపడుతున్నారు. పట్టాల కింద వేసే బాక్స్‌ల నిర్మాణ పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 2 కోట్ల వరకు ఖర్చు అవుతుందని, మార్చి నెలాఖరు వరకు పనులు పూర్తి చేయనున్నట్లు కాంట్రాక్టర్ తెలిపారు. రైల్వే గేట్లతో ఇబ్బందులు పడ్డ ప్రజలు వేగవంతంగా కొనసాగుతున్న అండర్ బ్రిడ్జి నిర్మాణ పనులను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# వ్యవసాయ భూములపై సీఎం సంచలన ప్రకటన

## మూడు నాలుగు నెలల్లో మొత్తం క్లారిటీ

హైదరాబాద్: ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించిన విధంగా రాష్ట్ర వ్యాప్తంగా త్వరలోనే డిజిటల్ సర్వే చేసి, వ్యవసాయ భూములకు కో ఆర్డినేట్స్(అక్షాంశ రేఖాంశాలు) ఇస్తామని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ప్రకటించారు. సర్వే కోసం వెంటనే టెండర్లు పిలవాలని సిఎం ఆదేశించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ పూర్తి పారదర్శకంగా జరగాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఎంతో శ్రమించి, ప్రవేశ పెట్టి, అమలు చేస్తున్న ధరణి పోర్టల్ నూటికి నూరు పాళ్లు విజయవంతమయిందని సిఎం సంతృప్తి వ్యక్తం చేశారు. రెవెన్యూలో సంస్కరణలు తెచ్చిన ఫలితంగా, రెవెన్యూ శాఖ పని విధానంలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయని, ఈ నేపథ్యంలో ఆ శాఖ అధికారులు భవిష్యత్తులో నిర్వహించాల్సిన విధులకు సంబంధించి జాబ్ చార్టు రూపొందించనున్నట్లు వెల్లడించారు. రెవెన్యూ సంస్కరణలు, ధరణి పోర్టల్ పనితీరుపై ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ప్రగతి భవన్ లో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సిఎస్ సోమేశ్ కుమార్, ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, కార్యదర్శులు స్మితా సభర్వాల్, భూపాల్ రెడ్డి తదితరులతో చర్చించారు. ఈ సందర్భంగా పలు నిర్ణయాలు ప్రకటించారు. 'ధరణి పోర్టల్ వల్ల రెవెన్యూలో అవినీతి అంతమయింది. నోరులేని, అమాయకుల రైతులకు న్యాయం జరిగింది. ఒకరి భూమిని ఇంకొకరి పేరు మీద రాసే అరాచకం ఆగింది. జుట్టుకు జుట్టుకు ముడేసి పంచాయతీ పెట్టే దుష్ట సంప్రదాయం ఆగింది. డాక్యుమెంట్లు గోల్ మాల్ చేసి, రెవెన్యూ కోర్టుల పేరిట జరిగే దుర్మార్గం పోయింది. దేశంలో మరెక్కడా లేని విధంగా, చరిత్రలో ఎన్నడూ జరగని విధంగా ప్రభుత్వం ఎన్నో వ్యయ, ప్రయాసలకోర్చి మూడేళ్లు కసరత్తు చేసి కొత్త చట్టం తెచ్చింది. రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు పారదర్శకంగా, అవినీతికి ఏమాత్రం అవకాశం లేకుండా జరిగిపోతున్నాయి. ఎలాంటి గందరగోళం, అస్తవ్యస్తం లేకుండా భూముల అమ్మకాలు, కొనుగోళ్ల ప్రక్రియ సజావుగా సాగుతున్నది. బయోమెట్రిక్, ఆధార్ ఆధారంగా అమ్మేవారు, కొనేవారు వస్తేనే భూముల రిజిస్ట్రేషన్ జరుగుతున్నది. ధరణిలో నమోదైన



భూములను మాత్రమే అమ్మే, కొనే వీలున్నది. ఆ భూములు మాత్రమే వారసత్వం ద్వారా, గిఫ్ట్ డీడ్ ద్వారా మరొకరికి సంక్రమించే అవకాశం ఉన్నది. ప్రభుత్వం అనుసరిస్తున్న పకడ్బందీ వ్యూహం వల్ల ఎవరూ ధరణిలో వేలుపెట్టి మార్పులు చేసే అవకాశం లేదు. చివరికి సిసిఎల్ఏ, సిఎస్ కూడా రికార్డులను మార్చలేరు. అంతా సిస్టమ్ డ్రివెన్(వ్యవస్థానుగత) పద్ధతిన, హ్యూమన్ ఇంటర్ఫేస్(మానవ ప్రమేయం) లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరుగుతున్నది. రైతులు ఎంతో సంతోషంగా ఉన్నారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ఇంత సజావుగా సాగడం కొందమందికి మింగుడు పడడం లేదు. ధరణి పోర్టల్ మీద చిలువలు, పలువలు ప్రచారం చేస్తున్నారు. అసంబద్ధమైన విషయాలు మాట్లాడుతున్నారు. లేని సమస్యలు సృష్టించి, పైరవీలు చేసి అక్రమంగా సంపాదించుకునే వారు ఇప్పుడు అవకాశం లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. వారే అపోహలు సృష్టించి గందరగోళ పరిచే ప్రయత్నాలు చేస్తున్నారు. వాటికి ప్రజలు తికమక పడొద్దు. కొన్ని పత్రికలు కావాలని తప్పుడు వార్తలు, అసంబద్ధమైన కథనాలు ప్రచురిస్తున్నాయి. ఈ వార్తలపై కలెక్టర్లు ఎప్పటికప్పుడు స్పందించి సంపూర్ణ వివరాలు అందించాలి. సందేహాలను నివృత్తి చేయాలి' అని ముఖ్యమంత్రి చెప్పారు. 'ప్రభుత్వం జరిపిన సమగ్ర భూరికార్డుల ప్రక్షాళన, కొత్త పాసుపుస్తకాలు, ధరణి పోర్టల్ తదితర సంస్కరణ వల్ల వ్యవసాయ భూములకు సంబంధించిన చాలా సమస్యలు పరిష్కారమయ్యాయి. మిగిలిన కొద్ది పాటి సమస్యలు కూడా ప్రభుత్వం త్వరలో జరిపే డిజిటల్ సర్వే వల్ల పరిష్కారం అవుతాయి. నేను అసెంబ్లీలో ఇంతకుముందే ప్రకటించినట్లు త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా డిజిటల్ సర్వే నిర్వహిస్తాం. ప్రతీ భూమికి కో ఆర్డినేట్స్ ఇస్తాం. వాటిని ఎవరూ మార్చలేరు. గందరగోళానికి, తారుమారు చేయడానికి ఆస్కారం ఉండదు. నిజానికి ఇప్పటికే డిజిటల్ సర్వే ప్రారంభం కావాల్సింది. కరోనా వల్ల ఆగింది. అతి త్వరలోనే డిజిటల్ సర్వే ప్రారంభం అవుతుంది. ఒకసారి సర్వే పూర్తయితే అన్ని విషయాలపై స్పష్టత వస్తుంది. రైతుల భూముల మధ్య, అటవీ- ప్రభుత్వ భూముల మధ్య, అటవీ-ప్రైవేటు భూముల మధ్య హద్దుల పంచాయతీ కూడా పరిష్కారం అవుతుంది. పోడు భూముల సమస్య కూడా పరిష్కారం అవుతుంది. 3-4 నెలల్లో మొత్తం సమస్యలు కొలిక్కి వస్తాయి. కో ఆర్డినేట్స్ మారవు కాబట్టి భవిష్యత్తులో కూడా హద్దుల పంచాయతీకి అవకాశం ఉండదు. భూ రికార్డులు సక్రమంగా ఉన్న దేశాల్లో జిడిపి 3-4 శాతం వృద్ధి సాధించింది. తెలంగాణ రాష్ట్రంలో కూడా అలాంటి విప్లవాత్మక మార్పుకు ప్రభుత్వం సిద్ధపడింది' అని సిఎం స్పష్టం చేశారు. 'మారిన పరిస్థితుల్లో రెవెన్యూ స్వరూపం కూడా మారింది. రెవెన్యూ శాఖ విధులు, బాధ్యతల్లో మార్పులు వచ్చాయి. గతంలో భూమి శిస్తు వసూలు చేసినప్పుడు రెవెన్యూ అనే పదం, శాఖ వచ్చాయి. ఇప్పుడు రెవెన్యూ వసూలు చేయకపోగా, ప్రభుత్వమే రైతుబంధు ద్వారా ఎకరానికి ఏటా 10వేల సాయం అందిస్తున్నది. కాబట్టి రెవెన్యూ అనే పేరు కూడా ఇప్పుడు సరిపోదు. పేరు మారే అవకాశం ఉంది. ధరణి పోర్టల్, డిజిటల్ సర్వే తదితర కారణాల వల్ల భూ రికార్డుల నిర్వహణ, రిజిస్ట్రేషన్లు, మ్యుటేషన్లు కూడా సులభంగా, అధికారుల ప్రమేయం లేకుండానే జరిగిపోతాయి. సేద్యం చేసే పంటలు పండించాల్సిన రైతులు తహసిల్దార్ కార్యాలయాల చుట్టూ తిరిగే ప్రయాస ఉండదు. ఇదే ధరణి ప్రధాన లక్ష్యం కూడా. కాబట్టి రెవెన్యూ శాఖ విధుల్లో మార్పులు అనివార్యం. రెవెన్యూ శాఖలో ఎవరేమి పని చేయాలనే విషయంలో ప్రభుత్వం త్వరలోనే జాబ్ చార్టు రూపొందిస్తుంది. ఆర్ఐ ఏం చేయాలి? తహసిల్దార్ఏం చేయాలి? ఆర్డీవో ఏం చేయాలి?అనే విషయాల్లో స్పష్టత ఇస్తాం.

## పోలీసులకే టోకరా వేద్దామనుకున్నాడు.. కానీ,

ముంబై: పోలీస్‌కావాలనే కోరికే ఉంటే ఆశాఖ నిర్వహించే పరీక్షలు రాసి సెలక్ట్ అవ్వాలి. కానీ.. ఇక్కడ ఒక క్యాబ్ డ్రైవర్ తాను పోలీస్ కానిస్టేబుల్ అని అందరితోనూ చెప్పుకున్నాడు. ట్యాక్సీకి పోలీస్ స్టిక్కర్ పెట్టుకున్నాడు. అంతటితోఆగకుండా.. ఖాకీదుస్తులుధరించిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేశాడు. ఇంకే ముంది ఫేమస్ అయిపోదామ నుకున్న అతగాడు పోలీసులు అరెస్టు చేయడంతో కటకటాలపాలయ్యా డు. వివరాల్లోకి వెళ్తే.. విజయ్ గుంద్రె ముంబైలోని ఘన్సోలీలో నివసిం చేవాడు. క్యాబ్ నడుపుతూ జీవనం సాగించేవాడు. కానీ, చుట్టుపక్కల వారితో పోలీస్ అని చెప్పుకునేవాడు. కాగా, ఒక రోజు పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. విజయ్ గుంద్రె పట్టబడ్డాడు. పోలీసులను కూడా టోకరా ఇచ్చి తప్పించుకుందాం అనుకున్నాడు. తాను కూడా డిపార్ట్‌మెంట్ అని కవర్ చేశాడు. అనుమానం వచ్చిన పోలీసులు ఆరా తీయాగా విషయం బయటపడింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న ముంబై పోలీసులు పలు సెక్షన్ల కింద అతనిపై కేసులు నమోదు చేశారు.



# ఏపీ కాంగ్రెస్ దారెటు..

విజయవాడ, : రాష్ట్ర విభజన చేసిన పాపానికి ఇప్పటికే రెండు రాష్ట్రాల్లో కాంగ్రెస్ ఫలితం అనుభవిస్తుంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో కాంగ్రెస్ పార్టీ సోదిలో లేకుండా పోయింది. పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న సమయంలో అసలు జాతీయ పార్టీ కాంగ్రెస్ అనేది ఒకటుందా? అన్న సందేహం కలగక మానదు. ఒకవైపు అధికార వైసీపీ, విపక్ష టీడీపీతో పాటు బీజేపీ, జనసేన కూటములు ఎన్నికల వేళ దూకుడుగా ఉన్నాయి. కానీ కాంగ్రెస్ పార్టీ మాత్రం ఆ దిశగా ఎటువంటి ప్రయత్నాలు చేయకపోవడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.పదేళ్ల పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి గ్రామీణ ప్రాంతాల్లో మంచి పట్టుంది. హస్తం గుర్తును ఇప్పటికీ ప్రజలు మరిచిపోరు. సింబల్ మూలంగానే అనేక సార్లు అనేక ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధించింది. అయితే పంచాయతీ ఎన్నికలు కావడం, పార్టీ రహితంగా ఎన్నికలు జరుగుతుండటంతో కాంగ్రెస్ పార్టీ తమ అభ్యర్థులను బరిలోకి దింపే సాహసాన్ని చేయలేకపోయింది. దీనికి అభ్యర్థుల కొరతే కారణమని చెప్పకతప్పదు.పదమూడు జిల్లాల్లో ఎక్కడా కూడా కాంగ్రెస్ ఊసే లేకపోవడం విశేషం. పార్టీ రహితంగా జరిగే ఎన్నికలయినా మద్దతు దారులు కూడా కాంగ్రెస్ కు లభించలేదు. కాంగ్రెస్ నేతలు సయితం పంచాయతీ ఎన్నికలను లైట్ గానే తీసుకున్నారు. ఈ ఎన్నికలను కొంత మేర ఉపయోగించుకుంటే



కాంగ్రెస్ ను గ్రామీణ ప్రాంతాల్లో కొంత బలోపేతం చేయగలిగే ఛాన్స్ చిక్కేదంటున్నారు. కానీ ఎంత ప్రయత్నించినా కాంగ్రెస్ వైపు చూసే వారే కరువయ్యారు. నేతలు సయితం ఎన్నికల వేళ ఇళ్లకే పరిమితమయ్యారు.త్వరలో జరగనున్న తిరుపతి ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ కనీస పోటీ ఇచ్చే అవకాశం లేదు. అయితే ఇక్కడ అభ్యర్థిగా చింతా మోహన్ ను ప్రకటించి బరిలోకి దిగనుంది. చింతా మోహన్ గతంలో రెండు సార్లు ఎంపీగా ఉండటం తమకు కలసి వచ్చే అంశంగా కాంగ్రెస్ భావిస్తుంది. అయినా ఇక్కడ అభ్యర్థి అయితే సులువుగా దొరికాడు కాని ఓట్లు మాత్రం వచ్చే అవకాశం లేదంటున్నారు. మొత్తం మీద కాంగ్రెస్ ఆంధ్రప్రదేశ్ లో ఇక కోలుకునే అవకాశాలు మాత్రం దుర్భిణీ వేసి చూసినా కన్పించడం లేదు.

# అచ్చెన్నకు కలిసిస్తోందా...



శ్రీకాకుళం, : ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ అచ్చెన్నాయుడు పలు మార్లు అరెస్ట్ అవుతున్నారు. అయిన ప్రతీ సారి ఆయన గొంతు ఇంకా పెరుగుతోంది. మరో వైపు అచ్చెన్నాయుడు టెక్కలి నుంచి ఇప్పటికి రెండు సార్లు గెలిచారు. మళ్ళీ మళ్లీ గెలుస్తాను అని చాలెంజ్ చేస్తున్నారు. అంతే కాదు హోం మంత్రినే అవుతాను అని కూడా చెబుతున్నారు. మరి అచ్చెన్నాయుడు ధైర్యం ఏంటి, ఆయనకు ఉన్న ధీమా ఏంటి అంటే వైసీపీలోని త్రిమూర్తులే అని శ్రీకాకుళం జిల్లాలో గట్టిగా వినిపిస్తున్న మాట. అచ్చెన్నాయుడు తన గెలుపు కోసం పలవరించనక్కరలేదు. పక్క పార్టీ వారే తాపీగా హ్యాపీగా ఆ పని చేసి పెడతారు.తాను నిమ్మాడకు వెళ్ళి మరీ అక్కడ వైసీపీ సర్పంచ్ అభ్యర్థి అప్పన్నను ఓదారుస్తాను అని వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి చెప్పారు. కానీ జరిగింది వేరు. ఆయన శ్రీకాకుళం దాటి వెళ్లలేకపోయారు. దానికి కారణం టీడీపీ నిరసనలు కాదు, సొంత పార్టీ వారి మధ్య నెలకొన్న వర్గ పోరు. ఈ వర్గ పోరు కారణంగానే ఆయన నిమ్మాడకు ఆమడ దూరంగా ఉండిపోయారు. మరి ఎవరి మధ్య పోరు అంటే శ్రీకాకుళం జిల్లా వైసీపీ ప్రెసిడెంట్, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, కాళింగ కార్పొరేషన్ ప్రెసిడెంట్ పేరాడ తిలక్, టెక్కలి వైసీపీ ఇంచార్జి దువ్వాడ శ్రీనివాస్ ల మధ్యనే.ఈ ముగ్గురి మధ్య ఏకాభిప్రాయం లేదు. దాంతో విజయసాయి నిమ్మాడ వెళ్తే ఎక్కడ దువ్వాడకు పేరు వస్తుందో అని మిగిలిన వారు అడ్డుకున్నారట.ఇక 2019 ఎన్నికల వేళ టెక్కలి నుంచి వైసీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన పేరాడ తిలక్ ని యాంటీగా కిల్లి కృపారాణి, దువ్వాడ శ్రీనివాస్ కలసి రాజకీయం చేస్తే ఆ పోరులో టీడీపీ నుంచి అచ్చెన్నాయుడు గెలిచారు. ఇక ఇపుడు టెక్కలి ఇంచార్జి పదవి దువ్వాడకు దక్కింది. దాంతో కిల్లి, తిలక్ ఒక్కటై ఆయనకు ఎదురు నిలుస్తున్నారని పార్టీలోనే వినిపిస్తున్న మాట. ఇక పంచాయతీ ఎన్నికల వేళ కూడా వీరి మధ్య సఖ్యత లేకుండా పోయిందని అంటున్నారు. ఈ ముగ్గురూ కలస్తే వైసీపీకి అజేయమైన బలమే. కానీ అసలు కలవరు, దాంతో టీడీపీ గెలుపునకు రాచబాట వేస్తున్నారు అంటున్నారు.ఇదిలా ఉంటే ఉప ముఖ్యమంత్రిగా ఉన్న ధర్మాన క్రిష్ణ దాస్ కానీ మరో మంత్రి సీదరి అప్పలరాజు కానీ టెక్కలి వివాదంలో అసలు తలదూర్చడంలేదు. తమకు సంబంధం లేదన్నట్లుగా సైలెంట్ గా ఉంటున్నారు. ఇక దువ్వాడ శ్రీనివాస్ ఏకంగా అచ్చెన్నాయుడిని టార్గెట్ చేయడం తో ఆయనకు మద్దతు ఇస్తే ఎక్కడ పెద్ద నాయకుడు అయిపోతారో అన్న ఆందోళన మిగిలిన నేతలలో కనిపిస్తోంది అంటున్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఇలా గ్రూపులుగా విడిపోయిన నేతల తీరు చూసి విజయసాయిరెడ్డి అయినా, మరొకరు అయినా ఏమీ చేయలేని స్థితి. మరి ఇలా వైసీపీలో ఫైటింగ్ టాప్ లెవెల్ లో సాగితే అచ్చెన్నాయుడు ఎన్ని సార్లు అరెస్ట్ అయినా మీసం మెలి వేస్తాడనే ఫ్యాన్ పార్టీ నేతలు విశ్లేషిస్తున్నారు

# చౌదరి గారు మాటలు చేటేనా

విజయవాడ, : బీజేపీకి అసలే పరపతి తక్కువ హడావుడి ఎక్కువ అన్నట్లు ఏపీలో సీన్ ఉంటుంది. దానికి తోడు అన్నట్లుగా ఆ పార్టీలో చేరిన సుజనా చౌదరి వంటి వారు తమదైన వాచాలత్వంతో పూర్తిగా పరువు తీస్తున్నారు అంటున్నారు. ప్రత్యేక హోదా ఇవ్వలేదని, ఏపీకి ఏ ఒక్క సాయం చేయలేదని బీజేపీ మీద ఇప్పటికే ఏపీ జనాలకు పీక బండెడు కోపం ఉంది. ఇపుడు హఠాత్తుగా విశాఖ స్టీల్ ప్లాంట్ ని ప్రైవేటీకరించడానికి కేంద్రం సిద్ధపడిపోయింది. దాని మీద ఒక్కసారిగా విశాఖ జనం మండిపోతున్నారు. ఇటువంటి కీలకమైన వేళ ఏపీ బీజేపీ నేతలు ఎలా మాట్లాడాలి.

విశాఖ స్టీల్ ప్లాంట్ ని ప్రైవేట్ పరం చేస్తే ఏం పోయింది అది విశాఖలోనే ఉంటుందిగా ఎవరూ ఎక్కడికీ ఎత్తుకుపోరుగా అంటూ సుజనా చౌదరి చేస్తున్న కామెంట్స్ దారుణంగానే ఉన్నాయి. విశాఖ ఉక్కు అంటే మరీ అంత చులకన చేస్తూ ఆయన మాట్లాడిన తీరుకు విశాఖ వాసులు రగిలిపోతున్నారు. జాతీయ సంపదను ఇలా విదేశీ కంపెనీ అధిపతుల పరం చేసి విశాఖలోనేఉంటుందిగా, అది మీదే అనుకోమని సుజనా చౌదరి సుద్దులు చెప్పడాన్ని జనం ఏ రకంగానూ సహించరు అంటున్నారు. ఇది పుండు మీద కారం చల్లినట్లుగానే ఉందని చెబుతున్నారు.సుజనా చౌదరి బీజేపీకి చెందిన ఎంపీగా ఉన్నారు. ఆయన ఈ సమయంలో ఏదైనా చెప్పదలిస్తే సహనంతో అర్థవంతంగా మాట్లాడాలి. అంతే కానీ ప్రైవేట్ రంగంలో స్టీల్ ప్లాంట్ ఉంటే తప్పేంటి అంటూ ఎదురు ప్రశ్నలతో మాట్లాడడం ద్వారా బీజేపీ మీద కూడా జనాలకు ఉన్న కోపాన్ని రెట్టింపు చేసేలా ఉన్నారని కామెంట్స్ పడుతున్నాయి. తాను ఉన్న పార్టీకి చెరుపు చేసేలా సుజనా చౌదరి మాట్లాడడం వెనక రాజకీయ వ్యూహాలు ఏమైనా ఉన్నాయా అన్న చర్చ కూడా సాగుతోంది.

ఇన్నాళ్ళూ మౌనంగా ఉండి ఇపుడు సరైన సమయంలో ఆయన బీజేపీ తరఫున వకాల్తా పుచ్చుకోవడం అంటే కచ్చితంగా అది కమలానికి శల్య సారధ్యమేనని అంటున్నారు.విశాఖ స్టీల్ ప్లాంట్ ని జనాలు తమ గుండె కాయగా చూస్తున్నారు. విశాఖకు ఒక గర్వకారణంగా చూస్తున్నారు. ఈ ప్లాంట్ వల్ల ప్రత్యక్షంగా యాభై వేల మంది పరోక్షంగా అయిదు లక్షల మంది జనాభా వరకూ అనేక రకాలుగా లబ్ది పొందుతున్నారు. రేపటి రోజున దీన్ని ప్రైవేట్ పరం చేస్తే వీరంతా ఏమవుతారు అన్న ప్రశ్న కూడా ఉంది. మరో వైపు విశాఖ స్టీల్ ప్లాంట్ తమ సొత్తు అని జనం భావిస్తారు. అదే ప్రైవేట్ పరం అయితే పరాయిది అయిందని తెగ బాధపడతారు. మరి ఈ మాత్రం సెంటిమెంట్ ని కూడా అర్ధం చేసుకోకుండా సుజనా చౌదరి ప్లాంట్ ప్రైవేట్ పరం అయి తీరుతుంది. ఎవరు అరచి గీ పెట్టినా అది ఆగదంటూ రెచ్చగొట్టుడు కామెంట్స్ చేయడాన్ని విశాఖ వాసులు తప్పుపడుతున్నారు. మొత్తానికి సుజనా చౌదరి తన అనవసర వాచాలత్వంతో బీజేపీ కొంపనే ముంచాడని అంటున్నారు.

# బీజేపీ ఆఫీసు వాస్తు మార్పుతో సీన్ మారుతుందా

హైదరాబాద్, : వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణలో బలపడాలన్నది బీజేపీ వ్యూహం. బండి సంజయ్ సారథి అయిన తర్వాత కొంత స్పీడ్ పెరిగింది కూడా. దుబ్బాక,గ్రేటర్ ఎన్నికల ఫలితాలు కమలనాథులకు మంచి ఊపు కూడా తెచ్చాయి. అయితే వీటికంటే ముందు జరిగిన అసెంబ్లీ ముందస్తు ఎన్నికల్లో మాత్రం బీజేపీ సత్తా చాటలేకపోయింది. ఒక్క ఎమ్మెల్యేనే గెలిచారు. అప్పటి వరకు ఉన్న సిట్టింగ్ స్థానాలను సైతం కోల్పోయింది. దీంతో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర ఆఫీసులో వాస్తు దోషాలు ఉన్నాయని గ్రహించారట నాయకులు. నైరుతి నుంచి మొదలు పెట్టి ఈశాన్యం వరకు పార్టీ ఆఫీస్‌లో మార్పులకు ప్రాధాన్యం ఇస్తున్నారట. దీంతో కమలం పార్టీ స్పీడ్ ప్రత్యర్థులను పరుగులు పెట్టిస్తుందట?అసలే బీజేపీ.. వాస్తు పట్టింపులు.. పూజలు ఎక్కువగానే ఉంటాయి. వాస్తు ప్రకారమే నాడు పార్టీ ఆఫీస్ కట్టి ఉంటారు. కానీ.. ఏదో తేడా కొడుతుందని భావించిన అప్పటి బీజేపీ రాష్ట్ర చీఫ్ లక్ష్మణ్.. కొన్ని మార్పులు చేపట్టారు. బాత్రూమ్‌లు ఉండకూడని చోట ఉన్నాయని వాటిని కూలగొట్టి ప్లేస్ మార్చారు. ఇది 2018 అసెంబ్లీ ఎన్నికల తర్వాత జరిగిన మార్పులు. అంతే 2019లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో నాలుగు లోక్‌సభ సీట్లు బీజేపీకి వచ్చాయి. ఇదంతా పార్టీ ఆఫీస్‌లో జరిగిన వాస్తు మార్పుల వల్లే అని విశ్వసించారట నాయకులు. అంతే.. వాస్తు గురించి తెలిసిన వారిని పిలిచి ఆఫీస్ మొత్తం చూపించారట. వారిలో కొందరు సూచించిన విధంగా మెయిన్ డోర్ నుంచి కాకుండా సైడ్ డోర్ నుంచి ఆఫీస్‌లోకి వెళ్లారు లక్ష్మణ్. ఆ ఎఫెక్టో ఏమో రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి వైదొలిగిన తర్వాత ఏకంగా బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడయ్యారని చర్చ మొదలైంది.ఇంత వరకు బాగానే ఉన్నా.. బండి సంజయ్ చీఫ్‌గా వచ్చిన తర్వాత ఈ వాస్తు మార్పులు ఇంకాస్త ముందుకు తీసుకెళ్లారు. అధ్యక్షుని ఛాంబర్‌లో గతంలో లక్ష్మణ్ కూర్చున్న ఫేసింగ్ కాకుండా కాస్త టర్న్ ఇచ్చుకున్నారట. ఆఫీస్ సెల్లార్‌లోకి వెళ్లేదారిని మూసేశారు. అక్కడ గోడ కట్టేశారు. ఈశాన్యంలో ఖాళీ ఉండాలని బీజేపీ కార్యాలయం గోడను జరుపుతున్నారు. ఆ పని దాదాపుగా పూర్తి కావొచ్చింది. ఇక బీజేపీ ఆఫీస్ మెయిన్ డోర్‌ను దాదాపుగా క్లోజ్ చేసేశారు. ఏదైనా అర్జెంట్ ఉంటేనో.. ఎక్కువ మంది కార్యకర్తలు వస్తేనో ఆ తలుపులు తీస్తున్నారు.సంజయ్ చేపట్టిన ఈ మార్పులు తర్వాత దుబ్బాకలో బీజేపీ బోణీ కొట్టింది. గ్రేటర్ లో బలం పెరిగింది. త్వరలో ఎమ్మెల్సీ.. మరికొన్ని మున్సిపాలిటీ ఎన్నికలతోపాటు నాగార్జునసాగర్ బై ఎలక్షన్ సైతం రాబోతోంది. వీటిల్లోనూ ఆశించిన ఫలితాలే వస్తాయన్నది కమలనాథుల నమ్మకం. అందుకు తగ్గట్టుగానే పార్టీ ఆఫీసులో మరిన్ని వాస్తు మార్పులు చేపట్టొచ్చన్నది నేతలు చెబుతున్న మాట. ఇక్కడ గోడలు కూలగొట్టి కొత్త గోడలు జరిపి కడితే.. తలుపులు మూసేస్తే.. ఎన్నికలు జరిగేచోట జనాల నాడి పట్టేయొచ్చని గట్టిగాన నమ్ముతున్నారట కమలనాథులు.వాస్తు విషయంలో ఎవరి నమ్మకాలు వారివి. ఇందులో బీజేపీ నేతలు ఇంకా ఎక్కువగానే ఆలోచిస్తారు. అది ఆ పార్టీ వాళ్ల ఇష్టం. కాకపోతే.. ఎన్నికల్లో గెలవాలంటే ఓటర్లను ఆకర్షించాలి. ప్రజల అటెన్షన్ తీసుకొచ్చేలా కార్యక్రమాలు చేపట్టాలి. దానికితోడు అదృష్టం కూడా కలిసి రావాలి. కష్టే ఫలి అన్నారు పెద్దలు. ఇప్పుడు వాస్తు మార్పులు చేశాం కదా అని సైలెంట్ అయితే మాత్రం మొదటికే మోసం వస్తుందని కొందరు పార్టీ నాయకులు చెవులు కొరుక్కుంటున్నారట.

# వ్యాక్సినేషన్ వేగం పెంచాలని ప్రజల డిమాండ్




కరీంనగర్ :జిల్లాలో అర్హులైన వారిలో సగం మందికి మొదటి డోస్, 22.8 శాతం మందికి రెండు డోసులు వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తయింది. కరోనా మూడో వేవ్ ముప్పు పొంచి ఉన్నదని నిపుణులు చెబుతున్నందున దానిని అడ్డుకునేందుకు ఉపయోగపడే వ్యాక్సినేషన్ కార్యక్రమంలో మరింత వేగం పెంచాల్సిన అవసరముందని భావిస్తున్నారు. అవసరమైన మేరకు వ్యా క్సిన్ అందుబాటులో లేక పోవడం కారణంగానే వ్యాక్సినేషన్‌లో జాప్యం జరుగుతోందని తెలుస్తున్నది. జిల్లాకు రోజు విడిచి రోజు ఐదు వేల వ్యాక్సిన్ డోసులు మాత్రమే సరఫరా అవుతోంది. దీంతో జిల్లా కేంద్రంలో మూడు కేంద్రాల్లోనే వ్యాక్సిన్ ఇవ్వాల్సిన పరిస్థితి నెలకొన్నది. ఆగస్టు ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 1,70,178 డోసుల వ్యాక్సిన్ మాత్రమే ఇచ్చారు. రోజుకు పదివేల మందికి వ్యాక్సిన్ ఇవ్వడానికి జిల్లాలో అవకాశాలున్నా ఏరోజుకారోజు చాలీచాలనీ వ్యాక్సిన్ సరఫరా అవుతుండడంతో వ్యాక్సినేషన్ నత్తనడకన సాగుతోంది. డబ్బులు చెల్లించైనా ప్రైవేట్‌లో వ్యాక్సిన్ తీసుకోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నా అక్కడా అందుబాటులో లేదు. దీంతో ప్రజలు ప్రభుత్వ వ్యాక్సిన్ కేంద్రాలపైనే ఆధారపడాల్సి వస్తున్నది. జిల్లాలో ఈనెల 3వరకు 4,34,802 మందికి మొదటి డోసు, 1,81,480 మందికి రెండు డోసుల వ్యాక్సిన్ ఇచ్చారు. - జిల్లాలో 18 ఏళ్ల పైవారికి 7,93,859 మందికి రెండు డోసుల చొప్పున 15,87,178 డోసుల వ్యాక్సిన్ ఇవ్వాల్సి ఉన్నది. ఇప్పటి వరకు జిల్లావ్యాప్తంగా 6,16,282 డోసుల వ్యాక్సిన్ మాత్రమే ఇచ్చారు. - జిల్లాలో వ్యాక్సిన్ ఇవ్వడానికి అర్హులైన వారిలో 54.77 శాతం మందికి మొదటి డోసు, 22.86 శాతం మందికి రెండు డోసుల వ్యాక్సిన్ లభించింది. - జూలై మాసాంతానికి మొదటి డోసు వ్యాక్సిన్ పొందిన వారు 3,29,152 మంది కాగా 33 రోజుల తర్వాత ఆ సంఖ్య 4,34,802కు పెరిగింది. అంటే ఈ మధ్య 1,05,650 మందికి మాత్రమే మొదటి డోసు వ్యాక్సిన్ ఇవ్వగలిగారు. - జూలై 31 వరకు రెండో డోసు పొందినవారి సంఖ్య 1,06,952 కాగా ఇప్పుడది 1,81,480కి చేరింది. 64,528 మందికి మాత్రమే ఈ 33 రోజుల్లో రెండో డోసు లభించింది. వ్యాక్సిన్ అందుబాటులో లేక పోవడమే ఇందుకు ప్రధాన కారణంగా పేర్కొంటున్నారు.

# గూగుల్ ఈ సర్వీస్‌ను ఆపేస్తోంది!

## మీ డేటాను ఇలా బ్యాకప్ చేసుకోండి!

న్యూఢిల్లీ: ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు వాడుతున్న కస్టమర్లకు గూగుల్ ఈ మధ్య కొన్ని రిమైండర్లు పంపిస్తోంది. తమ ప్రముఖ సర్వీసు ప్లే మ్యూజిక్‌ను ఈ నెల 24న డిలీట్ చేయబోతున్నామన్నది ఆ రిమైండర్ సారాంశం. అందులో భాగంగా గూగుల్ ప్లే మ్యూజిక్‌లో ఉన్న లైబ్రరీ, డేటా మొత్తాన్ని డిలీట్ చేస్తామని గూగుల్ తెలిపింది.

ఒకసారి ఈ డేటా డిలీట్ చేసిన తర్వాత మళ్లీ రికవర్ చేయడానికి వీలుపడదని కూడా తేల్చి చెప్పింది. ఇప్పటికే యూజర్లను ప్లే మ్యూజిక్ నుంచి యూట్యూబ్ మ్యూజిక్‌కు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు కూడా గూగుల్ వెల్లడించింది. ఒకవేళ మీరు ఏమైనా మార్పులు చేసి ఉంటే.. ఇప్పటికీ వాటిని ట్రాన్స్‌ఫర్ చేసుకోవడానికి మీకు అవకాశం ఉంది. ఒకవేళ మీరు గూగుల్ ప్లే మ్యాజిక్ లైబ్రరీ, డేటాను డౌన్‌లోడ్




చేసుకోవాలనుకుంటే ఫిబ్రవరి 24లోపు గూగుల్ టేక్ అవుట్ నుంచి చేసుకోవచ్చని కూడా గూగుల్ చెప్పింది. గతేడాది డిసెంబర్‌లోనే గూగుల్ ప్లే మ్యూజిక్ ఆపరేషన్లను నిలిపేసింది. దానిని యూట్యూబ్ మ్యూజిక్‌గా మార్చింది.

# కొరవడిన పర్యవేక్షణ.. ఎండిపోయిన మొక్కలు

నేరేడుచర్ల: పారిశుధ్యం, పచ్చదనం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పల్లెప్రగతి కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే, కొన్ని పంచాయతీల్లో ప్రకృతివనాలపై పర్యవేక్షణ లోపించింది. తూతూ మంత్రంగా మొక్కలు నాటి సంరక్షణ గాలికొదిలేస్తున్నారు. మరోవైపు పారిశుధ్యంపై పట్టింపు కొరవడి వీధుల్లో చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. నేరేడుచర్ల మండలం పుల్గంబండ తండా పంచాయతీలో పల్లె ప్రగతి పనుల్లో నిర్లక్ష్యం కన్పిస్తున్నది. మొక్కలు నాటకుండానే వదిలేయడంతో ఎండిపోతున్నాయి. సెగ్రిగేషన్ షెడ్డు, వైకుంఠధామం పనులు నాసిరకంగా చేపడుతున్నారు. ఉపయోగంలోకి రాకముందే గోడలకు పగుళ్లు వచ్చాయి. అధికారులకు తెలిసీ పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. మండలంలోని జగన్నాతండ, ముత్యాలమ్మ కుంట, రామకృష్ణ తండా, మూసీఒడ్డు తండాలను కలుపుకొని పుల్గంబండ తండా గ్రామ పంచాయతీ ఏర్పాటైంది. మొత్తం 8వార్డుల్లో 233గృహాలు ఉండగా 1006మంది నివసిస్తున్నారు. పల్లె ప్రగతి కార్యక్రమంలో అడుగు ముందుకు పడకపోవడంతో ఈ పంచాయతీ మండలంలో చివరిస్థానంలో నిలిచింది. వైకుంఠధామం, సెగ్రిగేషన్ షెడ్డు పనులు నాసిరకంగా ఉన్నాయి. రూ.12.50లక్షలతో నిర్మించే వైకుంఠధామం పిల్లర్లు కంకర తేలి కన్పిస్తున్నాయి. సెగ్రిగేషన్ షెడ్డు గోడలకు పగుళ్లు ఏర్పడ్డాయి. డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను వేరుచేయడం లేదు. నర్సరీలో మొక్కలు



పెంచే ప్యాకెట్లలో నాసిరకం మట్టి నింపడం గమనార్హం. ప్రకృతి వనం కోసం ఎంపిక చేసిన భూమి మొత్తం రాళ్లతో నిండి ఉంది. వాటిలో ఎంత ఖర్చు పెట్టి పనులు చేసినా ఫలితం లేదు. ట్యాంకర్ల ద్వారా నీళ్లు పోయాలంటే చాలా ఇబ్బంది ఎదురవుతుంది. ఉచితంగా కరెంట్ ఇస్తే బోర్లను ఏర్పాటు చేసి వనాలను తీర్చిదిద్దుతాం. స్థలం ఎంపికలో జాప్యం కారణంగా వైకుంఠ ధామం పనులు ఆలస్యమయ్యాయి. గ్రామ సమీపంలో భూ సమస్య తలెత్తడంతో ఊరికి దూరంగా ముత్యాలమ్మ కుంట సమీపంలో పనులను ప్రారంభించాం. త్వరలోనే పనులు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటా. ప్రకృతి వనం నేల మొత్తం రాళ్లతో నిండిపోయింది.

# వైజ్ఞానిక ప్రదర్శనకు రిజిస్ట్రేషన్లు ప్రారంభం



హైదరాబాద్: జవహార్‌లాల్ నెహ్రూ వైజ్ఞానిక, గణిత, పర్యావరణ జిల్లా స్థాయి ప్రదర్శన (2020-21)లో పాల్గొనేందుకు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు ఈ నెల 26వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని హైదరాబాద్ డీఈవో రోహిణి తెలిపారు. ఆరు నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొనేలా ప్రధానోపాధ్యాయు లు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రదర్శనలో మొదటి బహుమతి పొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారని వివరించారు. వివరాలకు జిల్లా సైన్స్ అధికారి ధర్మేంద ర్‌రావును 7799171277, 8309468801 సంప్రదించాలన్నారు.

# పారదర్శకంగా మిర్చి క్రయవిక్రయాలు

గుంటూరు : మిర్చి క్రయవిక్రయాలు పూర్తి పారదర్శకంగా జరిగేలా కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటామని మిర్చియార్డు పర్సన్ ఇన్‌ఛార్జి రామాంజనేయులు స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన మిర్చియార్డులో పర్యటించారు. మిర్చి క్రయవిక్రయాలును పరిశీలించారు. ఈ-నామ్ ద్వారా లావాదేవీలు జరుగుతున్నదీ.. లేనిదీ ఆరా తీశారు.

కొనుగోళ్లు, అమ్మకాల్లో ఎటువంటి అక్రమాలు, అవకతవకలకు ఆస్కారం ఇవ్వొద్దన్నారు. గతంలో కూడా ఎన్నికల సమయంలో భారీ ఎత్తున అక్రమాలు జరిగాయని, ఈసారి ఆవిధంగా జరగకుండా చర్యలు తీసుకోవాలని, సూపర్‌వైజర్లు విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు.

నిత్యం లక్షకు పైగా బస్తాలు వస్తున్నందున.. అవసరమైతే పత్తి విభాగంలో ఉన్న సూపర్‌వైజర్లను మిర్చి విభాగంలో విధులు అప్పగించాలన్నారు. రైతులు అధికంగా యార్డుకు వస్తున్నందున సౌకర్యాల్లో రాజీ పడవద్దన్నారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, మంచినీటి వసతి కల్పించాలని, రోజూ యార్డులో రహదారులను ఊడ్చి శుభ్రం చేయాల్సిందేనని చెప్పారు. శని, ఆదివారాలు నీళ్లు కొట్టాలని, మరుగుదొడ్ల వద్ద రైతుల నుంచి డబ్బు వసూలు చేసే వారిపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. యార్డులో ప్రయోగశాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. రంగు, నాణ్యత పరీక్షించేందుకు కొన్ని పరికరాలు ఏర్పాటు చేయాల్సి ఉందని యార్డు కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి ఆయన దృష్టికి తీసుకువచ్చారు.

# ఈ సారి ఎదురీతేనా



న్యూఢిల్లీ,: సెంబ్లీ ఎన్నికల వేళ మోదీ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఆ పార్టీకి ఇబ్బంది కరంగా మారనున్నాయి. గత ఏడేళ్ళుగా అధికారంలో ఉన్న బీజేపీకి ఇటు పల్లెలు, అటు పట్టణాల్లో సయితం పార్టీ పట్ల వ్యతిరేకత కన్పిస్తుందంటున్నారు. ఈ ఏడాది తమిళనాడు, అసోం, కేరళ, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ ఎన్నికలు జరగనున్నాయి. ఆ తర్వాత ఉత్తర్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, గోవా తదితర రాష్ట్రాల ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ విజయానికి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలే అడ్డంకిగా మారే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ప్రధానంగా పట్టణ ప్రజల్లో మోదీ ప్రభుత్వంపై వ్యతిరేకత స్పష్టంగా కన్పిస్తుంది. పెట్రోలు, డీజిల్ ధరలను విపరీతంగా పెంచడం, నిత్యావసర వస్తువుల ధరలు నింగినంటడం వంటి కారణాలతో పట్టణ ప్రజలు మోదీ ప్రభుత్వంపై అసహనంతో పాటు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నడూ ఇలా పెట్రో ధరలు పెంచలేదన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు.ఈ ప్రభావం రాజస్థాన్ మున్సిపల్ ఎన్నికల్లో స్పష్టంగా కన్పించింది. అక్కడ మెజారిటీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం విశేషం. మున్సిపల్, కార్పొరేషన్ ప్రాంతాల్లో బీజేపీ గెలుపొందలేకపోవడానికి ప్రధాన కారణం పెట్రో ఉత్పత్తుల ధరలు పెరగడమే కారణమన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. బీజేపీ నేతలు సయితం ఇదే విషయాన్ని పార్టీ అధిష్టానానికి నివేదికలు అందించినట్లు తెలిసింది. ఇదే పరిస్థితి దేశమంతా ఉండే అవకాశం ఉందంటున్నారు.ఇక రైతు సమస్యలతో గ్రామీణ భారతం సయితం మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉండే అవకాశం కన్పిస్తుంది. కేవలం మాటలు, సూక్తులు చెప్పి ఆచరణలో పేద, మధ్య తరగతి ప్రజలను పట్టించుకోని మోదీ ప్రభుత్వం పట్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వ్యతిరేకత కన్పిస్తుండటం ఆపార్టీ భవిష?యత్ విజయాలపై ప్రభావం చూపుతుందంటున్నారు. ఈ వ్యతిరేకత మరింత పెరిగే అవకాశముందంటున్నారు. ఏడేళ్ల పాటు మోదీ ప్రజలను భ్రమల్లోనే ఉంచారని, ప్రజలకు చేసిందేమీ లేదన్న వ్యాఖ్యలు సర్వత్రా విన్పిస్తున్నాయి. దీనిని కాంగ్రెస్ పార్టీ క్యాష్ చేసుకోగలిగితే దానికి పూర్వ వైభవం దక్కే అవకాశాలున్నాయి.

# షూటర్లు తాము చంపిన అడవి పందుల మృతదేహాలతో ఫోటోలు దిగ కూడదు

హైదరాబాద్: షూటర్లు తమ చేతుల్లో రైఫిల్ తో చంపిన అడవి పందుల మృతదేహాలతో ఫోటోలు దిగుతున్నవిషయం తమ దృష్టికి వచిందని అటవీ శాఖ ఉన్నతాధికారుల తెలిపారు. అడవి పందుల కారణంగా పంట నష్టపోవద్దని, రైతులకు మంచి చేయాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వ అడవి పందులను చంపేందుకు అనుమతించామని, ఆదేశాలు అమలు అవుతున్నాయని అధికారులు తెలిపారు. కానీ తాము అడవి పందులను వేటాడినట్లుగా ఆస్కారమిచ్చేలా కొందరు షూటర్లు దిగిన ఫోటోలు చెడు ప్రచారానికి ఆస్కారం ఇస్తున్నాయి.

ఇటీవల వన్యప్రాణులు రక్షణ చట్టం, 1972 ప్రకారం గ్రామ పంచాయతీ సర్పంచ్ లను వన్యప్రాణి వార్డెన్గా నియమిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో చీఫ్ వైల్డ్లైఫ్ వార్డెన్ గ్రామ పంచాయతీ సర్పంచ్ లకు, పంటలను దెబ్బతీసే అడవి పందుల కాల్చివేతకు అనుమతి అప్పగించింది. దీనిలో భాగంగా కొన్ని ప్రాంతాలలో పంటలకు నష్టం కలిగించే అడవి పందుల కాల్చివేతకు అటవీ శాఖలో నమోదు చేసిన నిపుణులైన షూటర్లకు సర్పంచ్ లు అనుమతిని ఇచ్చారు. అయితే, కొన్ని చోట్ల నిబంధనల ఉల్లంఘన, ఇతర సంఘటనలు అటవీ శాఖ దృష్టికి వచ్చాయని అధికారులు తెలిపారు. దీంతో వన్య ప్రాణి ప్రేమికులు, పర్యావరణ వేత్తలు ఈ విషయంలో కలత చెందే ఆస్కారం ఉంది. చనిపోయిన అడవి పందులను ఫోటోలు, వీడియోలు తీయటం సమంజసం కాదని, వాటిని అగౌరవపరచటంగా అటవీ శాఖ భావిస్తోంది. చెడు సాంప్రదాయానికి దారి తీసేవిధంగా వ్యవహరించవద్దని షూటర్లను అటవీ శాఖ కోరింది. అడవి పందులు అటవీ వన్య ప్రాణి రక్షణ



చట్టం 1972 చేర్చబడిన జంతువులు.

వేటాడిన వన్య మృగాలు చట్టం 11 వ సెక్షన్ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వానికి చెందినవిగా చెప్పబడుతాయి. గ్రామ సర్పంచ్ అనుమతితో కాల్చేవేసిన జంతువులు వేట కిందకు రావు. అలాగే ప్రోత్సాహక వేటగా కూడా భావించకూడదు. వీటిని అతిక్రమించటం నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుంది. అడవి పందుల మృత దేహాలతో కూడా తగిన గౌరవంతో వ్యవహరించాలని, పంచనామా తర్వాత పూడ్చివేయాలని, వాటి శరీరంలో ఏ భాగాన్ని కూడా తొలగించవద్దని, తినేందుకు వాడకూడదని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు పీసీసీఎఫ్ ఆర్. శోభ వెల్లడించారు. ప్రతి అడవి, గృహ జంతువులు చనిపోయినా లేదా జీవించి ఉన్నవాటి పట్ల నైతికంగా వ్యవహరించాలని రాజ్యంగంలోని ఆర్టికల్ 51 ఏ (జీ)లో పొందుపర్చిన విషయాన్ని అటవీ శాఖ గుర్తుచేసింది.

# సోదిలో లేకుండా పోయిన రామచంద్రా

కడప,: ఆయనది నాలుగు దశాబ్దాల రాజకీయ అనుభవం? ఎన్నో పదవులు అనుభవించారు.. పలు పార్టీలు మారారు.. రెడ్ల హవా ఉన్న కడప జిల్లాలో బలిజ వర్గానికి చెందిన నేతగా ఉండి కూడా రాజ్యసభకు ఎంపికయ్యారు. అక్కడ ఓ వెలుగు వెలిగారు. అలాంటి నేత రాజకీయంగా రాంగ్ స్టెప్ వేసినా డక్కా మొక్కీలు తిని మరీ ఎమ్మెల్సీ అయ్యారు. ఇక ఇప్పుడు అధికార వైఎస్సార్సీపీలో ఉన్నా ఆయన ఎక్కడున్నారో కూడా ఎవ్వరికి తెలియడం లేదు. ఆ నేత ఎవరో కాదు సీ రామచంద్రయ్య. తెలుగుదేశం పార్టీలో ఎన్టీఆర్ టైం నుంచే ఆయనకు మంచి గుర్తింపు ఉండేది. ఆ తర్వాత ఆ పార్టీ నుంచి రాజ్యసభకు కూడా ఎంపికయ్యారు. నాడు వైఎస్. రాజశేఖర్ రెడ్డి ప్రతిపక్షంలో బలమైన నేతగా ఉన్నప్పుడు అదే కడప జిల్లా నుంచి బలజల్లో పట్టున్న రామచంద్రయ్యను చంద్రబాబు ఎంకరేజ్ చేశారు. 2004లో టీడీపీ ఓడిపోయాక రామచంద్రయ్య. చంద్రబాబును తీవ్రంగా విబేధించి సామాజిక వర్గాల పరంగా చిరంజీవి ప్రజారాజ్యంలో చేరి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఆయన సీమ నుంచి వచ్చి కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఖచ్చితంగా గెలుస్తానన్న ధీమాతో పోటీ చేసినా ఓడిపోయారు. ఆ తర్వాత ప్రజారాజ్యం కాంగ్రెస్లో విలీనం కావడంతో చిరంజీవి రికమెండేషన్తో ఎమ్మెల్సీ సొంతం చేసుకున్నారు. చిరంజీవీ కోటాలో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీ దక్కించుకున్న ఏకైక నేత రామచంద్రయ్యే. ఆ ఎమ్మెల్సీతో ఆరేళ్ల పాటు చట్టసభల్లో ఉన్నారు. ఆ పదవి అందరూ మర్చిపోయిన రామచంద్రయ్యకు పునర్జన్మ నిచ్చింది. టీడీపీ నుంచి బయటకు వచ్చాక రామచంద్రయ్య చంద్రబాబును, టీడీపీని తిట్టిన తిట్టు తిట్టకుండా తిడుతూనే ఉన్నారు. తర్వాత ఆయన ప్రజారాజ్యంలోకి వెళ్లినా అదే పాట పాడారు. ఆ తర్వాత కాంగ్రెస్ ఎమ్మెల్సీగా ఉన్నా మళ్లీ అదే పంథాలో వెళ్లారు. ఇక గత ఎన్నికలకు ముందే ఆయన వైసీపీ కండువా కప్పుకున్నారు. సీనియర్గా ఉన్న తన సేవలను పార్టీ కడప జిల్లాలో వాడుకుంటుందని రామచంద్రయ్య. ఆశించారు. అయితే కడప జిల్లా వైసీపీ రెడ్లు అందరూ తలపండిన వాళ్లే కావడంతో వాళ్లకు రామచంద్రయ్య అస్సలు గుర్తుకే రాలేదు.జగన్ పట్ల ఎంతో విధేయతతో ఉన్న రామచంద్రయ్య ఎన్నికల సమయంలో ప్రెస్మీట్లు చంద్రబాబుపై తీవ్రంగా విరుచుకుపడ్డారు. ఇప్పుడు పార్టీ అధికారంలో ఉన్నా అధిష్టానానికి, జగన్కు గుర్తు లేని చాలా మంది నేతల లిస్టులో ఆయన కూడా చేరిపోయారు. పైగా కడప జిల్లాలో ఏ పదవి కావాలన్నా ముందుగా ఓ సామాజిక వర్గం నేతలే లైన్లో ఉంటున్నారు. రామచంద్రయ్యకు ఇప్పుడు ఏ ఎమ్మెల్సీ అయినా రాకపోదా ? అన్న ఆశ ఉన్నా వైసీపీలో ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆయన్ను జగన్ గుర్తు పెట్టుకోవడం.. ఆయనకు పదవి రావడం రెండూ కష్టమే..! ఇక వయోః భారంతో కూడా ఆయన రాజకీయంగా యాక్టివ్గా ఉండలేకపోతున్నారు.

కాంగ్రెస్లో లక్కీగా ఎమ్మెల్సీతో పొలిటిక్గా రీ చార్జ్ అయిన రామచంద్రయ్య. రాజకీయం వైసీపీలో ఉంటుందా ? ఉండదా ? అన్న ప్రశ్నలకు కాలమే సమాధానం చెప్పాలి.

# పుదుచ్చేరిలో మారుతున్న పరిణామాలు

పాండిచ్చేరి, : పుదుచ్చేరి పాలిటిక్స్ హీటెక్కాయి. అదనపు గవర్నర్ గా తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందర రాజన్ బాధ్యతలు స్వీకరించారు. ఆ వెంటనే ఆమెను విపక్ష ఎమ్మెల్యేలు కలిసే అవకాశం ఉందని అంటున్నారు. అలానే ఆ వెంటనే బలపరీక్షకి ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యేలు కోరనున్నట్టు తెలుస్తోంది. అయితే త్వరలో ఎన్నికలు జరగబోయే పుదుచ్చేరికి కిరణ్ బేడీ ప్లేస్ లో పొలిటికల్ బ్యాక్ గ్రౌండ్ ఉన్న తమిళిసై అయితేనే కరెక్ట్ అనే ఆలోచనలో బీజేపీ పెద్దలు భావించి ఆమెను అక్కడికి పంపారని అంటున్నారు.అసలు మామూలుగా గవర్నర్ పోస్ట్ ఖాళీ అయితే ఆ పక్కన ఉన్న రాష్ట్ర గవర్నర్ కు ఇంచార్జ్ బాధ్యతలు అప్పగించడం ఇప్పటి దాకా ఆనవాయితీగా వస్తోంది.

కానీ పుదుచ్చేరి విషయంలో మాత్రం పక్కనే ఉన్న ఆంధ్ర ప్రదేశ్, తమిళ నాడు గవర్నర్ లను కాదని తెలంగాణ గవర్నర్ తమిళిసైకి అదనపు బాధ్యతలు అప్పగించడం వెనుక రాజకీయ కారణాలు ఉన్నాయని అంటున్నారు. తమిళిసైని పుదుచ్చేరికి పూర్తి స్థాయి లెఫ్ట్ నెంట్ గవర్నర్ గా చేసి.. తెలంగాణకు కిరణ్ బేడీని గవర్నర్ గా పంపే అవకాశాలు కూడా ఉన్నాయని అంటున్నారు. మ్మెల్యేల రాజీనామాలతో పుదుచ్చేరి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రమాదంలో పడింది. ఈ నేపథ్యంలో లెఫ్టినెంట్ గవర్నర్గా అదనపు బాధ్యతలు చేపట్టిన తెలంగాణ గవర్నర్ తమిళి సై సౌందరరాజన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వం బల పరీక్షకు సిద్ధం కావాలని తెలిపారు. దీనికోసం ఈనెల 22వ తేదీన పుదుచ్చేరి అసెంబ్లీ ప్రత్యేక సమావేశం కానుంది. ఇటీవల లెఫ్టినెంట్ గవర్నర్గా ఉన్న కిరణ్ బేడిని తొలగించి తమిళిసైకి అదనపు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం మెజార్టీ నిరూపించుకోవాలని లెఫ్టినెంట్ గవర్నర్ తమిళిసై సూచించారు. ప్రస్తుతం అసెంబ్లీలో రెండు పార్టీలకు ఎమ్మెల్యేలు సమానంగా ఉన్నారు. ముఖ్యమంత్రిగా ఉన్న నారాయణస్వామి భవితవ్యం సోమవారం తేలనుంది.

30 మంది సభ్యులున్న ఈ కేంద్ర పాలిత ప్రాంతంలో ప్రస్తుతం రాజకీయ పరిణామాలు రోజుకో మలుపు తిరుగుతున్నాయి. నలుగురి రాజీనామాలతో ప్రస్తుతం ఎమ్మెల్యేల సంఖ్య 28కి చేరింది. గతంలో మంత్రి నమశివ్వాయం, కాంగ్రెస్ ఎమ్మెల్యే తెపైంతన్తో మరో ఇద్దరు రాజీనామాలు చేశారు.

వీరందరి రాజీనామాతో ప్రస్తుతం ప్రభుత్వానికి 14 మంది (కాంగ్రెస్ 10, డీఎంకే 3, స్వతంత్రులు ఒకరు) ఎమ్మెల్యేల బలం ఉంది. దీనికి సమానంగా ప్రతిపక్షాల బలం 14 (ఎన్ఆర్ కాంగ్రెస్ 7, ఏఐఏడీఎంకే 4, నామినేటెడ్ 3) ఉంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగుతుందా లేదా అనేది ఉత్కంఠగా మారింది.

# చెక్కులిచ్చారా.. ఖాతా ఖాళీ!

## మీ ధ్రువపత్రాలతో మీకు లోన్ ఖాతాలో జమవగానే డబ్బు డ్రా కొత్త పంథాలో సైబర్ మోసాలు

హైదరాబాద్, : బ్యాంకు రుణం కావాలా? తక్కువ వడ్డీకే రుణం ఇప్పిస్తాం. ప్రాసెస్ కూడా చాలా సులభం.. అంటూ సైబర్ నేరగాళ్ళు ఫోన్కాల్స్ చేస్తున్నారు. కేవలం మీ వివరాలు, ధ్రువపత్రాలు ఇస్తే చాలు, ఎటువంటి ఎంక్వైరీలు లేకుండానే పర్సనల్ లోన్లు ఇప్పిస్తామని ఒకటికి రెండుసార్లు ఫోన్లు చేసి ఆఫర్లు ఇస్తున్నారు. అంతా అనుకూలంగానే ఉంది కదా.. రుణం తీసుకుంటే పాయే.. అని ఎవరైనా అనుకొని వీరి బుట్టలోపడ్డారో.. ఇక అసలు సినిమా మొదలు పెడతారు..ఇదో కొత్త తరహా సైబర్ మోసం.

మన వివరాలతో మనల్నే మోసగిస్తారు: ఏదైనా బ్యాంక్లో పర్సనల్ లోన్ తీసుకుని వాటిని చెల్లించి ఉంటే.. అలాంటి వారి డాటాను సైబర్నేరగాళ్లు హ్యాక్ చేస్తున్నారు. అందులో మన ఫోన్నంబర్లు, అడ్రస్ ఇతర వివరాలు తెలుసుకొని మిమ్మల్ని సంప్రదిస్తారు. తొలుత బ్యాంకు రుణం ఈజీగా పొందవచ్చని, మా ఏజెంట్ను పంపుతాం మీ ధ్రువపత్రాలతోపాటు రెండు బ్లాంక్ చెక్కులు ఇవ్వాలని



సూచిస్తున్నారు. పూర్తి వివరాలు, చెక్కులు తీసుకున్న తర్వాత.. అప్పటికే బ్యాంక్లోని కొందరితో మిలాఖత్ అవుతున్న ఈ నేరగాళ్లు మీ పేరిట బ్యాంకురుణం మంజూరుచేయిస్తున్నారు. రుణంమంజూరైమీ అకౌంట్లో డబ్బులు పడగానే.. అప్పటికే ఇచ్చిన బ్లాంక్ చెక్కులతో వెంటనే డబ్బు డ్రా చేసుకొని పరారవుతున్నారు. అధికారికంగా ఆ అప్పు మీ పేరిట ఉండడంతోఅది తీర్చక తప్పదు. ఈతరహా ఫిర్యాదులు పెరుగుతున్నాయని సైబర్ క్రైం పోలీసులు చెప్తున్నారు. ఎలాంటి వెరిఫికేషన్ లేకుండాఏబ్యాంకు పర్సనల్ లోన్లు ఇవ్వదని, అలాంటి రుణాల కాల్స్ వస్తే జాగ్రత్తతో ఉండాలని సూచిస్తున్నారు. గుడ్డిగా నమ్మితే.. తీరా మోసపోయాక ఆర్థికంగా తిప్పలు తప్పవని హెచ్చరిస్తున్నారు.

# అరుణ గ్రహంపై దిగిన అమెరికా రోవర్

కాలిఫోర్నియా: అరుణ గ్రహంపై నాసా ప్రయోగించిన పర్సీవరెన్స్ రోవర్ ఇవాళ సురక్షితంగా ల్యాండైంది. అమెరికా కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3.55 నిమిషాలకు పర్సీవరెన్స్ రోవర్ మార్స్పై దిగింది. సుమారు 203 రోజులు.. దాదాపు 300 మిలియన్ మైళ్ల ప్రయాణం తర్వాత రోవర్ సురక్షితంగా అంగారక గ్రహంపై అడుగుమోపింది. పర్సీవరెన్స్ రోవర్ ఇక మార్స్ గ్రహంపై జీవం ఆనవాళ్ల గురించి శోధించనున్నది. టచ్డౌన్ సక్సెస్ అయినట్లు కాలిఫోర్నియాలో ఉన్న జెట్ ప్రొపల్షన్ ల్యాబరేటరీ స్పష్టం చేసింది. గత ఏడాది జూలై 30వ తేదీన మార్స్ 2020 మిషన్ను ఆవిష్కరించారు. అంగారక గ్రహం నుంచి శ్యాంపిల్లను సేకరించి, ఆ శ్యాంపిల్లను భూమిపైకి తీసుకురానున్నారు. పర్సీవరెన్స్ రోవర్తో పాటు ఇన్జెన్యూటీ హెలికాప్టర్ను కూడా నాసా ప్రయోగించింది. అంగారక గ్రహంపై ఇన్జెన్యూటీ హెలికాప్టర్ కొన్ని చక్కర్లు కొట్టనున్నది. అరుణ గ్రహంపై మానవ ఆనవాళ్లు కనుగొనేందుకు ఈ మిషన్ తోడ్పడుతుందని నాసా శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

మార్స్ మధ్య ప్రాంతంలో ఉన్న జెజీరో క్రాటర్ వద్ద పర్సీవరెన్స్ రోవర్ దిగింది. ఈ రోవర్ సుమారు ఓ కారు సైజు ఉన్నట్లు



శాస్త్రవేత్తలు చెప్పారు. అది దాదాపు 2263 పౌండ్లు లేదా 1026 కిలోల బరువు ఉన్నది. జెజీరోలో ఉన్న పురాతన నది పరివాహక ప్రాంతాన్ని పర్సీవరెన్స్ శోధించనున్నారు. అక్కడ రాళ్లను, మట్టిని అది సేకరించనున్నది. ఆస్ట్రోబయోలజీ డేటాను సమీక్షించనున్నారు. సుమారు 3.5 బిలియన్ల ఏళ్ల క్రితం జెజీరో క్రాటర్ వద్ద నది ప్రవహించినట్లు శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. అత్యాధునిక రోబోటిక్ మెషిన్ రూపంలో పర్సీవరెన్స్ రోవర్ను తయారు చేశారు. మార్స్ గ్రహంపై కొత్త రోవర్ ఉన్నట్లు అమెరికన్ స్పేస్ ఏజెన్సీ ప ?రకటించింది. స్పేస్క్రాఫ్ట్ అద్భుతంగా ల్యాండ్ అయినట్లు మిషన్ డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ మ్యాట్ వాలెస్ తెలిపారు. కనీసం రెండేళ్ల పాటు ఆ రోవర్ మార్స్ గ్రహంపై గడపనున్నది. జెజీరో క్రాటర్లో నీరు ప్రవహించిన ఆధారాలు ఉన్నాయి కాబట్టి.. అక్కడ జీవం కూడా ఉండి ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# మాటాల్లేవ్... అన్నీ వినడేలా

హైదరాబాద్, : పాలిటిక్స్ అంటే మాటలు.. మాటలు అంటే పాలిటిక్స్. అది రెగ్యులరే. ఇప్పుడు సమ్ థింగ్ చేంజ్ అంటున్నారు.. వైఎస్ షర్మిల. తన పార్టీ రాబోతుంది అనే హాట్ టాపిక్ లో... చాలా మార్పులు చేర్పులు కనిపిస్తున్నయ్. డేట్స్ ఫిక్స్ కావడాలు.. పెద్దలు రావడాలు.. ఇలా చాలానే ఉన్నయ్. అయితే వీటిలో తను మెయిన్ గా అనుకున్నది మాత్రం.. వినడం అంట. బెస్ట్ లిజనర్లు మాత్రమే.. బెస్ట్ పీపుల్ అవుతారు అనే మాట ఉంది కదా. షర్మిల కూడా అదే ఫాలో కావాలి అని చూస్తున్నారట.

అవును నిజమే.. పార్టీ పెట్టాలి అంటే ఉత్తి ముచ్చట కాదు. అన్నీ తనకే తెలుసు అనుకోవడం ఎవరికీ కరెక్ట్ కాదు. అసలు నాకేం తెలీదు అని కూర్చుంటే చాలా తెలుసుకోవచ్చు. అందుకే.. షర్మిల కూడా.. చాలా విషయాలు తెలుసుకోవాలి అనుకుంటున్నారట. అందుకే.. పెద్దలతో మీటింగ్ లకు ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తున్నారట. సక్సెస్ అయిన వారి సలహాలు తీసుకుంటున్నారట. ఎవరు ఏం మాట్లాడతారు.. ఎవరెవరు ఎలాంటి సలహాలు ఇస్తారు అని చూస్తున్నారట. ముఖ్యంగా తన అనుచరులతో కూడా తను చెప్పే మాట ఒక్కటేనట... పెద్దల్ని కలుద్దాం.. సలహాలు తీసుకుందాం. ఎలా ముందుకెళ్లాలో నేర్చుకుందాం అని మూవ్ అవుతున్నారట షర్మిల.అవును నిజమే.. పార్టీ పెట్టేంత వరకు చాలా మంది మాటలు వినాలి. ఎందుకంటే పార్టీ ఒక దారీ డొంకా లేకుండా స్టార్ట్ చేసేసి.. దాన్ని నట్టేట్లో ముంచడం కరెక్ట్ కాదు కదా. అందుకే అన్నీ తెలుసుకుని రంగంలోకి దిగాలి అని ప్లాన్ చేస్తున్నారట షర్మిల. ఎలాగూ ఎన్నికలకి టైం ఉంది. గ్రేటర్ ఎన్నికలు కూడా అయిపోయాయి. ఇక చిన్న చిన్న ఎన్నికలను పెద్దగా పట్టించుకోకుండా.. హడావిడిగా ముందుకెళ్లకుండా.. ప్లానింగ్ ప్రకారం మూవ్ అయితే.. వచ్చే ఎన్నికల్లో బంపర్ మెజార్టీ వస్తుందని.. అప్పటి దాకా పక్కా ప్లానింగ్ తో వెళ్లాలి అని చూస్తున్నారట షర్మిల. అందుకే.. పార్టీ పెట్టేంత వరకు వినడానికే ఎక్కువ ఇంపార్టెన్స్ ఇస్తున్నారట. అవును కదా.. అలా వింటేనే.. అంతా తెలుస్తుంది.. తర్వాత తన మాట అందరూ వింటారు.. ఇదే షర్మిల ఫార్ములా కావచ్చు. గంగుల టార్గెట్ ఎవరు: తెలంగాణలో పార్టీ ఏర్పాటుపై షర్మిల వేగంగా పావులు కదుపుతున్నారు. ఇక పార్టీ నిర్మాణం, ఏర్పాటు చేసిన తర్వాత ఎలా ముందుకు సాగాలనే దానిపై దృష్టిపెట్టారు. కొత్త పార్టీ హడావిడి తెలంగాణలో ఇలా కొనసాగుతున్న వేళ అధికార టిఆర్ఎస్ పార్టీ నేతలు వైఎస్ షర్మిల పార్టీ పై ఆచితూచి స్పందిస్తున్నారు. చాలా మంది నేతలు ఈ అంశంపై మాట్లాడడానికి పెద్దగా ఆసక్తి చూపలేదు. కానీ ఎవరూ మాట్లాడకపోయినా తెలంగాణ మంత్రి గంగుల కమలాకర్ మాత్రం వైఎస్ షర్మిల పార్టీపై వరుసగా మాట్లాడటం ఆసక్తికరంగా మారింది. లోటస్ పాండ్ లో పలు రాజకీయ పార్టీలకు చెందిన నేతలు షర్మిలతో భేటీ అవుతున్నారు.

షర్మిల పార్టీ పై మిగిలిన రాజకీయ పార్టీల నేతలు ఆచితూచి స్పందిస్తూ ఉంటే..గంగుల కమలాకర్ షర్మిలను వరుసగా టార్గెట్ చేస్తూ మాట్లాడడం ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యింది. ఇప్పుడు జగనన్న బాణం షర్మిల వస్తోంది..తర్వాత జగన్, ఆ తర్వాత చంద్రబాబు వస్తారని అప్పుడు తెలంగాణలో కొట్లాటలు తప్పవని అంటున్నారు.అన్న,చెల్లి మధ్య గొడవ ఉంటే మీరు మీరు చూసుకోవాలని తెలంగాణలో పార్టీ ఎందుకంటూ కామెంట్స్ చేశాడు మంత్రి కమలాకర్. ఆంధ్రపెత్తనం వస్తే మళ్లీ కష్టాలొస్తాయనే సెంటిమెంట్ కామెంట్స్ సైతం గంగుల నోటి నుంచి వచ్చాయి. కేసీఆర్ని మనం కాపాడుకోవాలని, లేకపోతే ఇబ్బందులు వస్తాయని బహిరంగ వ్యాఖ్యలు చేశారు. అయితే ఈ వ్యాఖ్యలన్నీ గంగుల కమలాకర్ వ్యక్తిగతంగా అంటున్నవా లేక దీన్ని టిఆర్ఎస్ పార్టీ లైన్ గా చూడాల్సి ఉంటుందా అన్న చర్చ రాజకీయవ ర్గాల్లో జరుగుతోందట.

## నీటి ఆవిరితో విద్యుత్తు ప్లాంటు

మణుగూరు : సింగరేణి పరిధిలో భద్రాద్రి జిల్లా మణుగూరులో 'జియో థర్మల్ విద్యుత్తు ప్లాంటు' నిర్మాణానికి మార్గం సుగమమైంది. 20 కిలోవాట్ల సామర్థ్యంతో దేశంలోనే తొలిసారి ప్రయోగాత్మకంగా నిర్మించనున్న ఈ ప్రాజెక్టుకు కేంద్రం నుంచి తాజాగా రూ.1.72 కోట్లు మంజూరయ్యాయి. వేడినీటి ఆవిరి ద్వారా విద్యుదుత్పత్తి చేయడమే 'జియో' సాంకేతికత. ఇందుకు ఆర్గానిక్ ర్యాంకైన్ సైకిల్(ఓఆర్సీ) అనే అధునాతన పరిజ్ఞానాన్ని వినియోగించనున్నారు. పూర్తి పర్యావరణ హితమైన ఈ విధానం ద్వారా ఎల్లవేళలా విద్యుదుత్పత్తి చేయవచ్చు. మణుగూరు గ్రామీణ మండలం పగిడేరు పరిసరాల్లోని భూగర్భంలో సహజ సిద్ధంగా వేడి నీటిబుగ్గలు ఏర్పడ్డాయి. వీటి ఆధారంగా విద్యుదుత్పత్తి చేసే అవకాశాన్ని పరిశీలించాల్సిందిగా సింగరేణి యాజమాన్యం జియో లాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(జీఎస్ఐ)ను కోరింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధి బృందం 2019లో పగిడేరులో పరిశోధన చేసింది. అనంతరం వెయ్యి అడుగుల లోతైన భారీ బోరుబావిని తవ్వించారు. దాని నుంచి వెలువడే నీటిఆవిరి సాయంతో విద్యుదుత్పత్తికి అనుమతులు మంజూరుచేయాలని సింగరేణి కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కోరింది. స్పందించిన ఆ శాఖ తమ పరిశోధన, అభివృద్ధి విభాగం బృందాన్ని పంపి ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలను పరిశీలించింది.

# పులి దాడుల అడ్డుకట్టకు వ్యూహం

## -హైదరాబాద్ నుంచి కదంబా అటవీ ప్రాంతానికి జింకల తరలింపు



ఆసిఫాబాద్ : కాగజ్‌నగర్ అటవీప్రాంతం పరిధిలో 2016 నుంచి మొదలైన పెద్దపులుల వలస పరంపర కొనసాగు తోంది. పొరుగున ఉన్న మహారాష్ట్రలోని తడోబా-అందారి అటవీ ప్రాంతానికి కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్‌లోని కదంబా అటవీ ప్రాంతం పులులకు కారిడార్‌గా మారిన విషయం తెలిసిందే. అయితే ఒకప్పుడు దుప్పి, జింక, అడవి పందులు, మనుబోతులు, నీల్గాయి అడవి పందులు సమృద్ధిగా ఉండడంతో పులులు కేవలం అడవులకే పరిమితమై వాటిని వేటాడి జీవిస్తూ వచ్చాయి. క్రమంగా అడవిలో పులుల సంఖ్య పెరగడంతో ఆవాస పరమైన సమస్యలు మొదలయ్యాయి. అంతేకాకుండా శాకాహార జంతువులను అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు విచ్చల విడిగా వేట సాగించడంతో వాటి సంఖ్య క్రమంగా తగ్గిపోయింది. వన్యమృగాలకు ఆహారం కరువై అటవీ ప్రాంత గ్రామాల పరిధిలోని మైదాన ప్రాంతాలకు వచ్చి రైతుల పశుసంపదపై దాడులకు తెగబడు తున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఈక్రమం లోనే పెద్దపులులు దహెగాం మండలంలో ఓ యువకుడిని, పెంచికలపేట మండలం కొండ పల్లిలో మరో యువతిని చేనులో పని చేసుకుం టుండగా ఎర జంతువుగా భావించి పెద్దపులులు చంపేశాయి. అయితే ఈ రెండు ఘటనలలో దాడి చేసింది ఒకే పులా కాదా అన్నదానిపై నిపుణులకు ఇంకా స్పష్టత రాలేదు. మరోవైపు పత్తి చేలలో నక్కి గేదెలు, ఆవుల మందలపై దాడులకు పాల్పడుతున్న పెద్దపులులు కూడా వేర్వేరు ప్రాంతాలకు చెంది నవేనని అధికారులు భావిస్తున్నారు. మొత్తంగా జిల్లాలో అటవీ శాఖ అంచనాల ప్రకారం 12-14 వరకు పెద్దపులులు సంచరిస్తున్నాయి. ఇందులో ఇటీవలే మూడు పిల్లలకు జన్మనిచ్చిన ఓ ఆడపులి కూడా ఉన్నట్లు గుర్తించారు.

**అడవుల్లో శాకాహార జంతువుల కొరత**

కదంబా-కవ్వాల్ టైగర్ కారిడార్‌లో శాకాహార జంతువుల కొరత వల్లే పెద్దపులులు మనుషులపై, పశు సంపదపై దాడులకు తెగబడుతున్నాయని రాష్ట్ర అటవీ శాఖ ఓ నిశ్చితాభిప్రాయానికి వచ్చింది. దీంతో రాష్ట్రంలోని వివిధ పార్కులలో ఉన్న మచ్చల జింకలను పులులు సంచరించే కవ్వాల్-కదంబ అటవీ ప్రాంతాల్లో వదలాలని నిర్ణయించినట్లు తెలు స్తోంది. ఇందుకు హైదరాబాద్ పరిసరాల్లో వివిధ పార్కుల్లో పెద్దఎత్తున వృద్ధిచెందిన ఈ జింకలను బోనుల్లో సురక్షితంగా కవ్వాల్-కదంబా అటవీ ప్రాంతంలో వదిలేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు రాష్ట్ర పీసీసీఎఫ్ శోభ వెల్లడించడం గమనార్హం. ఇదిలా ఉండగా గతంలో కూడా ఇదే తరహాలో కొన్ని జింకలను తెచ్చి ఇక్కడి అడవుల్లో వదలగా అవి మనుషులతో సన్నిహితంగా ఉన్న జంతువులు కావ డంతో తరచూ ఆవాస ప్రాంతాల్లోకి వచ్చి వేటగాళ్లు, ఊర శునకాల బారిన పడి మృతి చెందాయి. ఈ క్రమంలోనే కరోనా లాక్‌డౌన్ విధించడంతో ఆవాస ప్రాంతాలకు వచ్చే శాకాహార జంతువులను వెతు క్కుంటూ పెద్దపులులు తరచూ జనావాసాలకు వచ్చిపోతుండడం వల్ల పులుల కదలికలు ఎక్కువగా కనిపిస్తు న్నాయని నిపుణులు చెబుతున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో కరోనా చికిత్సకు ఏర్పాటు చేయాలి



## - కలెక్టర్ కె శశాంక

కరీంనగర్ : జిల్లాలో కరోనా కేసులు పెరుగుతున్నందున ప్రభుత్వ ఆసుపత్రిలో కరోనా రోగులకు చికిత్స అందించుటకు వీలుగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కె శశాంక అన్నారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖాధికారులతో ప్రభుత్వ ఆసుపత్రులలో కరోనా చికిత్సకు ఏర్పాట్లు కరోనా పరీక్షలు, వ్యాక్సినేషన్‌పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతేడాది కరోనా సమయంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేసిన ఏర్పాట్ల ప్రకారం బెడ్స్, వెంటిలేటర్లు, ఆక్సిజన్, ఎక్విప్‌మెంట్ మొదలగు వసతుల కల్పనకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో ఎంతమంది కరోనా రోగులు వచ్చినా ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స అందించుటకు సిద్ధంగా ఉండాలన్నారు. మెడికల్ టీంలను పునరుద్ధరించి విధులు నిర్వహించుటకు సిద్ధంగా ఉంచాలని, అన్ని టీంలతో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన చర్యలపై సలహాలు, సూచనలు అందించాలన్నారు. ఆసుపత్రుల్లో కరోనా పరీక్షలకు వచ్చే వారికి, కరోనా వ్యాధితో ఆసుపత్రుల్లో చేరే వారికి వేర్వేరు గేట్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జమ్మికుంట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కరోనా చికిత్సకు ఏర్పాట్లు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కరోనా పరీక్షలను పెంచాలని అన్నారు. కరోనా సోకి హోం ఐసోలేషన్‌లో ఉండే వారికి కరోనా కిట్లు అందజేయాలని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రులలో రిసెప్షన్ సెంటర్ ఏర్పాటు చేసి రోగులకు సరైన సమాచారాన్ని అందించాలన్నారు. కరోనా రోగులను వెంటిలేటర్ ఉన్న అంబులెన్స్‌లో తరలించాలని సూచించారు. అందుకు అంబులెన్స్‌లో వెంటిలేటర్లు ఏర్పాటు చేయాలన్నారు. కరోనా చికిత్సకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లాలో 45 సంవత్సరాలపైబడిన వారందరూ కరోనా టీకా వేయించుకునేలా ప్రోత్సహించాలని పేర్కొన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ సుజాత, జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ రత్నమాల, ఆర్ఎంవో శౌరయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ జువేరియా, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ సబిత, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ రవీందర్ రెడ్డి, ఎంసీహెచ్ పరిపాలనాధికారి డాక్టర్ అలీం, మెడికకల్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# ఇన్‌చార్జీలతో ఇక్కట్లు

## కుంటుపడుతున్న పాలన - కొత్త మండలాల్లోనూ ఇదే పరిస్థితి.. ముందుకు సాగని పనులు

నాగర్‌కర్నూల్ :పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన కొత్త జిల్లాల్లో పాలన పడకేసింది. పూర్తి స్థాయి అధికారులను నియమించడంలో జరుగుతున్న జాప్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్తగా ఏర్పాటు చేసిన మండలాల్లో కూడా ఇన్‌చార్జీల పాలనే కొనసాగుతుండడంతో సమస్యలు పరిష్కారం కాక జనం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఇన్‌చార్జీలుగా వ్యవహరిస్తున్న అధికారులు ఒత్తిడి భరించలేక శాఖలపై పట్టు సాధించలేక పోతున్నారు. దీంతో కింది స్థాయి అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటగా వ్యవహారం కొనసాగుతోంది.

**కీలక శాఖలకు వారే దిక్కు...** పాలనలో అత్యంత కీలకంగా వ్యవహరించే 23 శాఖలకు సంబంధించి అత్యధికంగా ఇన్‌చార్జీలే ఉండడం గమనార్హం. నాగర్‌కర్నూల్ జిల్లా రెవెన్యూ అధికారిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న మధుసూదన్‌నాయక్‌కు అడిషనల్ కలెక్టర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, డీఆర్‌డీవోగా బాధ్యతలు అప్పజెప్పారు. జిల్లా రెవెన్యూ అధికారిగా మిగతా ఉద్యోగులతో సమన్వయంతోపాటు రెవెన్యూ పరమైన అంశాలకు సంబంధించి పూర్తి స్థాయిలో దృష్టి సారించాల్సిన నేపథ్యంలో.. ఇతర శాఖలకు సంబంధించిన వ్యవహారాలు చక్కదిద్దడానికి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. చెంచు పెంటలు అధికంగా ఉన్న నల్లమలలో వారి సంక్షేమం కోసం ఐటీడీఏకు ప్రత్యేకంగా అధికారి లేకపోవడంతో కూడా అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. జిల్లా గిరిజన అభివృద్ధి సంస్థ అధికారికి ఐటీడీఏ సీవోగా బాధ్యతలు అప్పజేప్పడంతో ఆయన తాను ప్రధానంగా బాధ్యతలు నిర్వహిస్తున్న శాఖపై కూడా పూర్తిస్థాయి పట్టు సాధించలేకపోతున్నారు. ప్రభుత్వం అట్టహాసంగా ప్రకటించిన కొత్త మండలాల్లో కూడా పూర్తిస్థాయిలో అధికారులను నియమించకపోవడం తలనొప్పిగా మారింది. ఆ మండలాల్లో ఇంకా ఇన్‌చార్జీల వ్యవస్థనే కొనసాగుతోంది. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్‌ను బాధ్యతను తహసీల్దార్లకు అప్పజెప్పిన ప్రభుత్వం రెవెన్యూ కార్యాలయాల్లో సిబ్బంది నియామకాన్ని చేపట్టకపోవడంతో ప్రయోజనం చేకూరడం లేదు.



# విద్యాసంస్థలను తెరిచేందుకు అనుమతి ఇవ్వాలి

కరీంనగర్ : కరోనా సెకండ్ వేవ్‌తో పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్నాయనే కారణంతో రాష్ట్ర ప్రభుత్వం విద్యాసంస్థలకు తాత్కాలిక సెలవులు ప్రకటించి మూసివేయించడం అప్రజాస్వామికమని, వెంటనే విద్యాసంస్థలను తెరిచేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని తెలంగాణ గుర్తింపు పొందిన పాఠశాల నిర్వహణ సంఘం (ట్రస్మా) కోరింది. ట్రస్మా జిల్లాశాఖ ఆధ్వర్యంలో దాదాపు 150 మంది కరస్పాండెంట్లు, సిబ్బంది కలెక్టర్ కె.శశాంకను కలిసి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో విద్యాసంస్థలకు కలిగిన నష్టాన్ని, సమస్యలను వివరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి న్యాయం చేయాలని కోరారు ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు మాట్లాడుతూ ట్రస్మాలో 10వేల ప్రైవేట్ పాఠశాలల సభ్యత్వాలు తీసుకున్నారని, దాదాపు 30 లక్షలకు పైగా విద్యార్థులు అంటే దాదాపు 55శాతం ప్రైవేట్ పాఠశాలల్లోనే విద్యనభ్యసిస్తున్నారని, విద్యాసంస్థల మూసివేత నిర్ణయంపై కనీసం తమతో చర్చించలేదని, సమాచారం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. రాజకీయ పరిశీలనతో ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఆరోపిస్తూ ఏ శాస్త్రీయ ఆధారంగా సెలవులు ఇచ్చారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ నిర్ణయాన్ని ట్రస్మా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఇకపై ప్రభుత్వం ఇలాంటి ఏకపక్ష నిర్ణయాలను మానుకొని ప్రజాభీష్టం మేరకు నిర్ణయాలు తీసుకోవాలని కోరారు.



మూడు నుంచి ఆరువారాల క్రితం తెరచిన పాఠశాలలను కొనసాగించకుండా తెలంగాణ విద్యార్థులకు కోలుకోలేని నష్టానికి గురి చేశారని ఆరోపించారు. ప్రైవేట్ ఉపాధ్యాయులు మరోసారి రోడ్డుపైకి వచ్చారని ఆవేదన చెందారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నాడిని గమనించి విద్యాసంస్థలు తెరిపించే విధంగా ప్రభుత్వానికి నివేదించాలని కోరారు.కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర సలహాదారుడు ఈ.ప్రసాదరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మారెడ్డి, శ్రీను, జిల్లా అధ్యక్షుడు కోరం సంజీవరెడ్డి, కార్యదర్శి దాసరి శ్రీపాల్‌రెడ్డి, కోశాధికారి గాజుల తిరుపతి, పట్టణ అధ్యక్షుడు సిహెచ్.శ్రీనివాస్‌రావు, కార్యదర్శి నరేశ్‌కుమార్, రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ ముస్తాక్, హుజు రాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సంపత్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి ఆదిలాబాద్ మరో కాశ్మీర్‌గా విరాజిల్లుతోంది

ఖానాపూర్ : భారతదేశానికి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఉత్తర కశ్మీర్‌గా విరాజిల్లుతోందని రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్ శివారులో నిర్మిస్తున్న అర్బన్‌పార్కు పనులకు మంత్రి శంకుస్థాపన చేసి మాట్లాడారు. రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చాలని ముఖ్యమంత్రి కేసీఆర్ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగానే రాష్ట్రంలోని 107 మున్సిపాలిటీల పరిధిలో అర్బన్ పార్కుల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా 50 పార్కుల నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. హరితహారంతో అడవుల పెంపకంలో దేశంలోనే తెలంగాణ మొదటిస్థానంలో నిలవబోతుందని మంత్రి అల్లోల ప్రకటించారు. అనంతరం పార్క్‌లో మంత్రి ఐకేరెడ్డి మొక్కలు నాటారు. ఖానాపూర్ ప్రాంతంలో పార్కు ఏర్పాటు చేయాలని ఇక్కడి ప్రజల చిరకాలవాంఛ నా హయాంలో నెరవేరడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ అన్నారు. కడెం, సదర్‌మాట్, కవ్వాల్ టైగర్‌జోన్ తదితర ప్రాంతాలతో ఈ ప్రాంతం ఇప్పటికే ఎన్నో ప్రకృతి అందాలను తనలో ఇనుమడింపజేసుకుందని ఇప్పుడు ఈ పార్కు ఏర్పాటుతో ఖానాపూర్ నియోజకవర్గం మరింత ఆహ్లాదభరితంగా మారుతుందని ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, అదనపు కలెక్టర్ హేమంద్, సీసీఎఫ్ వినోద్‌కుమార్, ఎఫ్‌డివో కోటేశ్వర్‌రావు, ఖానాపూర్ ఎంపీపీ అబ్దుల్ మోయిద్, స్థానిక మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్‌చైర్మన్ అబ్దుల్ ఖలీల్, మార్కెట్ కమిటి చైర్మన్ కడార్ల గంగనర్సయ్య, వైస్ చైర్మన్ చెనిగారపు శ్రావణ్‌కుమార్, మాజీ ఎఫ్‌ఏసిఎస్ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి మాజీ జడ్‌పీటీసీ రాథోడ్ రామునాయక్, కౌన్సిలర్‌లు కావలి సంతోష్, కుర్మ శ్రీను, రాజూరా సత్యం, కోఆప్షన్ సభ్యులు బండారి కిషోర్, టీఆర్ఎస్ పార్టీ ఖానాపూర్, పెంబి మండలాధ్యక్షులు రాజగంగన్న, పుప్పాల శంకర్, నాయకులు కొక్కుల ప్రదీప్, బక్కశెట్టి కిషోర్, జన్నారపు శంకర్ పరిమి సురేష్, ఎఫ్ఆర్‌వో వినాయక్, డిప్యూటీ రేంజ్ అధికారి రత్నాకర్‌రావుతో పాటు ఖానాపూర్ డివిజన్ పరిధిలోని అటవీశాఖ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



**రైతుల సంఘటితం కోసమే రైతు వేదికలు**

సోన్ : రైతులందరిని సంఘటితం చేసి సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం రైతు వేదికలను ప్రారంభించడం జరుగుతుందని మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. మండలంలోని కడ్తాల్ గ్రామంలో రైతు వేదికలను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు వ్యవసాయ చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలన్నారు.

ఢిల్లీలో గత వంద రోజులుగా రైతులు ఆందోళన చేస్తున్న పట్టించుకోవడం లేదన్నారు. రైతే రాజుగా చెబుతున్న కేంద్ర ప్రభుత్వం రైతుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ విజయలక్ష్మి, జిల్లా కలెక్టర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, అదనపు కలెక్టర్ హేమంత్ బోర్కడే, గ్రామ సర్పంచ్ బర్మ లక్ష్మి, టీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ గౌడ్, ప్రముఖ పారిశ్రామిక వేత్త అల్లోల మురళీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కృష్ణప్రసాద్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు మోహినోద్దీన్, తదితరులు ఉన్నారు.

**అడవులను కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరిది**

సారంగాపూర్ : అడవులను కాపాడే బాధ్యత ప్రతీ ఒక్కరిదని న్యాయ, పర్యావరణ, అటవీ, దేవాదాయశాఖ మంత్రి అల్లోలఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని అడెల్లి మహాపోచమ్మ దేవాలయం వద్ద అటవీ ప్రాంతంలో గల ఉద్యానవనంలో నిర్మించిన కిచెన్‌షెడ్లను ప్రారంభించి మాట్లాడా రు. ప్రజల కోసమే ఉద్యానవనాలను నిర్మించడం జరిగిందని అన్నారు. అడెల్లి దేవాలయంలో మొక్కులు తీర్చుకొని వచ్చిపోయే భక్తుల సౌకర్యం కోసం అటవీ శాఖ ఆధ్వర్యంలో కిచెన్ షెడ్లను నిర్మించడం జరిగిందన్నారు. అటవీ ప్రాంతంలో మొక్కలను పెంచడం కోసం ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. ఉద్యాన వనాలను పచ్చదనం, పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. అనంతరం అధికారుల తో కలిసి సహపంక్తి భోజనాన్ని చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముషారఫ్ ఫారూఖీ అలీ, మంత్రి సోదరుడు అల్లోల మురళీధర్‌రెడ్డి, జడ్పీ చైర్మన్ విజయ లక్ష్మి రాంకిషన్ రెడ్డి, ఎంపీపీ అట్ల మహిపాల్ రెడ్డి, జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, సొసైటీ చైర్మన్‌లు నారాయణ రెడ్డి, మాణిక్ రెడ్డి, దేవాలయం చైర్మన్ ఐటీ చందు, పార్టీ సర్పంచ్ సముద్రాల సుచరిత రాజేశ్వర్, పార్టీ మండలాధ్యక్షుడు మాధవ్‌రావు, అటవీశాఖ అధికారులు, నాయకులు ఉన్నారు.

# నాణ్యతా ప్రమాణాలతో అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

## - మున్సిపల్ కమిషనర్ వల్లూరి క్రాంతి



కరీంనగర్: నగరంలో వివిధ పథకాల ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ వల్లూరి క్రాంతి కాంట్రాక్టర్లను ఆదేశించారు. అల్కాపురికాలనీలో 20 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను కార్పొరేటర్ ఐలేందర్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కమిషనర్ మాట్లాడుతూ నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా మురుగునీటి కాలువ నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. అలాగే గతంలో ప్రారంభించిన పార్కు నిర్మాణ పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈఈ రామన్, డీఈ ఓంప్రకాశ్, ఏఈ వాణి తదితరులు పాల్గొన్నారు. నగరంలోని వైకుంఠధామాలన్నిటిని ప్రశాంత వాతావరణం ఉండే విధంగా అన్ని సౌకర్యాలతో సుందరీకరిస్తామని మున్సిపల్ కమిషనర్ వల్లూరి క్రాంతి అన్నారు. గురువారం ఏడవ డివిజన్ పరిధిలోని హౌజింగ్‌బోర్డుకాలనీలోని మానేరు హిందూ శ్మశానవాటికను సందర్శించారు. వైకుంఠధామం సుందరీకరణ పనులు చివరి దశకు చేరుకున్నాయన్నారు. స్నానపు గదులు, మరుగుదొడ్లు, చితివాటికలు, వాటర్‌పౌంటేన్లు, కర్మకాం వసతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రతినెల రాష్ట్ర ప్రభుత్వం నుంచి మున్సిపల్ కార్పొరేషన్‌కు మంజూరవుతున్న పట్టణ ప్రగతి నిధులతో వైకుంఠధామాలను అభివృద్ధి చేస్తామన్నారు. కార్పొరేటర్ ఆకుల ప్రకాశ్, ఈఈ రామన్, డీఈ ఓంప్రకాశ్, ఏఈ వాణి తదితరులు పాల్గొన్నారు. అల్గునూర్ వంతెనపై చేపడుతున్న మిషన్ భగీరథ పైలాన్ పనులను వేగంగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ వల్లూరి క్రాంతి కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పైలాన్ పనులను పరిశీలించారు. అల్గునూర్ వంతెనల మధ్యన 37 లక్షల రూపాయలతో మిషన్ భగీరథ వాటర్ పైలాన్‌ను ఆకర్షణీయంగా తీర్చిదిద్దే పనులు చేపడుతున్నామని చెప్పారు. అనంతరం అక్కడే చేపట్టనున్న అంబేద్కర్ విగ్రహ ఏర్పాట్లను పరిశీలించారు. డీసీపీ యెల్ల సుభాష్, డీఈ ఓంప్రకాశ్, ఏఈ వాణి తదితరులు పాల్గొన్నారు.

# బల్దియాల్లో ఆక్రమణలపై ఉక్కుపాదం

జగిత్యాల : బల్దియాల్లో ఆక్ర మణలపై అధికారులు ఉక్కు పాద మోపుతున్నారు. కలెక్టర్ రవి ఇందుకోసం ప్రత్యేకచర్యలు తీసు కుం టున్నారు. అక్రమనిర్మాణాల నివారణకు ప్రత్యేక అధి కార బృందాలను ఏర్పరిచారు. వారంలో ఒకరోజు సర్వే నిర్వహించి ఆక్రమణలను గుర్తిస్తున్నారు. అక్రమ నిర్మాణాలు జరగకముందే నిలిపివేయడానికి చర్యలు తీసుకోవడానికి సిద్ధం అవుతున్నారు. అధికారుల హెచ్చరికలను పెడచెవిన పెట్టి నిర్మాణాలు చేస్తే ప్రభుత్వ ఆదేశాలమేరకు కూల్చివేతకు వెనుకాడేది లేదన్న సంకేతాలను పంపుతున్నారు. దీంతో జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, ధర్మపురి, రాయికల్ మున్సిపాల్టీల్లో అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వ్యక్తుల్లో గుబులు నెలకొంది.

**టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిటీల ఏర్పాటు..**బల్దియాల్లో అక్రమ నిర్మాణాల నివారణకు జిల్లాస్థాయిలో వివిధ శాఖ ఉన్నతాధికారులతో కూడిన టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, స్క్వాడ్ కమిటీలను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఐదు మున్సిపాల్టీలు, మూడు రెవెన్యూ డివిజన్లలో అక్రమ నిర్మాణాలను నివారించడానికి సంబంధిత బృందాలు నిరంతరం పర్యవేక్షణ జరపనున్నాయి. రెవెన్యూ, మున్సిపల్, ఆర్అండ్‌బీ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులతో జిల్లాస్థాయి బృందాలను ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్, సోషల్‌మీడియాల్లో వచ్చే ప్రతీ ఫిర్యాదులపై ఈ కమిటీ సభ్యులు జాయింట్‌గా తనిఖీలు నిర్వహించి చర్యలు తీసుకునేలా జాగ్రత్తలు తీసుకుంటు న్నారు. టీఎస్ ఐపాస్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరిగేతే నివారించడానికి బృందాలు కృషి చేయనున్నాయి. అక్రమ నిర్మాణాలను గుర్తించి ఫొటోలు, వీడియోలు తీసి ప్రభుత్వానికి నివేదిక సమర్పించిన అనంతరం వచ్చిన ఆదేశాలతో కూల్చివేతలు సైతం చేయడానికి అధికారులు సమాయత్తం అవుతున్నారు.

అక్రమ నిర్మాణాల నివారణలపై ఆలస్యం జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులను చేయనున్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్మాణాలు జరుపు కోవాలని భవన యజమానులకు అవగాహన కల్పించడంతోపాటు ఉల్లంఘిస్తే చర్యలు సైతం తీసుకునేలా అధికారులు అడుగులు వేస్తున్నారు.

# ఆసాములు, కార్మికులకు కూలి పెంచకుంటే ఆమరణ దీక్ష



సిరిసిల్ల : ఆసాములు, కార్మికులకు బతుకమ్మ చీరల కూలి పెంచకుంటే ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ ప్రకటించారు. బతుకమ్మ చీరల తయారీ కూలి పెంచాలని ఆసాములు, కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా సిరిసిల్ల పట్టణంలోని సాయిబాబా ఆలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి తెలంగాణ పవర్ లూం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూరపాటి రమేష్ మద్దతు ప్రకటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలిపెంచాలని నాలుగురోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు, యజమానులు పట్టించుకోక పోవడం శోచనీయమన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కేటీఆర్ స్పందించాలని, యజమానులతో మాట్లాడి కూలి పెంచే విధంగాచర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో తెలంగాణ పవర్‌లూం వర్కర్స్ యూనియన్, సీఐటీ యూల అధ్వర్యంలో ఆమరణ నిరాహారదీక్ష చేపట్టనున్నట్లు చెప్పారు. సమావేశంలోఅసాముల సమన్వయ కమిటీ అధ్యక్షుడు పోరండ్ల రమేష్, తెలంగాణపవర్‌లూం వర్కర్స్ యూ నియన్ రాష్ట్ర అధ్యక్షుడు మూషం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

Printed, Published & Owned by Gogireddy Brahma Reddy, Printed at Siri Printers, H.No: 4-319, Sagar Road, Haliya-508377, Dist.: Nalgonda, State: Telangana., Published from Siri Publications, H.No: 4-319, Sagar Road, Haliya-508377, Dist.: Nalgonda, State: Telangana., Editor: SITHARALA SRIRAMULU, Cell: 8985684523, Email: editorjournalistdiary@gmail.com, RNI No. TELTEL/2015/32524.